సాహిత్య సౌందర్యం

S.E.P. - 2024

I Semester Telugu Textbook for
B.Sc. (Biological / Life Science / Computer Application / Data Analysis / Clinical Nutrition)
B.Sc. (General) / B.Sc. (Home Science) /
B.Sc.(FAD) / B.Sc.(IDD)

ప్రధాన సంపాదకులు

ఆచార్య కె. ఆశాజ్యోతి

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ

బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి ప్రాంగణం

బెంగళూరు - 560 056

సాహిత్య సౌందర్యం

S.E.P. - 2024

I Semester Telugu Textbook for
B.Sc. (Biological / Life Science / Computer Application / Data Analysis / Clinical Nutrition)
B.Sc. (General) / B.Sc. (Home Science) /
B.Sc.(FAD) / B.Sc.(IDD)

ప్రధాన సంపాదకులు

ఆచార్య కె. ఆశాజ్యోతి

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ

బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి ప్రాంగణం
బెంగళూరు - 560 056

SAHITYA SOUNDARYAM: A Prescribed Telugu Textbook for I Semester B.Sc. (Biological / Life Science / Computer Application / Data Analysis / Clinical Nutrition) B.Sc. (General) / B.Sc. (Home Science) / B.Sc.(FAD) / B.Sc.(IDD) Degree Classes, Chief Editor: Prof. K. Asha Jyoti, Chairperson, Dept. of Studies in Telugu, Bangalore University; Published by Bangalore University, Jnanabharathi Campus, Bengaluru - 560 056; pp x + 120

© బెంగళూరు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ: 2024

ప్రధాన సంపాదకులు:

ఆచార్య కె. ఆశాజ్యోతి

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ

బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి, బెంగళూరు-560 056

ప్రకాశకులు :

నిర్దేశకులు

ప్రసారాంగ, మరియు ముద్రణాలయ విభాగం

బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి ప్రాంగణం బెంగళూరు - 560 056

ముద్రణ:

బెంగళూరు విశ్వవిద్యాలయం, జ్ఞానభారతి ప్రాంగణం, బెంగళూరు-560 056

ఉపాధ్యక్షులవారి మాట

కర్ణాటక ప్రభుత్వం యొక్క కొత్త రాష్ట్రీయ విద్యా విధానం-2024 అభ్యాస ఫలితాలు మరియు విజయాల సమతుల్యతను నొక్కి చెబుతుంది. కళలు మరియు శాస్త్రాలు, వాణిజ్యం, స్వచ్ఛమైన విద్యా కార్యకలాపాలు, వృత్తిపరమైన విద్య మరియు పాఠ్యేతర కార్యకలాపాల మధ్య పరిపూరకరమైన సంబంధం ఉండాలనేది దీని ప్రధాన ఆకాంక్ష. విద్యా వ్యవస్థలో మరియు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో భాషలు కీలక పాత్ర పోషిస్తాయని కొత్త విద్యావిధానం గుర్తించింది. మారుతున్న ప్రాంతీయ, జాతీయ మరియు ప్రపంచ దృగ్విషయాలకు అనుగుణంగా విద్యా నమూనాను రూపొందించడం దీని ప్రాథమిక లక్ష్యం. సమకాలీన సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులను బలమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాలనేది ఆశ.

బెంగళూరు విశ్వవిద్యాలయం పాఠ్యాంశాలు, పాఠాల అభ్యాసం మరియు అభ్యాసం యొక్క మూల్యాంకనంలో ఆవిష్కరణలను అవలంబించింది. విద్యార్థులను చురుగ్గా ఉండేలా ప్రోత్సహించడానికి, విద్యావ్యవస్థలో పురోగతికి పూర్తి స్వేచ్ఛ, సమానత్వంగా స్వీకరించడానికి ప్రోత్సహించింది. భావవ్యక్తీకరణ నైపుణ్యాలతో పాటు వివిధ విభాగాల అనుసంధానం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించడం; తెలుగు గ్రంథాలు నాలుగు మరియు నాలుగు సంవత్సరాల మల్టీడిసిప్లినరీ డిగ్రీ కోర్సులలో కమ్యూనికేషన్‌తో పాటు భాష, సాహిత్యం, సంస్కృతి మరియు విలువలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

I Semester Telugu Textbook for B.Sc. (Biological / Life Science / Computer Application/Data Analysis/Clinical Nutrition) B.Sc. (General) / B.Sc. (Home Science) / B.Sc.(FAD) / B.Sc.(IDD) మొదలైన డిగ్రీ కోర్సుల మొదటి నాలుగు సెమిస్టర్లలో భాష మరియు సాహిత్యం బోధించేటప్పుడు విషయప్రధానమైన పాఠ్య గ్రంథాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ పాఠ్యగ్రంథాలు తయారు చేయడానికి పూనుకొనడం జరిగింది. సంబంధిత కోర్సులకు పాఠ్యరచన చేస్తున్నప్పుడు మానవీయ విలువలు, సామాజిక సమస్యలపై

అవగాహన కలిగించే సాహిత్యం కంటే అంశాలను దృష్టిలో ఉంచుకుని పాఠ్యరచన రూపొందించే ప్రయత్నం జరిగింది. భాషా అధ్యయనంలో విద్యార్థుల నైపుణ్యానికి ప్రాధాన్యత ఉంటుంది. పాఠ్యప్రణాళికా సంఘం నిర్ణయంతో, సంపాదకుల కృషితో పాఠ్య గ్రంథాలను సిద్ధం చేసింది ప్రస్తుతం మొత్తం ప్రణాళికకు ఎడిటర్-ఇన్-చీఫ్‌గా పనిచేస్తున్న తెలుగు అధ్యయన శాఖాధ్యక్షులు ఆచార్య కె. ఆశాజ్యోతిగారు. వివిధ డిగ్రీలకు, ఐచ్ఛిక తెలుగు, ఓపెన్-ఛాయిస్ తెలుగును సిద్ధంచేశారు. తెలుగేతరులకు తెలుగు నేర్పే ప్రయత్నం జరుగుతోంది. ఆచార్య ఆశాజ్యోతిని మరియు అధ్యయన మండలి సభ్యులు ఆచార్య ఎం.రామనాథం నాయుడు, ఆచార్య వై. రెడ్డిశ్యామల, ఆచార్య, ఎన్.వి. కృష్ణారావు, డా॥ డి.కె. ప్రభాకర్‌లను అభినందిస్తున్నాను.

కర్ణాటక రాష్ట్రీయ విద్యా విధానం-2024లో రూపొందించిన ఈ పాఠ్య గ్రంథాలను తక్షణమే ముద్రించి తీసుకురావడం హర్షణీయం. ప్రసారాంగ సంచాలకులు ఆచార్య సి. నాగభూషణ మరియు విశ్వవిద్యాలయ ముద్రణాలయ సిబ్బందిని అభినందిస్తున్నాను.

ప్రొ॥ డా॥ జయకర ఎస్.ఎం.
ఉపాధ్యక్షులు
బెంగళూరు విశ్వవిద్యాలయం
బెంగళూరు-560 056

సంచాలకులవారి మాట

అధ్యయన మండలి మరియు పరిశీలనా సంఘం సిఫారసుల మేరకు కొత్త రాష్ట్రీయ విద్యా విధానం-2024 కు అనుగుణంగా స్నాతన తరగతుల కోసం బెంగళూరు విశ్వవిద్యాలయం భాషాపాఠాలు, ఐచ్ఛిక తెలుగు మరియు శిక్షణ తెలుగు పాఠ్య పుస్తకాలను తెలుగు అధ్యయన శాఖ సిద్ధం చేసింది.

ప్రస్తుతం బి.ఎస్సీ.(జనరల్) /బి.ఎస్సీ (బైలాజికల్/లైఫ్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్/డాటా ఎనాలసిస్/ క్లినికల్ న్యూట్రిషన్) /బి.ఎస్సీ (ఎఫ్.ఏ.డి)/బి.ఎస్సీ (హెూమ్‌సైన్స్)/బి.ఎస్సీ (ఐడిడి) డిగ్రీ కోర్సుకు తెలుగు భాషా పాఠ్యపుస్తకం తయారుచేసి ప్రచురణకు పంపడమైంది. దీని తయారీలో మార్గదర్శకత్వం వహించిన అధ్యయన మండలి (బోర్ట్ ఆఫ్ స్టడీస్) అధ్యక్షులు ఆచార్య కె. ఆశాజ్యోతి గారు మరియు మోడరేటర్‌గా వ్యవహరించిన అధ్యయన మండలి సభ్యులు ఆచార్య ఎం.రామనాథం నాయుడు, ఆచార్య వై. రెడ్డిశ్యామల, ఆచార్య, ఎన్.వి. కృష్ణారావు, డా. డి.కె. ప్రభాకర్ లకు ధన్యవాదాలు. ప్రచురణ ప్రతిని సిద్ధం చేసి విద్యార్థులకు నేర్చుకునే అవకాశం కల్పించిన సంపాదకులకు, తమ విలువైన రచనలను ఉపయోగించుకోవడానికి అనుమతి నిచ్చిన రచయితలందరికీ నా ధన్యవాదాలు. ఈ రచనను ఇంత వేగంగా ముద్రించడానికి అనుమతించిన ఉపకులపతి ఆచార్య జయకర ఎస్.ఎం. గారికి మరియు ముద్రణాలయ సిబ్బందికి నా ధన్యవాదాలు,

ఆచార్య సి. నాగభూషణ
సంచాలకులు, ప్రసారాంగ & ప్రచురణాలయం
బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు-560056

ఆచార్య కె. ఆశాజ్యోతి
శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి, బెంగుళూరు – 560056

ముందుమాట

బెంగళూరు విశ్వవిద్యాలయం డిగ్రీ కళాశాలలో బి.ఎస్సీ.(జనరల్) /బి.ఎస్సీ (బైలాజికల్/లైఫ్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్/డాటా ఎనాలసిస్/ క్లినికల్ న్యూట్రిషన్) /బి.ఎస్సీ (ఎఫ్.ఏ.డి)/బి.ఎస్సీ (హెూమ్‌సైన్స్)/బి.ఎస్సీ (ఐడిడి) కోర్సు చేస్తూ, తెలుగు రెండవ భాషగా ఎన్నుకున్న విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశాలు ఈ 'సాహిత్య సౌందర్యం' పుస్తకంలో ఉన్నాయి. పాఠ్య ప్రణాళికా సంఘం విద్యార్థుల కోసం నిర్దేశించిన పాఠ్యప్రణాళికలో రెండు భాగాలున్నాయి. అందులో మొదటిభాగమైన "ప్రాచీన సాహిత్యం"లో – నన్నయ ఆంధ్రమహాభారతంలోని 'శకుంతలోపాఖ్యానం', తిక్కనగారి 'హితోక్తి', శ్రీనాథుని కాశీఖండంలోని 'గుణనిధికథ' అనేవి పొందుపరచడం జరిగింది.

ఈ 'సాహిత్య సౌందర్యం'లో రెండవ భాగమైన "పదసాహిత్యం"లో – 'పదసాహిత్య వికాసం', 'అన్నమయ్య సంకీర్తనల సౌరభం', 'క్షేత్రయ్య పదాలు', 'సారంగపాణి పదాల'తో పాటు సంధులు–సమాసాలను పొందుపరచడం జరిగింది. పైన సూచించిన కోర్సు విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పాఠ్యపుస్తకం "సాహిత్య సౌందర్యం".

ఆచార్య కె. ఆశాజ్యోతి
శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి, బెంగళూరు–560056

సాహిత్య సౌందర్యం

మొదటి సెమిస్టర్

S.E.P. - 2024

I Semester Telugu Textbook for B.Sc. (Biological / Life Science / Computer Application / Data Analysis / Clinical Nutrition) B.Sc. (General) / B.Sc. (Home Science) / B.Sc.(FAD) / B.Sc.(IDD)

I. ప్రాచీన సాహిత్యము

1. శకుంతలోపాఖ్యానము – నన్నయ 1
2. హితోక్తి – తిక్కన 22
3. గుణనిధి – శ్రీనాథుడు 29

II. పద సాహిత్యము

1. పద సాహిత్య వికాసము 45
2. అన్నమయ్య సంకీర్తనల సౌరభం 55
3. క్షేత్రయ్య పదములు 70
4. సారంగపాణి పదములు 84

III. వ్యాకరణము

1. సంధులు – సవర్ణదీర్ఘ సంధి, గుణ సంధి, త్రిక సంధి, యడాగమ సంధి 102
2. సమాసములు – షష్ఠీ తత్పురుష, సప్తమి, బహువ్రీహి, ద్వంద్వము 113

I. ప్రాచీన సాహిత్యం

1. శకుంతలోపాఖ్యానము

(నన్నయభట్టు–ఆంధ్రమహాభారతము ఆది పర్వము–చతుర్థాశ్వాసము 5వ పద్యం నుండి 110వ పద్యం వరకు)

కవి పరిచయం:

సంస్కృతంలో వేదవ్యాస మహర్షి రచించిన మహాభారతం పంచమవేదంగా ప్రసిద్ధి చెందింది. కవిత్రయంగా ప్రఖ్యాతి గాంచిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱన అనే మహాకవులు భారతాన్ని ఆంధ్రీకరించారు.

నన్నయ క్రీ.శ. 1002 మొదలు 1061 వరకు జీవించిన చాళుక్య ప్రభువైన రాజరాజనరేంద్రుని ఆస్థాన కవి. ఇతని జన్మస్థలం గురించిగాని, తల్లిదండ్రుల గూర్చిగాని నిశ్చయంగా చెప్పటానికి తగిన ఆధారాలు లేవు.

భారతావతారికను బట్టి నన్నయ రాజరాజనరేంద్రునికి అనురక్తుడనీ, కులబ్రాహ్మణుడనీ, అవిరళజపహోమతత్పరుడనీ, వివులశబ్దశాసనుడనీ, సంహితాభ్యానుడనీ, బ్రహ్మాండాది నానాపురాణవిజ్ఞాననిరతుడనీ, ముద్గలగోత్రుడనీ, లోకజ్ఞుడనీ, ఉభయభాషాకావ్యరచనాభిశోభితుడనీ, నిత్యసత్యవచనుడనీ తెలుస్తుంది.

నన్నయకు ఆదికవి, వాగనుశాసనుడు లేక శబ్దశాసనుడు అనే బిరుదులున్నాయి. ఆయన తెలుగులో ఉత్తమమైన మహాభారతాన్ని సలక్షణమైన భాషలో మొట్టమొదట రచించాడు. ఆవిధంగా గురుపద్య విద్యకు ఆద్యుడు గనుక ఆయనకు ఆదికవి అనే బిరుదు సార్థకమయింది. తొలి రోజులలో తెలుగు భాషా స్వరూప స్వభావాలను స్థిరీకరించి మహాభారతంలో ప్రయోగించటం వల్ల ఆయనకు శబ్దశాసనుడనే బిరుదు వచ్చింది.

నన్నయ భారతాన్ని నైతిక దృష్టితోనే కాక కావ్యకళా దృష్టితోను తెనిగించాడు. కథాకథనంలోను, వర్ణనా విధానంలోను, రసపోషణలోను, పాత్రచిత్రణలోను, నన్నయ రచన విశిష్టంగా కనిపిస్తుంది.

ప్రసన్న కథాకలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థ సూక్తినిధిత్వం అనేవి నన్నయ కవితా లక్షణాలు నన్నయ ఆది సభా పర్వాలను పూర్తిగాను, అరణ్యపర్వం చతుర్థాశ్వాసంలో 141వ పద్యం వరకు భారతాన్ని తెనిగించాడు.

ప్రస్తుత పాఠ్యాంశం నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం, చతుర్థాశ్వాసం నుంచి గ్రహించబడింది.

శకుంతలోపాఖ్యానము

వ. త్రసునకుఁ గాళింది యనుదాని[1]కి నీలినుండు పుట్టె వానికి రథంతరి యనుదానికి దుష్యంతుండు పుట్టెఁ బుట్టి యనన్య సాధారణ గుణయుక్తుండై. 1

క. బాలహరిణములఁ బట్టెడు,
[2]లీలను విషమాటవీ చలిత కేసరి శా
ర్దూలేభశరభములఁ దన
బాలత్వమునంద యెగిచి పట్టుచు మఱియున్. 2

క. ఉర్వీరుహనివహముతోఁ,
బర్వతములు వెఱికి యొండు పర్వతములపైఁ
బర్వఁగ వైచుచు యౌవన
గర్వంబున నొప్పె నుర్విఁ గడు నధికుండై. 3

1. 'కిలిలుండు' అనునది తప్పు. సంస్కృతమున 'ఈలినం తు నుతతంసుర్జనయామాస': 'ఈలినో జనయామాస దుష్యన్తమ్' అనియున్నది.
2. లీల మహాటవికిఁ జని చలింపక మృగశా.

శా. ఆదుష్యంతుఁ డనంతసత్త్వుఁడు సమస్తాశాంతమాతంగ మ
ర్యాదాలంకృత మైన భూవలయ మాత్మాయత్తమైయుండఁగా
నాది త్యాంశుసమీర దుర్గమ మహోగ్రారణ్య దేశాళితో
నాదిక్ష క్త్ర చరిత్ర నేలె నజితుండై బహువీర్యంబుసన్. 4

క. ఆతని రాజ్యంబున ను
ర్వీతలము ప్రజాసమృద్ధి వెలసి రుజాశో
కాతంకక్షయశంకా
పేతంబై ధర్మచరితఁ బెరుఁగుచు నుండెన్. 5

వ. అమ్మహీపతి యొక్కనాఁడు మృగయావినోదార్థియయి యాదిత్యహయంబుల కంటె వడిగల వాహనంబులు [1]పూనిన రథంబెక్కి యాజానేయ తురంగారూఢులైన యాశ్వికులు పరివేష్టించి రాఁగ ననంతకుఁతశక్తి చాప కృపాణపాణు లయిన వీరభటసహస్రంబులతోఁ వనంబులోని మృగంబులం జుట్టిముట్టి. 6

క. కలయఁగ [2]నార్పుల బొబ్బల
యులివున సవ్విపిన మను మహోదధిఁ బెలుచం
గలఁచెను దుష్యంతమహా
బలమందరనగము సత్త్వభయజననంబై . 7

క. సరభసపరిచలిత మహా
శరభ ద్విపరిపు వరాహ శార్దూల మద
ద్విరదాదిప్రకర భయం
కర వనమధ్యమున నృపతి గడుఁగడిమి మెయిన్, 8

క. ఓసరిలి పఱచుమృగముల
నేసియు డాసినమృగముల నెగిచి భుజాసిన్
వ్రేసియుఁ జంపెను మృగయా
వ్యాసక్తి నపారఘోరవన్యమృగాలిన్. 9

1. పూన్చిన, 2. నార్పును బొబ్బయు, నులివు (ను) న.

వ. ఇట్లు పెక్కు మృగంబుల నెగిచి చంపుచు మఱియుఁ జంపెడు వేడుక నతిదూరంబున కరిగిన నాతని రథవేగంబు ననుగ మింపనోపక యధిక క్షుత్పిపాసా పరవశులయి పదాతు లయ్యుయి ప్రదేశంబుల విశ్రమించి రంత దుష్యంతుండు. కతిపయామాత్య పరిజన పురోహిత సహితుండై కొండొక నేల యరిగి ముందట నొక్క పుణ్యనదీతీరంబున వివిధ సురభి కుసుమఫల భారవి నమ్ర తరులతాగుల్మపరి శోభితంబయిన యొక్క వనంబు గని. 10

క. అమరపతి ఖాండవమునకు
రమణను వైశ్రవణు చైత్రరథమునకు సమా
నముగా దీనిని భూభా
గమునకు రచియించెనొక్కొ కమలజుఁడు దయన్. 11

వ. అని దానిరమణీయభావంబుఁ బొగడుచుఁ [1]జనుదెంచి యవ్వనంబు సొచ్చునప్పుడు. 12

చ. అతిరుచిరాగతుం డయినయాతనికిన్ హృదయ ప్రమోద మా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాపవ
ర్షితకుసుమాలకు తావళులు [2]సేసలు వెట్టినయట్టి రైరిసం
పతదళిసీనినాదమృదు భాషల దీవన లొప్పు నిచ్చుచున్. 13

వ. మఱియును. 14

క. కాఱడవిఁ బఱచుమృగముల
నూఱడకం [3]దిగిచి డస్సియున్న తని శ్రమం
బాఱఁగ నెడఁ బరితాపము
దీఱఁగఁ బైవీచె నన్న దీపవనంబుల్. 15

మానిని. ఏచి తనర్చితలిర్చిన క్రోవుల నిమ్మగుతావుల జొంపములం
బూచినమంచియశోకములన్ సురపొన్నలఁ బొన్నల గేదఁగులం

1.జొత్తెంచు, 2.చల్లిన, 3.దెగిచి.

గాచి బెడంగుగఁ బండినయా సహకారములం గదళీతతులం
జూచుచు వీనులకిం పెసఁగన్ వినుచున్ శుకకోకిల సుస్వరముల్. 16

కవిరాజవిరాజితము.
చనిచని ముందట నాజ్యహవిర్ధృత సౌరభధూమల తాతతులం
బెనఁగినమ్రాఁకుల కొమ్మలమీఁద న పేతలతాంతము లైనను బా
యనిమధుపప్రకరంబులఁ జూచి జనాధిపుఁ డంత నెఱింగెఁ దపో
వన మిది యల్లదే దివ్యమునీంద్రునివాసము దానగు నంచు నెడన్. 17

వ. ఇట్లు హృదయసుఖావహం బగుచున్న యవ్వనంబులో సరిగి యరిగి యనవరత పదక్రమపఠ్యమాన మహాద్విజ వేదధ్వనులను నవిచ్ఛిన్న హూయ మానాగ్ని హెూత్ర స్వాహాశబ్దంబులను ననేక మునిగణ [1]ప్రణీతవచన విషయ విభాగ వినిర్ణయ న్యాయనిపుణవిద్వత్సభాసంభాషణఘోషంబులను [2]బ్రతిపక్ష దుర్విభేద ప్రమాణవిచార్యమాణ వేదార్థ మీమాంసక గోష్ఠీవివాదనాదంబులనుం జేసి వ్రోయుచు యజ్ఞ ప్రయోగ ప్రవీణులయిన యాజ్ఞికులకును విహితానుష్ఠానాస క్తులయిన యనుష్ఠాతలకును నధిక తపో నిరతులయిన మహాతపోధనులకును నివాసంబయిన పుణ్య నదీతీరంబునఁ దద్దరమ్యంబయి గంగాతీరంబున నర నారాయణ స్థానంబునుంబోలె జగత్పావనంబగుచున్న కణ్వమహాముని యాశ్రమంబుగని యందు, 18

సీ. శ్రవణసుఖంబుగా సామగానంబులు
చదివెడు శుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులును
గరికరశీతలచ్ఛాయఁ దచ్ఛీకరాంబు
కణముల చల్లనిగా డ్పాసపడి వానిఁ
జెంది సుఖంబున్న సింహములును
భూసుర ప్రవరులు భూతబలుల్
దెచ్చిపెట్టు నీ వారాన్ని పిండతతులు

1.ప్రణుత, 2. పర

తే. గడఁగి భక్షింప నొక్కటఁగలసి యాడు
చున్న యెలుకలుఁ బిల్లులు నొండు సహజ
వైరివర్గంబులయు సహవాస మపుడు
సూచి మునిశక్తి కెంతయుఁ జోద్యమంది. 19

వ. ఇక్ష్వాకుపుండైన కణ్వమహామునీంద్రునకు నమస్కరించి వచ్చెద నావచ్చునంతకు
నందఱు నిచ్చోటన యుండునది యని. 20

చ. వలయు సమాత్యులం దగినవారల నుండఁగఁ బంచి ధారుణీ
తలవిభుఁ డొక్కరుండ చని తన్విఁ బయోజ దళాయతాక్షి సం
కులమిళితాళినీలపరికుంచిత కోమలకుంతలన్ శకుం
తల యను కన్యకం గనియెఁ దన్మునివల్లభు మందిరంబునన్. 21

వ. అదియును సనంత విలాసంబున జయంతుండపోని దుష్యంతు నెఱింగి యతి
సంభ్రమంబున నాసనార్ఘ్య పాద్యాదివిధులం బూజించి కుశలం బడిగియున్న
నక్కన్యకం జూచి దుష్యంతుం డిట్లనియె. 28

ఉ. క్రచ్చుఱ వేఁట వచ్చి యిట కణ్వమహామునిఁ జూచి పోవఁగా
వచ్చితి [1]మెందుఁ బోయిరొకొ వారనినన్ వినియా లతాంగి వా
రిచ్చటనుండి యీ క్షణమయేఁగిరి రానకుఁ బండ్లు దేర మీ
వచ్చుటెఱింగి లేని జనవల్లభ వారును వత్తు రింతకున్. 23

వ. వారు వచ్చునంతకు నొక్క ముహూర్తంబుండునది యనిన విని యక్కోమలి
వినయంబునకు మృదుమధుర వచనంబు లకు సంతసిల్లి దానిం గన్యకఁగా
నెఱింగి మనోజ రాజ్య లక్ష్మీయుంబోనిదాని సర్వలక్షణలక్షితంబు లయిన సర్వా
వయవంబులం జూచి సంచలిత హృదయుండై నీ వెవ్వరి. కూఁతుర విట్టి
[2]రూపలావణ్య విలాస విభ్రమగుణసుందరి విందుల కేల వచ్చి తని యడిగిన
నది యిట్లనియె. 24

1. నొందు వోయిరొకొ, 2. రూపలావణ్యసుందరి.

క. జగతీవల్లభ యే న
త్యగణితధర్మస్వరూపుఁడని జనములు దన్'
బొగడఁగ జగదారాధ్యుం
దగు కన్వమహామునీంద్రునాత్మజ ననిసన్'. 25

చ. ఇది మునికన్యయేని మఱియేలొకొ యీలలితాంగి యందు నా
హృదయము దద్దయుందవిలె నిప్పలుకింతను నమ్మనేర [1]న
య్యెద విజితేంద్రియుండనఁగ నిమ్మునిఁ బాయక విందు సంచుదా
నిదికలరూ పెఱుంగ నవనీపతి యుత్సుకుఁడయ్యె నాత్మలోన్. 26

వ. ఇట్లు దుష్యంతుం డా శకుంతల జన్మం బెఱుంగ వేఁడి వెండియు దాని
కిట్లనియె. 27

తే. ఉత్తమాశ్రమ నిష్ఠితుఁ డూర్ధ్వరేతుఁ
డైన కణ్వ మహాముని యనఘచరితుఁ
డట్టిముని కెట్లు గూఁతుర వైతి దీని
నాకు నెఱుఁగంగఁ జెప్పుము నలిన నేత్ర. 28

వ. అని యడిగిన నారాజునకు శకుంతల యిట్లనియె. 29

క. ఇక్కమలాక్షి శకుంతల
యెక్కడియది దీనిజన్మ మెవ్విధ మని త
మ్మొక్క మునినాథుఁ డడిగిన
నిక్కాశ్యపు లర్థిఁ జెప్పి రేను వినంగన్. 30

వ. నాజన్మప్రకారంబు మాయయ్య యమ్మునికిం జెప్పిన విధంబు చెప్పెదఁ జిత్తగించి
విను మని యాదుప శకుంతల యిట్లనియె. యాదుష్యంతునకు. 31

1. నా, యెద.

సీ. అనఘుఁడు రాజర్షి యై తపశ్శక్తిమై
బ్రహ్మర్షి భావంబుఁ బడసియున్న
సన్మునీశ్వరుఁడు విశ్వామిత్రుఁ డతిఘోరతపము
సేయుచు నున్నఁ దత్తపమున
కెంతయు వెఱచి దేవేశ్వరుఁ
డప్సరోగణములలో నగ్ర గణ్యయైన
దాని మేనక యనుధవళాక్షిఁ బిలిచి
విశ్వామిత్రు పాలికిఁ జని తదీయ

ఆ. ఘోరతపము చెఱిచి కోమలి నాదైన
దేవ రాజ్యమహిమఁ దీవిరి నీవు
గావు మనిన నదియుఁ గడుభయంపడి యమ
రేశ్వరునకు మ్రొక్కి యిట్టులనియె. 32

చ. వనజభవప్రభావుఁ డగువాని వశిష్ఠు నపత్యశోక మ
న్వననిధిలోన ముంచినయవారితసత్త్వుఁడు నిన్నుఁ దొట్టి యీ
యనిమిషు లెల్ల [1]వానికి భయంపడు చుండుదు రట్టి యుగ్రకో
పనుకడ కిప్పుడేఁగుమనపాడియె యిప్పని నన్నుఁ బంపగాన్. 33

ఉ. అమ్ముని యల్గిచూచుడును నాక్షణమాత్రన గోత్ర ధారుణీ
ధ్రమ్ములు వ్రయ్యు నయ్యుసుము దక్కఁగ నంబుధు లింకు మూఁదులో
కమ్ములు దిర్దిరం దిరుగుఁ గాడ్పు చలింపఁగ నోడు నుగ్రతం
బమ్మినయట్టి కోపపరుపాలికి భామలు వోవ [2]నోడరే. 34

వ. అయినను నానేర్చువిధంబున నమ్మునివరుచి త్తంబుమెత్తన చిత్తజాయత్తం
బగునట్లుగాఁ జేసెదనని వాసవు వీడ్కొని మేనక తనకు మందమలయానిలంబు
దోడుగాఁ జనుదెంచి హిమవత్పర్వత ప్రదేశంబునం దపంబు సేయుచున్న
విశ్వామిత్రు తపోవనంబు సొత్తెంచిన, 35

1. వానిని 2. నేర్తురే.

క. చల్లని దక్షిణమారుత
మల్లన వీ తెంచెఁ దగిలి యాలలనాథ
మ్మిల్లకుసుమాంగ రాగస
ముల్లసనసుగంధి యగుచు మునివరుమీఁదన్, 36

వ. అంత. 37

చ. అనిమిష కాంతయున్ నవలతాంతవిభూషణలీల నల్లన
ల్లన వన కేళిలాలసవిలాసగతిం జనుదెంచి ముందటం
గనియె [1]మహాముని ప్రవరుఁ గౌశికుఁ గౌశిక చిత్తభీతిసం
జననమహాతపశ్చరణ సంయత చిత్తు నిర స్తచిత్తజున్. 38

క. అంబుజలోచన గని విన
యంబున నమ్మునికి మ్రొక్కి యనురాగముతో
డం బుష్పాపచయవ్యా
జంబున విహరించుచుండె సఖులుం 'దానున్'. 39

చ. అలసత యొప్పఁగాఁ దరుణి యమ్మునివల్లభు మ్రోల నున్న సం
మిళిత సుగంధ బంధుర సమీరవశంబునఁ దూలి బాలపై
వలు వెడలన్ బయల్పడియె [2]వల్దకుచంబులుఁ గక్షయుగ్మమున్
లలితకృశోదరంబుఁ దరళత్రివళీయుతరోమరాజియున్, 40

క. అందుఁ దనదృష్టి నాటుడుఁ
గందర్పుని శాత సాయకంబులు పెలుచన్
డెందముఁ గాఁడిన ధృతి సెడి
కంది మునీంద్రుండు దానిఁ గవయందివి రెక్, 41

వ. మేనకయు విశ్వామిత్రునిష్టంబునకుం దగిన కామోపభో గంబులం బెద్దకాలంబు
రమియించిన నయ్యిద్దఱకు నిక్కన్యక పుట్టిన దీనిమాలిన యనునొక్కయేటి

1. మునీశ్వర, 2.వస్త్రువచన్నులు.

పులిన తలంబునం బెట్టి మేనక దేవలోకంబునకుం జనియె విశ్వామిత్రుండును
తపోవనంబునకుం జనియె నంత నమ్ముని ప్రభావంబున. 42

ఆ. చెలఁగి లేవ నేడ్చు చిఱుతుక దానిఁ గ్ర
వ్యాద ఘోరమృగము లశన [1]బుద్ధిఁ
బట్టకుండఁ జెట్టుపలఁ గప్పి రక్షించు
కొని శకుంతతతులు గూడి యుండె. 43

వ. అంత నేము శిష్యగణంబులతోడ సమిత్కుసుమఫలాహరణార్థం బక్కడకుంజని యమ్మాలినీపులినతలంబున శకుంత రక్షితయై యున్న కూఁతు నత్యంత శాంతిమతి నవనీతలం బున కవతరించిన తరుణ శశిరేఖయుంబోని దాని నెత్తు కొని వచ్చి శకుంతరక్షిత యగుటంజేసి శకుంతల యను నామంబిడి కరంబు గారవంబునం బెనిచితిమి. 44

మధురాక్కర

తనర జనకుండు నన్న ప్రదాతయునుభయత్రాత
యును ననఁగ నింతులకు ముఖ్వరోగిన గురువులు వీర
లనఘ యువనేత మఱియు నిరంతరాధ్యాపకుండు
ననఁగ బురుషున కియ్యేవు రనయంబున గురువులు. 45

వ. అనం బరఁగిన శాస్త్రార్థంబున నేము దీనికి భయత్రాతల మగుటంజేసి గురుల మిదియును మాచే సభివర్తిత యగుటంజేసి మాకు హృదయానందనియైన కూతురని కణ్వమహాముని లమ్మునికి జెప్పినవిధం బంతయు సవిస్తరంబుగా శకుంతల సెప్పిన విని దుష్యంతుం డాత్మగతంబున. 46

దుష్యంతుండు శకుంతలను వివాహంబు సేసికొనఁ గోరుట

చ. ఇది మునినాథకన్య యని యెంతయు నిస్పృహవృత్తినున్న నా
హృదయము రాజపుత్రి నని యిక్క మలాక్షి నిజాభిజాత్యసం

1. కాంక్ష, డాయ

పద నెఱిఁగించినన్ మదన బాణ [1]పరంపర కిప్పుడుండ నా
స్పద మయి సంచలించె నళిపాతవికంపిత పంకజాకృతిన్. 47

వ. అనుచు మదనాతురుం డయి దుష్యంతుండు దనయం దక్కోమలి యనురాగం బుపలక్షించి యిట్లనియె. 48

క. ఈ వల్కలాజినములకు
నీవన్యఫలాశనముల కీవిటపకుటీ
రానాసములకు నుచితమె
నీవిలసిత రూప కాంతి నిర్మలగుణముల్. 49

ఉ. ఈ మునిపల్లెనుండు టిది యేల కరంబనురాగ మొప్పఁగా
భామిని నాకు భార్యవయి భాసురలీల న శేష రాజ్యాల
క్ష్మీమహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనింది తేందుపా
దామలతుంగ హర్మ్యముల హారిహిరణ్మయకుట్టి మంబులన్. 50

సీ. బ్రాహ్మంబు దైవంబుఁ బరఁగ నార్షంబుఁ
ప్రాజాపత్యమును రాక్షసంబు నాసు
రంబు గాంధర్వంబు రమణఁ బై శాచంబు
నను నెనిమిది వివాహములయందుఁ
గడుఁ బ్రశస్తములు సత్ప్రత్ర వంశ్యులకు
గాంధర్వ రాక్షసములు ధర్మయుక్తి
నీకును నాకును నెమ్మిఁ బరస్పర ప్రేమంబు
గాముండు పెంపఁ దొడఁగెఁ
ఆ. గాన [2]యెడయుఁ జేయఁగా నేల గాంధర్వ
విధి వివాహమగుట వినవే యుక్త
మనిన లజ్జఁజేసి యవనతవదనయై
యా లతాంగి యిట్టులనియెఁ బతికి. 51

1.పరంపరఁ గుంద నిప్పు డా, 2.తడవు.

క. కరుణానిరతులు ధర్మ
స్వరూపు లింతకు మదీయ జనకులు సనుదెం
తురు వారు వచ్చి నీ కి
చ్చి రేని పాణిగ్ర[1]హణము సేయుము నన్నున్. 52

వ. అనిన దానికి దుష్యంతుం డిట్లనియె. 53

తే. తనకు మఱి తాన చుట్టంబు తాన తనకు
గతియుఁ దన్ని చ్చుచోఁ దానకర్తయనఁగ
వనజనేత్ర గాంధర్వవివాహ [2]మతిర
హస్యమును సమంత్రకమును నగుచు నొప్పు. 54

వ. అని దుష్యంతుండు గాంధర్వవివాహ స్వరూపంబు సెప్పి శకుంతల నొడంబఱిచిన
నది యి ట్లనియె. 55

చ. నరనుత నీ ప్రసాదమున నాకుదయించిన నందను మహీ
గురుతర వరాజ్యమునకు దయతో నభిషిక్తుఁజేయఁగా
వరము ప్రసన్న బుద్ధి ననవద్యముగా దయసేయు నెమ్మితో
నిరుపమ [3]దాన యట్లయిన నీకును నాకును సంగమంబగున్. 56

వ. అనిన విని శకుంతల కెంతయు సంతోషంబుగా దాని కోరిస వరంబిచ్చి గాంధర్వవివాహంబున నభిమతసుఖంబు లనుభవించి యక్కోమలి వీడ్కొని నిన్నుఁ దోడ్కొని రా నస్మత్ప్రధానవర్గంబుఁ గణ్వమహామునిపాలికిం బుత్తెంచెద నని యూజడనొడివి దుష్యంతుండు నిజపురంబునకుం జనియె నిట శకుంతలయుఁ దన చేసిన దాని మునివరుం డెఱింగి యలిగెడునో యని వెఱచుచుండె నంత నమ్మహాముని వనంబుననుండి కందమూలఫలంబులు గొని చనుదెంచి లలిత శృంగారభావంబున లజ్జావనత వదనయు నతి భీతచిత్తయునై యున్న కూఁతుంజూచి తన దివ్యజ్ఞానం బున నంతవృత్తాంతంబు నెఱింగి క్షత్రియులకు గాంధర్వ వివాహంబు విధిచోదితంబయని సంతసిల్లి శకుంతల కిట్లనియె. 57

1.హంబు 2. మిది 3.కీర్తి

తే. తల్లి నీ కులగోత్ర సౌందర్యములకుఁ
దగినపతిఁ గంటి దానికిఁ దగఁగ గర్భ
మయ్యె నీదు గర్భమునవాఁ డఖిలభువన
వహనమహనీయుఁడగు చక్రవర్తి సుమ్ము. 58

వ. నీ ధర్మచరితంబునకు మెచ్చితి నీవు గోరినవరం బిచ్చెద వేఁడుమనిన శకుంతలయు నాచిత్తం బెప్పుడు ధర్మువునంద తగిలి యుండను నాకుద్భవిల్లెడు పుత్రుండు దీర్ఘాయురారో గ్యైశ్వర్య బలసమన్వితుండును వంశకర్తయుఁ గానువలయుననిన నమ్మహాముని కరుణించి దాని కోరినవరం బిచ్చి యథాకాల విధుల గర్భసంస్కార రక్షణంబులు సేయించి యున్నంత, వర్షత్రయంబు సంపూర్ణం బైన, శకుంతలకు భరతుండుదయించి కణ్వనిర్వర్తిత జాతకర్మాది క్రియా కలాపుం డయి పెరుఁగుచుఁ గరతలాలంకృతచక్రుండును, చక్రవర్తిలక్షణ లక్షితుండును, సింహసంహననుండును, దీర్ఘబాహుండును, ననంత జవసత్త్వ సంపన్నుండును నై పరఁగుచు. 63

మ. అమితోగ్రాటవిలోనఁ గ్రుమ్మరు వరాహవ్యాళశార్దూల ఖ
డ్గమదేభాదులఁ బట్టి తెచ్చి ఘనుఁడై కణ్వాశ్రమోపాంత భూ
జములం దోలిన కట్టుచుం బలిమిమై శాకుంతలుం డొప్పె న
న్యమదేభంబుల నెక్కుచుం దగిలి నానాశైశవక్రీడలన్. 64

వ. ఇట్లు వనంబులోని సర్వసత్త్వంబులను దనమహాసత్త్వంబునం జేసి దమియించుచున్న యాతనిం జూచి యాశ్చర్యం బంది యందులమునులెల్ల నాతనికి సర్వదమనుం డను నామంబుఁ జేసిరి; కణ్వమహామునియు నక్కుమారు నుదార తేజోరూప విక్రమ గుణంబులకు సంతసిల్లి ‘వీఁ డఖిల భువన యౌవరాజ్యంబునకు సమర్థుం డగు సమయం బరుగుదెంచె’ నని విచారించి యొక్కనాఁడు కూఁతున కిట్లనియె. 65

ఆ. ఎట్టి సాధ్వులకును బుట్టిన యిండ్లను
బెద్దకాల మునికి తద్ద తగదు;

పతులకడన యునికి సతులకు ధర్మువు;
సతుల కేడుగడయుఁ బతుల చూవె. 66

కణ్వమహాముని శకుంతలను దుష్యంతుపాలికిం బంపుట

వ. 'కావున నీ విక్కుమారునిం దోడ్కొని నీపతిపాలికి నరుగు' మని మహాతపోధను
లైన తన శిష్యులం గొందఱం దోడువంచిన, శకుంతలయు దౌష్యంతుం దోడ్కొని
దుష్యంతుపాలికి వచ్చి సకల సామంతమంత్రిపురోహిత ప్రధాన పౌరజన
పరివృతుండై యున్న యారాంజుం గనుంగొని. 67

క. గురనాశ్రమంబునను ము
న్నరుదుగఁ బతివలనఁ గనిన యనురాగము నా
దరణము ననుగ్రహంబును
గరుణయు సంభ్రమము నపుడు గానక యెడలోన్. 68

క. మఱుఁగ డొకొ నన్ను; నెఱిఁగియు
నెఱుఁగని యట్లుండునొక్కొ; యెడ దవ్వగుడున్
మఱచెనొకొ! ముగ్ధ లధిపులు
మఱువరె బహుకార్యభారమగ్నులు కారే. 69

చ. తలఁపఁగ నాఁడు పల్కినవిధం బెడఁ దప్పఁగ వీడె నొక్కొ చూ
డ్కులు విరసంబులై కరము క్రూరము లైన నిమిత్త మేమియో?
కలయఁగఁ బల్కరించి రుపకారులునై రని నమ్మియుండఁగా
వలవదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధినాథులన్. 70

వ. అని తలంచి చింతాక్రాంతయై శకుంతల వెండియు నాత్మ గతంబున, 71

క. మఱచినఁ దలఁపింపఁగ నగు
నెఱుఁగనినాఁ డెల్ల [1]పాటనెఱిఁగింప నగున్
మఱి యెఱిఁగి యెఱుఁగ నొల్లని
కఱటిం దెలుపంగఁ గమలగర్భునివశమే. 72

1. వెంట.

వ. అయినను వచ్చి మిన్నక పోవంగాదు కావున నా పూర్వ వృత్తాంతం బెల్ల
నెఱింగించి యే నిక్కుమారుం జూపుదు నని మనంబున నిశ్చయించి శకుంతల
యారాజున కిట్లనియె. 73

క. జననాథ వేఁట నెపమున
గొనకొని కణ్వాశ్రమమునకు వచ్చి ముదం
బున [1]నందు నాకు నీ యి
చ్చిన వరము దలంపవలయుఁ జిత్తములోనన్. 74

క. బాలార్క తేజుఁ డగు నీ
బాలుఁడు నీ కొడుకు వీనిఁ బౌరవుల ర
త్నాలంకారు నుదార గు
ణాలయు యువరాజుఁ జేయు మభిషేకమునన్. 75

వ. అనిన విని దుష్యంతుండు దానినంతయు నెఱింగియు నెఱుం గనివాఁడపోలె
నిట్లనియె. 76

క. ఏ నెఱుఁగ నిన్ను నెక్కడి
దానవు మిన్నకయ యనుచితంబులు పలుకం
గా నేల యరుగు మంబురు
హానన యెందుండి వచ్చి తందులకు వడిన్. 77

వ. అనిన విని వెలువెల్లనై వెచ్చనూర్చి నిశ్చేష్టితయై కెందమ్మి రేకులవలనం దొరంగు
జలకణంబులపోలెం గోపారుణిత నయనంబుల బాష్పకణంబులు దొరఁగం
దలవాంచి యారాజుం గటాక్షించుచు హృదయసంతా పంబు దనకుఁదాన
యుపశమించుకొని పెద్దయుం బ్రొద్దు చింతించి శకుంతల యారాజున
కిట్లనియె. 78

1. నాఁడు

ఆ. ఏల యెఱుక లేని యితరులయట్ల నీ
వెఱుఁగ ననుచుఁ బలికె దెఱిఁగి యెఱిఁగి
యేన కాని దీని నెఱుఁగ రిం దొరులని
తప్పఁ బలుక నగునె ధార్మికులకు. 79

చ. విమలయశోనిధీ పురుషవృత్తమెఱుంగుచు నుండుఁజూవె వే
నములునుబంచభూతములు ధరువుసంధ్యలునంత రాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు సహంబును రాత్రియు సన్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు [1]దక్కొన నేర్చు నెతన్ను మ్రుచ్చిలన్. 80

క. నాయెఱిఁగినట్ల యిన్నియుఁ
నీ యిచ్చిన వరము ధారుణీవర యెఱుఁగున్
నాయందుఁ దొంటి యట్టుల
చేయు మనుగ్రహ మవజ్ఞ సేయందగునే. 81

క. సవతియును గుణవతియుఁ బ్రజా
వతియ ననువ్రతయు నై నవనిత నవజ్ఞా
న్విత దృష్టిఁ జూచు సతిదు
ర్మతి కిహముం బరముఁ గలదె మతిఁ బరికింపన్. 82

క. సంతతగృహమేధి ఫలం
బంతయుఁ బడయంగనోపు ననుగుణభార్యా
వంతుం డగువాఁడు క్రియా
వంతుఁడు దాంతుండుఁ బుత్రవంతుండు నగున్. 83

వ. మఱియును. 84

సీ. ధర్మార్థకామసాధన కుపకరణంబు
గృహనీతి విద్యకు గృహము విమల
చారిత్రశిక్ష కాచార్యకంబన్వయ
స్థితికి మూలంబు సద్గతికినూఁత
గౌరవంబున కేక కారణం బున్నతస్థిర
గుణమణుల కాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ
చూవె భర్తకు నొండ్లుగావు ప్రియము

ఆ. లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను
నెట్టి తీఱములను ముట్టఁబడిన
మత లెల్లఁ బాయు నింతులఁ బ్రజలను
నొనరఁ జూడఁ గనిన జనుల కెందు. 85

వ. మఱియు భార్య పురుషునం దరంబగుటం జేసి పురుషునకు మున్న పరేతయైన పతివ్రత పరలోకంబునం దన పురుషుం. గూడఁ దదాగమనంబు ప్రతీక్షించు చుండుఁ బురుషుండు. మున్న పరేతుండై నఁ బదంపడి తానును బేతయై తన పురుషుంగూడ నరుగునట్టి భార్య నవమానించుట యధ ర్మంబు మఱియునుం బురుషుండు భార్యయందుఁ బ్రవేశించి గర్భంబునఁ బుత్తుండై తాన యుద్భవిల్లు గావున నజాదజ్ఞా త్సమ్భవసి యనునది యాదిగాఁ గల వేదవచనంబుల యందును జనకుండును బుత్తుండును నను భేదంబు లేదు. 86

క. విను గార్హపత్య మనున
య్యడలము విహరింపఁబడి తదాహవనీయం
బున వెలుఁగునట్ల వెలుఁగును
జనకుఁదు దాఁబుత్రుఁడై నిజద్యుతితోడన్. 87

క. తాన తననీడ నీళ్ళల
లో నేర్పడఁ జూచునట్లు లోకస్తుత త
త్సూను జనకుండు సూచి మ
హానందముఁ బొందు నతిశయప్రీతిమెయిన్. 88

1. దక్కఁగ

వ. పున్న మ్నో నరకాత్త్రయత ఇతి పుత్త్ర యను వేద వచనంబు గలదు గావునఁ
బుణ్యాచారం డయిన పుత్త్రుం దుభయపక్షంబుల వారి నుద్ధరించుఁ గావున. 89

క. నీపుణ్య తనువువలనన
యీపుత్రకుఁ డుద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబువలన నొండొక
దీపము [1]ప్రభవించినట్లు తేజంబెసఁగన్. 90

మ. విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ యీపుత్త్రగా
త్రపరిష్వంగ సుఖంబు సేకొనుము ముక్తాహారకర్పూరసాం
ద్రపరాగ ప్రసరంబుఁ బందనముఁ జంద్రజ్యోత్స్న యుంబుత్త్రిగా
త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే. 91

క. అనఘుఁడు వంశకరుండై
పెనుపున నీ సుతుఁడు వాజపేయంబులు నూ
ఱొనరించు నని సరస్వతి
[2]వినిచె మునులు వినఁగ నాకు వినువీథి దెసన్. 92

శ. భూరిగుణు నిట్టికులవి
స్తారకు దారకు నుదారధర్మప్రియ ని
ష్కారణమ తప్పఁ జూడఁగ
సారమతీ చనునె నాఁటిసత్యము [3]గలుగన్. 93

చ. నుతజలపూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత యొక [4]బావి మేలు మఱి బావులు నూటికంటె నొక్కస
త్క్రతు వది మేలు తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు త
త్సుతశతకంబుకంటె నొక సూనృత [5]వాక్యము మేలు సూడఁగన్. 94

1. ముట్టించి; పుట్టించి, 2.వినిపించెను మునులు వినఁగ 3.గలఁగున్, 4. వాపి మేలు మఱి వాపులు, 5. మెంతయు.

క. వెలయంగ నశ్వమేధం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దుల నిడి [1]తూఁపఁగ సత్యము
వలనన ములు [2]సూపు గౌరవంబున పేర్మిన్. 95

క. సర్వతీర్థాభిగమనంబు సర్వ వేద
సమధిగమము సత్యంబుతో సరియుఁ [3]గావ
యెఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁబెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన [4]మునులు. 96

క. కావున సత్యము మిక్కిలి
గా విమల ప్రతిభఁ దలఁచి కణ్వాశ్రమసం
భావిత సమయస్థితి దయఁ
గావింపుము గొడుకుఁ జూడు కరుణాదృష్టిన్. 97

క. క్షత్త్రవరుఁ డైన విశ్వా
మిత్రునకుఁ బవిత్రయైన మేనకకున్ స
త్పుత్త్రినయి బొంకు వలుకఁగ
ధా స్త్రీతలనాథ [5]యంతధ ర్మేతర నే. 98

వ. అనిన శకుంతల పలుకులు సేకొన నొల్లక దుష్యంతుం డిట్లనియె. 99

క. *ఏ నెట నీ వెట సుతుఁ డెట
యే నెన్నఁడు దొల్లి చూచి యెఱుఁగను నిన్నున్
మానిను లసత్యవచనలు
నానిట్టు లసత్యభాషణం బుచితంబే. 100

1. తూన్పఁగ, 2. సూపె 3. గావు, ఎఱుఁగు 4. వారు, 5.యింత.

*"కన్యక యఁట నే నఁట, వనమున గాంధర్వమున నివాహంబఁట నం, దనుఁ గనె నట, మఱచితనఁట వినఁగూడునె యిట్టిభంగి విపరీతో కుల్", ఈపద్య మాదిపర్వమున నున్నదని అప్పకవి వ్రాసియున్నాఁడు. ఐనచో నిచ్చోన యుండఁబోలు.

క. పొడవునఁ బ్రాయంబునఁ గడుఁ
గడిఁదిబలంబునను జూడఁగా నసదృశు నీ
కొడు కని యీతని నెంతయు
నెడమడుగుగఁ జూపఁ దెత్తె యిందఱు నగఁగాన్'. 101

వ. ఇట్టి లోక విరుద్ధంబుల కే మోదుదు మయుక్తంబు లయిన పలుకులు వలుకక నీ యాశ్రమంబునకుం బొమ్మనిన శకుం తల యత్యంత సంతాపి తాంతః కరణయై. 102

మధ్యాక్కర.
తడయక పుట్టిననాఁడ తల్లిచేఁ దండ్రిచే విడువఁ
బడితి నిప్పుడు పతి చేతను విడువఁబడి యెదనొక్కొ
నుడువులు వేయు నింకేల యిప్పాటి నోములు దొల్లి
కడఁగి నోఁచితిని గా కేమి యనుచును గందె డెందమున. 103

వ. ఇట్లుదద్దయు దుఃఖించి విగతాశయై బోరనఁ దొరఁగు బాష్ప [1]జలంబు లందంద యొత్తికొనుచు నింక దైవంబ కాని యెందు శరణంబు లేదని యప్పరమ పతివ్రత తనయుం దోడ్కొని క్రమ్మఱి పోవనున్న యవసరంబున. 104

చ. గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుడు సే
కొని భరియింపు మీతని శకుంతల సత్యము వల్కె సాధ్విస
ద్వినుత మహాపతివ్రత వివేకముతో నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ [2]మందఁగఁ దత్సభాసదుల్. 105

వ. ఇట్లెల్లవారలకు సతిహర్షంబుగా శకుంతల పతివ్రతాత్వం బును సత్యంబును భరతోత్పత్తియుఁ బ్రశంసించువేలుపులపలుకు లతివ్య క్తంబు లయి యాకాశంబు వలన వీ తెం చిన విని దుష్యంతుండు సభాసదులు విన నిట్లనియె. 106

1. కణం, 2. మందిరి అంత.

తే. ఏను నీ [1]యింతియును గాని యెఱుఁగ రన్యు
లర్థిఁ గణ్వమహాముని యాశ్రమంబు
నందు గాంధర్వవిధి వివాహమునఁ గరము
నెమ్మిఁ జేసిన దీనిఁ బాణి [2]గ్రహణము, 107

తే. అన్యు లెఱుఁగమిఁ జేసి లో శాపవాద
భీతినెఱిఁగియు ని తన్వి బ్రీతి దప్పి
యెఱుఁగ నంటిని నిందఱ కిప్పుడెఱుఁగఁ
జెప్పె నాకాశవాణి యచ్చెరువుగాఁగ. 108

వ. అని మహానురాగంబునం గొడుకు నెత్తికొని హర్షపులక లెసఁగ నాలింగనంబు సేసి శకుంతలామహాదేవి నతిప్రణయ గౌరవంబున సంభావించి యౌవ రాజ్యంబునకు భరతు నభి షిక్తుంజేసి పెద్దకాలంబు రాజ్యసుఖంబు లనుభవించి తన రాజ్యభారం బంతయు భరతుం బూన్చి దుష్యంతుండు. దపోవనంబున కరిగిన. 109

చ. భరతుఁ డ శేషభూభువనభార ధురంధరుఁడై వసుంధరం
బరఁగి యనేక యాగములఁ బాయక భాస్కరజహ్ను కన్యకా
సురుచిరతీర దేశముల సువ్రతుఁడై యొనరించి భూరిభూ
సురులకు నిచ్చె దక్షిణలు శుద్ధసువర్ణ [3]గవాశ్వహస్తులన్. 110

1. తన్వి, 2. గ్రహంబు, 3.గవాశ్వరత్నముల్.

2. హితోక్తి

- తిక్కన

(తిక్కన సోమయాజి - ఆంధ్రమహాభారతము
ఉద్యోగ పర్వము - తృతీయాశ్వాసము)

కవి పరిచయం:

తెలుగు సాహిత్య ప్రపంచంలో నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలను 'కవిత్రయ' మంటారు. మనకు తెలియవచ్చినంత వరకు తెలుగులో మొట్టమొదటిసారిగా కావ్య రచనకు శ్రీకారం చుట్టిన ఆదికవి నన్నయ. ఆయన ఆరంభించిన ఆంధ్ర మహాభారతాన్ని అనంతరకాలాన తిక్కన, ఎఱ్ఱనలు పూర్తి చేసినారు.

పదమూడవ శతాబ్దానికి చెందిన తిక్కన కవిత్రయంలో రెండవ వారు. మహాభారతంలోని పద్దెనిమిది పర్వాలలో నాల్గవదయిన విరాటపర్వం మొదలుకొని చివరిదయిన స్వర్గారోహణ పర్వంవరకు-మొత్తం పదిహేను పర్వాలు తిక్కన రచించినారు. నెల్లూరి మండలం ప్రభువయిన మనుమసిద్ధికి మంత్రిగా, ఆయన ఆస్థానంలో మహాకవిగా తిక్కన ప్రసిద్ధికెక్కినారు. తన మొదటి కావ్యం - 'నిర్వచనోత్తర రామాయణం' మనుమసిద్ధికి అంకితం చేసినారు. దాయాదులవల్ల మనుమసిద్ధి తన రాజ్యాన్ని కోల్పోయినప్పుడు తిక్కన కాకతీయ సామ్రాజ్య నిర్మాత అయిన గణపతిదేవ చక్రవర్తిని దర్శించి, తన కవిత్వంతో, మంత్రాంగంతో మెప్పించి, ఆ చక్రవర్తి సహాయంతో తన రాజుకు మళ్లీ రాజ్యాన్ని సంపాదించి పెట్టిన గొప్ప రాజకీయవేత్త, మహాకవి తిక్కన. కేతన అనే ఒక ఉత్తమకవి తాను రచించిన 'దశకుమార చరిత్ర' కావ్యాన్ని తిక్కనకు అంకితమిచ్చినాడు. ఉభయకవి మిత్రుడు, కవిబ్రహ్మ అనేవి తిక్కన బిరుదులు. తిక్కన 'సోమయాగం' చేయటం వల్ల 'సోమయాజి' అయినారు.

తిక్కన కవిత చిన్నారి పొన్నారి పదాలతో తెలుగు పలుకుబడినంతా కుప్పలు పోసినట్లుగా ఉంటుంది. వివిధ సన్నివేశాలను నాటకీయంగా పాఠకులకు కళ్లకు గట్టినట్టు చింతించటంలో తక్కన అద్వితీయులు. శ్రీనాథుడన్నట్లు తిక్కన కవిత 'రసాభ్యుచిత తెలుగు తోటు' ఆధునిక యుగంలో విశ్వనాథ సత్యనారాయణ" అన్నట్లు 'తిక్కన్న శిల్పంపు తెలుగుతోట'.

పాఠ్య పరిచయం :

ప్రస్తుత పాఠ్యభాగం తిక్కన భారతం . ఉద్యోగ పర్వం మూడవ ఆశ్వాసం నుండి గ్రహింపబడింది.

అరణ్య-అజ్ఞాతవాసాలు పూర్తి చేసుకొని వచ్చిన పాండవులు తమ రాజ్యభాగం కోసం ధృతరాష్ట్రునినద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపుతారు. ధర్మాధర్మాలు, న్యాయ-అన్యాయాలు చక్కగా అవగాహన చేసుకొని భిన్న పక్షాలవారు కలిసిమెలిసి ఉండటం తమకూ, లోకానికీ మేలుకలిగించుతుందని శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికీ, దుర్యోధనాదులకూ హితం ఉపదేశిస్తాడు. ఆ హితోక్తులే ఈ పాఠ్యం. నాడే కాదు, ఈనాడూ ఈ హితం అందరికీ ఉపాదేయమే.

హితోక్తి

క. జలదస్వన గంభీరత
నెలుఁగొప్పఁగ, దంత దీప్తు లెసఁగ ముకుందుం
డలరుచు సభ నఖిలజనం
బులు విన, ధృతరాష్ట్ర భూ విభున కిట్లనియెన్. 1

క. "జననాథ ! నీ యెఱుంగని
పనులు గలవె, యైనఁ, దగవుఁ బరమహితంబుం
దన వారికిఁ జెప్పిన తగు
నని పచ్చితి భారతాన్వయము ప్రియమొందన్. 2

క. క్షీరోదకగతిఁ బాండవ
కౌరవులొడగూడి మనికి కార్యం, బది నీ
వారసీ నడుపుము; వా రన
వీ రనఁ గురుముఖ్య! నీకు వేఱుం గలదే! 3

చ. భరత కులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గియుండు ననఁగా నుతిగన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీయనుఁగుఁ దమ్ముఁడు; నీ తనయుల్ యశోధురం
ధర శుభ శీలు, రీ సుచరితక్రమ మిప్పుడు దప్ప నేటికిన్. 4

శా. ఈ వంశంబునకెల్ల నీవు కుదు, రిఁదెవ్వారి చందంబు లె
ట్లై వర్తిల్లినఁ గీడుమేలుఁ దుది నీయం దొందెడుం, గాన స
ద్భావం బారసి లోని పొత్తు వెరి వృత్తంబున్ జనస్తుత్యముల్
గావింపందగు నీక యెవ్విధమునం గౌరవ్య వంశాగ్రణీ! 5

చ. వినుము, సుయోధనాదులగు వీరు సధర్ములుగాక, కార్యము
ల్గొనక, మహార్థ సిద్ధి యెడలం దమ కిట్లన, కన్వయంబు వ
ర్తన మిది గాదు నాక, బెడిదంపుఁదనంబున బంధుకోటి కి
న్మనసులు నొవ్వఁగా, నవగుణంబులకుం బుయిల్లోడ రేమియున్. 6

ఉ. కౌరవ పాండవుల్ తెలఁగు గైకొని శాంతతఁ బొంది యున్కి మే
లారయ నాకు నీకుఁ గులమంతకు, నీ నృపకోటి, కుర్వికిం;
బోరితమైన నింతకును బుట్టు మహాపథ; గావునన్ ధరి
త్రీ రమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొందొనర్పవే. 7

గీ. నీకు వలసిన దీర్పగ నేరవచ్చు
నధిప! తెలఁగు నీ వశమున యదియ కాన;
నీకు వీరలఁ దేర్చుట నెఱియ కాదె!
సిద్ధ మెవ్వారిఁ దెలినొందఁ జేయనేర్తు; 8

ఉ. అందు, వృకోదరార్జునుల నాహవరం గమునందు మీఱు వా
రెందఱో యెన్నుమా! యిచట నీగురు భీష్ములఁ గ్రేణి సేయు వా
రెందఱొ! వారు వీరు నని నీల్గుటకంటే, భవ ద్బలంబులై
యందఱు గూడుటొప్పదె ! జనాధిప ! శాంతి యొనర్పు మెమ్మెయిన్. 9

తే. జగతిఁగల జనపతులు నీ చరణ పీఠ
మర్థిఁ గొలువ, సముద్ర వేలా వృతోర్వి
యెల్ల నేలుట యొప్పదే ! తల్లి ప్రజల
కిల విరోధంబు వాటించు టెంతమేలు! 10

క. నరనాథ ! నీ వుపేక్షా
పర్యుదవయినఁ, గౌరవులకు పాండవులక కా
దరయఁగ భూప్రజకెల్లను
దురితం బొనరించినట్ల తుదిఁ గీడుసువి! 11

క. కౌరవ పాండవులం దె
వ్వారలకుం జావునొవ్వ వచ్చిన మే? లు
ర్వీరమణ! చిత్తమున నె
ట్లారయుమా! నీకు దుఃఖమగు నెట్లయినన్. 12

ఉ. వీరును వారుఁ బండితులు, విక్రమవంతులు, బాహు గర్వ దు
ర్వారులు; పూని రిత్తబవరంబున నాఁఅడిఁ జావఁ బోవ నె
ట్లూరకయుండవచ్చుఁ, గడు నొప్పెడు మేనులు వాడి కైదువుల్
గూరఁగ నాటినం బుడమిఁ గూలుట కక్కట, యోర్వవచ్చునే! 13

ఆ. ఇట్లుగాక యుండ, నీ రెండు దెఱఁగుల
వారిఁ గాచికొనుము, వసుమతీశ!
నీదు ప్రాభవంబు నీతియు శాంతియు
నఖిల జనులుఁ బొగడు నట్లుగాగ;" 14

వ. అని చెప్పి, మఱియు నిట్లనియె. 15

ఉ. "సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
భారముఁ బొందలేక చెడఁబాఱినదైన యవస్థ, దక్షు లె
వ్వార లుపేక్షసేసి, రదివారల చేటగుఁ; గాని, ధర్మ ని
స్తారకమయ్యు, సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్. 16

అధ్యయన వేదిక

సునికి = జీవించుట; – కార్యంబు = చేయదగినది, పని; పాడి = న్యాయం, ధర్మం; అనుఁగు = ప్రియమయిన, ఇష్టమయిన; యశస్ + ధురంధర + శుభ+ శీలురు = కీర్తి యొక్కభారము వహించు మంగళకరమయిన స్వధానముగలవారు (=మంచి స్వభావం వల్ల కీర్తి పొందినవారు); కుదురు = మూలం; అన్వయము = వంశం; బెడిదము = కఠినం; వుయితోడు = వెనుదీయు; పొందు = సంధి; ఆహవరంగము = యుద్ధ స్థానం; క్రేణిసేయు = పరిహాసంచేయు; ఈల్గుట = చచ్చుట; సముద్ర+వేలా+అవృత+ఉర్వి = సముద్రం యొక్క ఒడ్డు చేత చుట్టబడిన భూమి (=మొత్తం భూమండలం); ఉపేక్ష = ఉదాసీనత, పట్టింపులేనితనం; దురితము = పాపం, చెడు; బాహు + గర్వ + దుర్వారులు = భుజ(బలం) వల్ల కలిగిన పొగరుచేత ఆపరానివారు (=శారీరక బలంతో ఆపరానంత పొగరెక్కినవారు); రిత్త బవరము = వ్యర్థమయిన యుద్ధం; ఆఱడి = నింద; ఒప్పెడు మేనులు = అందమైన శరీరాలు; కైదువులు – కయిదువులు = కత్తులు (= ఆయుధాలు).

వ్యాకరణాంశాలు:

'అస్' అంతమందుగల పదాలకు క–ఖ–చ–ఛ–ట–ఠ–త–థ–ప–ఫ–శ–ష–స (= వర్గ ప్రథమ ద్వితీయ వర్ణాలు+శస,సలు) తప్ప మిగిలిన ఏ హల్లులు పరమైన గూడా ఆ 'అస్' లోపించి దాని స్థానంలో 'ఓ' వస్తుంది.

ఉదా: యశస్ + భరము + యశ్ + అస్ + భరము+యశ్ + ఓ+భరము = యశోభరము.

క–ఖ–ప–ఫ లు పరమైనప్పుడు సకారానికి విసర్గ ఆదేశంగా వస్తుంది.

ఉదా: మనస్ + కంజము = మనః కంజము

ఉరస్ + భేదము = ఉరః భేదము

పయస్ + ప్రీతి = పయః ప్రీతి

తపస్ + ఫలము = తపః ఫలము

'ఇస్ లేదా ఉస్' చివరగల ఉపసర్గలకుగాని, పదాలకుగాని క–ఖ–స–ఫలు పరమైనప్పుడు ఆ సకారానికి 'ష' కారం ఆదేశంగా వస్తుంది.

సామాన్యంగా వేగం ముందు చేర్చే 'నిస్, నిర్' మొదలయిన ప్రత్యయాలను 'ఉపసర్గలు' అంటారు.

ఉదా: నిస్ + కారణము = నిష్కారణము

సర్పిస్ + కల్పము = సర్పిష్కల్పము

ధనుస్ + ఖండము = ధనుష్ఖండము

జనుస్ + ఫలము = జనుష్ఫలము

సర్పిస్ + పాశము = సర్పిష్పాశము

– ఈ నకార సంధికి సంబంధించి ప్రస్తుతాని కీ వివరాలు చాలు.

ఛందస్సు:

ఉత్పలమాల: నాలుగు పాదాల పద్యమిది. ప్రతిపాదంలోనూ వరుసగా భ–ర–న–భ–భ–ర–వ (= లగ) అనే గణాలుంటాయి. ప్రాస నియమం ఉన్నది. పదవ అక్షరం ప్రతిపాదంలో యతి చెల్లుతుంది.

ఉదా:–సారపు । ధర్మమున్ । విమల । సత్యము । పాపము । చేతబొం । కుచే.

ప్రశ్నలు:

1. ధృతరాష్ట్రుని వంశ 'సుచరితక్రమ' మెట్లాంటిది?
2. సుయోధనాదు లెట్లాంటివారని కృష్ణుడన్నాడు?
3. ధర్మ, సత్యాలను గూర్చి కృష్ణు దేవుంటాడు ?
4. 'హితోక్తి' సారాంశం రాయండి.

5. కింది పదబంధాలను విడదీసి సంధులను గుర్తించండి.

1. ఎన్వారు
2. వసుమతీశ
3. కార్యముల్గొనక
4. క్షీరోదకములు
5. సద్భావము.

3. గుణనిధి కథ

- శ్రీనాథుడు

(శ్రీనాథ మహాకవి రచించిన శ్రీ కాశీఖండము చతుర్థాశ్వాసము 74వ పద్యం నుండి 136వ పద్యం వరకు)

కవి పరిచయం:

ఆంధ్రసాహిత్య చరిత్రలో కవిత్రయం తరువాత ప్రసిద్ధి పొందిన పండిత కవి శ్రీనాథుడు. చిన్నారి పొన్నారి చిరుత కూకటి నుండే గ్రంథ రచన చేసిన బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. శ్రీనాథుడు సకల విద్యాసనాథుడై కొండవీటి రాజైన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా, ఆస్థానకవిగా ఉన్నాడు. కాలక్రమంలో పలువురు రాజులను దర్శించి, వారి గౌరవాభిమానాలను పొందిన ఈశ్వరార్చన కళాశీలుడు శ్రీనాథుడు.

శ్రీనాథుడు ప్రౌఢదేవరాయల ఆస్థానంలోని గౌడ డిండిమభట్టును ఓడించి, అతని కంచుఢక్కను పగుల గొట్టించిన పండితుడు. ప్రౌఢ దేవరాయలచే 'కనకాభిషేకం' చేయించుకున్న కవిశేఖరుడు.

15వ శతాబ్దానికి చెందిన శ్రీనాథుని తల్లి భీమాంబిక తండ్రి మారయ. శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు. ఆయన జన్మస్థలం కాల్పట్టణం. తెలుగులో పురాణ ప్రబంధ యుగాలకు వారధిగా నిల్చిన శ్రీనాథుడు బహుగ్రంథకర్త. అనేక రాజ్యాలను సందర్శించినవాడు. పలువురు రాజులచే సన్మానములు పొందినవాడు. పలు ప్రదేశములు తిరిగి అనేకమైన చాటువులు చెప్పినవాడు. తెలుగు సాహిత్య చరిత్రలో ఏ కవి జీవితంలోను కనిపించని కష్టసుఖాలు శ్రీనాథుని జీవితంలో కనిపిస్తాయి. బంగారు పళ్ళాలలో భుజించిన శ్రీనాథుడు చివరి రోజులలో వ్యవసాయం చేయవలసిన పరిస్థితి రావడం విధి విలాసమే కదా!

శ్రీనాథుడు మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పలనాటి వీరచరిత్ర. పండితారాధ్య చరిత్ర, శృంగార నైషధం, హరవిలాసం, భీమఖండం, కాశీఖండం, క్రీడాభిరామం, శివరాత్రి మాహాత్మ్యం మొదలైన గ్రంథాలు రచించాడు. విద్వదౌషధంగా పేరుపొందిన నైషధాన్ని ఆంధ్రీకరించడం, అయః పిండమనబడే కాశీఖండాన్ని రచించడం శ్రీనాథుని ప్రతిభకు తార్కాణాలుగా చెప్పుకోవచ్చు.

శ్రీనాథునికి 'కవిసార్వభౌముడు' అనేది బిరుదు.

ప్రస్తుత పాఠ్యభాగం శ్రీనాథుడు రచించిన కాశీఖండం చతుర్థాశ్వాసంలోని 'గుణనిధికథ' నుండి గ్రహింపబడినది.

*　*　*

గుణనిధి కథ

సీ. ఆదె గంధవతిఁ జూడు మవనీ సురోత్తమ!
　　వరుణుని వీటి కుత్తరమునందు
నిమ్మహా పట్టణం బేలు గంధవహుండు
　　భవు కృప నీతఁడీ పదముఁ గాంచె
నాదిఁ గశ్యపుని దాయాదుండు పూతాత్ముఁ
　　డను పేరి బ్రాహణుం డనఘ! యితఁడు
తరుణేందు ధరు రాజధాని వారాణసి
　　నయుతాబ్దములు తాపంబాచరించి

తే. లింగసంస్థాపనంబు గల్పించి లింగ
మధ్యమున యందుఁ గందర్ప మథనుఁ గాంచి
జ్యోతిరభ్యంతరస్థు నావ్యోమకేశు
సంస్తుతించె నతుడు విస్పష్ట ఫణితి.　　74

వ. దేవదేవ! మహాదేవ! దేవాభయ ప్రద! నారాయణేంద్రాది సర్వదేవరప్రద! సంస్తుత్యుండవు, స్తోతవు, స్తుతివి, సగుణుండవు, నిష్గుణుండవు, నామరూప వివర్జితుండవు, ఇచ్ఛా జ్ఞానక్రియాశక్తులు నీయవి. ఒక్కరుండవయ్యును శివశక్తి భేదంబునను ద్వైతంబు భజియింతువు. నీదక్షిణాంగంబు బ్రహ్మ నీవామాంగం బచ్యుతుండు. చంద్రసూర్యాగ్నులు నీనేత్రంబులు; నీనిశ్వాసంబు శ్రుతులు; నీప్రస్వేదాంబువులు నదులు; నీశ్రోత్రంబులు సమీరణంబులు; నీభుజంబులు దిక్కులు; నీముఖంబులు బ్రాహణులు; నీబాహువులు రాజన్యులు; నీ యూరువులు వైశ్యులు; నీపదంబులు శూద్రులు; నీకేశంబు, లంబుధరంబులు; నీ ప్రకృతిపురుషరూపంబున బ్రహ్మాండంబు సృజియింతు నీయంద సర్వభూతంబులుద్భవిల్లు. నీ సర్వభూతమయుండవని యనేక ప్ర కారంబులం బూతాత్ముండు సంస్తుతింపం బ్రసన్నుం డై పరమేశ్వరుం డతని కోరిన దిక్పాలపదం బిచ్చి తనమూర్తులయందు నంశంబు ప్రసాదించి సర్వగతత్వంబును, సర్వావబోధక త్వంబుఁ బ్రాణా పాశాదిపంచమూర్తిత్వంబు నొసెంగె. అతఁడు కాశీక్షేత్రంబున జ్యేష్ఠేశ్వరుని పశ్చిమ భాగంబున వాయు కుండంబు నుత్తరంబునఁ బ్రతిష్ఠించిన యప్పర మేశ్వరునకు నవ్యాక్షేపంబున భోగమోక్ష ప్రదత్వంబు సంపాదించి యంతర్హితుండయ్యె. ఇది గంధవతి వృత్తాంతంబు.　　75

కుబేర వృత్తాంతము

క. నిగమజ్ఞ! గంధవాహుని
నగరమునకుఁ దూర్పుదిక్కున గుణోదారం
బగుపట్టణ మదె! యలకా
నగరం బది యేలు యక్షనాథుఁడు గరిమన్.　　76

వ. అక్కు బేరుని చరితంబు చెప్పెద మాకర్ణింపుము.　　77

తే. భూసురోత్తమ! కాంపిల్యపురమునందు
యజ్ఞదత్తాఖ్యుఁ డొక్క బ్రాహ్మణుఁడు కలఁడు
వేగ వేదాంగ వేదార్థవి త్తముండు
యజ్ఞవిద్యావిశాకదుం డాద్విజుండు.　　78

తే. అతనిపుత్త్రుండు గుణనిధి యనెడివాఁడు
దర్శకునితోడిజోడు సౌందర్య రేఖ
నెయ్య మలరంగ గురులుపనీతుఁ జేసి
చదువఁ బెట్టిరి వాని నాచార్యునొద్ద. 79

క. ద్యూత క్రీడారతుఁడై
యాతఁడు కితవులును దాను నాసాయంబా
ప్రాతస్సమయము తిరుగు న
పేతనిజాచారుఁ డగుచు నెల్లెడ వీటన్. 80

సీ. బ్రాహ్మణాచారంబు పరిహాసముసేయు
నగ్నిహోత్రవిధానమన్న నలుగు
సంధ్యాభినందన శ్రద్ధ యుజ్జన చేయు
గీతవాద్య వినోద కేళిఁ దగులుఁ
బాషండ భండ దుర్భాషలావర్తించు
ద్యూతకారులతోడి యుద్ది వడయు
ధాతువాదులమీఁదఁ దాత్పర్య మొనరించుఁ
జెలిమి వాటించు నాస్తికులతోడ

తే. నటుల మన్నించు హర్షించు విటులఁ జూచి
పీఠమర్దుల కొనరించుఁ బెద్దఱికము
కౌలటేయులఁ బాటించు గారవించుఁ
జేటకుల దీక్షితునికపట్టి సిగ్గు విడిచి. 81

వ. సజీవ నిర్జీవద్యూతంబుల నోడిన ధనంబులు కితవులకుం దల్లి మేని రవణంబుల
నమ్మి పెట్టుచుండు. 82

తే. తల్లి బోధించుఁ దత్పరత్వంబు గలిగి
యన్న! మీయన్న చెప్పినయట్ల చేయు

ధూర్తసంగతి విడువు సాధువులతోడఁ
బరిచయము చేయుమని పుత్త్రుఁ బ్రతిదినంబు. 83

వ. దీక్షితుండు గృహకార్యాంతర వ్యగ్రుండై కొడుకు వర్తనంబుఁ బరామర్శింపక
యుండు. 84

తే. ఎడపఁ దడపఁ దనూభవుండెచట నుండు
గానరాఁడంచు గృహభర్తకాంత నడుగ
నింత తడవును నాయొద్ద నిచట నుండి
యరిగె జదువ్వగ నని భర్త కతివ మొఱఁగు. 85

తే. స్నానమాడెనె? వార్చెనే సంధ్య? నగ్ని
హోత్రమొనరించెనే? యింతి! పుత్త్రుఁ డనిన
స్నాన మాడెను వార్చెను సంధ్య యగ్ని
హోత్ర మొనరించె ననుచును నువిద మొఱఁగు. 86

ఆ. గొడ్డు వీఁగి కన్న బిడ్డంను కావున
నొక్కరుండ కాన నుత్పలాక్షి
ధూర్తుఁడైన వాని దుశ్చేష్టితము లెల్ల
నధిపు నెఱుఁగనీక యడఁచుచుండు. 87

వ. చూడా కర్మానంతరంబున షోడశవర్షంబున గృహ్యోక్త ప్రకా రంబున నతనికి
వివాహంబు చేసి ప్రత్యహంబును. 88

క. స్నేహార్ద్ర హృదయయై యతి
సాహసకృత్యములు మాన సమకొల్పుటకై
యూహాపోహ విచార స
మాహిత గతిఁ దల్లి సుతుని మతి బోధించున్. 89

తే. అన్న! మీతండ్రి కోపగాఁడౌనొ కాఁడొ
యీవు పొనరించు దుర్వృత్త మెఱిఁగెనేనిఁ
గల్లతనమునఁ బలుమాఱు గప్పిపుచ్చు
నట్టి నామీఁద జంపంగ నలుగకున్నె? 90

సీ. సచ్ఛ్రోత్రియులు ననూచానులు సోమపీ
ధులునైన కులము పెద్దలఁ దలంచి
రాజమాన్యుఁడు సత్యరతుఁడు వినిర్మలా
చారవంతుఁడు నైన జనకుఁ దలఁచి
భాగ్యసంపదఁ బుణ్యపతి దేవతలలోన
నెన్నంగఁ దగియెడుపన్నుఁ దలఁచి
వేదశాస్త్ర పురాణ విద్యానిరూఢులై
వాసి కెక్కిన తోడివారిఁ దలఁచి

తే. చెడ్డయింటి చెదార మై శివునికరణ
నివ్వటిలు నిర్వ దేనేండ్ల నిన్నుఁ దలఁచి
పదియు నార్వత్సరంబుల భార్యఁ దలఁచి
గోరతనములు మానురా! కొడుకుఁ గుఱ్ఱ! 91

తే. అఖిలకల్యాణ గుణగణాయత్త యత్త
మామ యౌదార్యతేజః క్షమామహితుఁడు
మాతులుండు యశోమహిమాతులుండు
తనయ! యేలయ్యకై కోవు వినయబుద్ధి? 92

చ. విడువక నీవు పట్టణమువీథుల వీథుల వెఱ్ఱివాఁడవై
చెడుగులఁ గూడి ధౌర్త్యములు చేయ మహీరమణుండెఱింగెనే
విడుచును సోమయాజి; మనువృత్తులు చేకొను నెల్లభంగులన్
జెడుదుము నీ కతంబునను జీరయుఁ గూడును లేకపుత్త్రకా! 93

తే. పట్టణములోన నీవు దర్పమునఁ జేయు
కొయ్యతనములు వీక్షించి కూర్మితనయ!
నవ్వుదురు నిన్ను మొదల నానావిధముల
నవ్వుదురు దీక్షితుని ననంతరమ జనులు. 94

వ. అని యుత నిలువక. 95

తే. తల్లిఁబడి కొల్లి చట్టంచు నుల్లసంబు!
లాడుదురు నన్నుఁ గూర్చి నిన్నహరహంబు
దుర్ణయం బెల్ల నామీఁదఁ ద్రోచి జనులు
డబ్బఱలు పల్కు వారి కడ్డంబు గలదె? 96

క. అవినయ నిధానమగు నీ
నవయౌవన శైశవముల నడిమివయసునన్
గవిసిన వ్యసనోద్రేకం
బవగాఢము దీని మానవయ్య తనూజా! 97

వ. అని యనేక ప్రకారంబుల బోధించిన తల్లి మాటలు చెవులు సోఁకనీక యిట్టట్టనక యూరకుండె. మృగయామద్యపై శున్య వేశ్యాచౌర్యదురోదర పరదారాభిలాషంబులను దోషంబులు నవయౌవనారంభంబున సంభవించెనేని వానిం బరా వర్తింప నెవ్వారు నేర్తురు? గురువచనం బతి నిర్మలంబయ్యు సలిలంబునుంబోలె శ్రవణస్థితంబై యభవ్యునికి శూల పుట్టించును. అయథార్థ నామధేయుండగు నగ్గుణనిధి యథాపూర్వంబు దుర్వర్తనంబులఁ దిరుగుచుండ నొక్కనాఁడు. 98

సీ. దర్శనం బిచ్చె నెద్దానిఁ గోమటి క్రొత్త
పొడచూప నేతెంచి భూభుజునకుఁ
దనకిచ్చె నెద్దాని ధారాంబు పూర్వంబు
పుణ్యకాలమునాఁడు భూమిభర్త
దానిచ్చె నెద్దాని ధర గేహినియైన
సోమిదమ్మకు మనఃప్రేమ మలరఁ

దఱిచూచి యిచ్చె నెద్దానిఁ బట్టికిఁ దల్లి
జూద మోడిన పైఁడి సుట్టికొనిన

తే. వట్టి నవరత్న మయ మైన యంగుళీయ
కంబు యజ్ఞావభృథ పుణ్యకర్మసాక్షి
వీటిలో నొక్క జూదరి వ్రేలనుండఁ
జూచెఁ గనుఱెప్ప వెట్టక సోమయాజి! 99

వ. చూచి తన సొమ్మౌట యెఱింగి దీక్షితుండక్ష క్రీడాజీవనుం గదిసి యెలుం గెత్తి యీయంగుళీయకంబు నీకెట్టు గలిగె? ఉన్న రూపు చెప్పు. తప్పఁ జెప్పితే భూపాలుసన్నిధింబెట్టి నిజంబు దెలిపి దండింతుననిన జూదరి నీతనయుండు గుణనిధి నెత్తంబున నొడ్డన విత్తంబునకై యీయంగుళీయకంబు నా కిచ్చె. మఱి బంగారు భృంగారు కర్కరీకలాచికలు, తళియలు, పళ్లెరంబులు, తామ్రపాత్రంబు, లారకూట ఘటంబు లన్నియుం దాకట్టువెట్టియు దురోచర క్రీడాపకాయణుండై పట్టణంబులోనం జరియించుచున్న వాఁడు. 100

తే. ఆక్షధూర్తులలోన నీయనుఁగుఁ గొడుకు
దొరయు నంతటి యక్ష ధూర్తుండు లేఁడు
క్షితితలంబున యాగదీక్షితులలోనఁ
గీర్తి నీయట్టి యాగదీతుఁడు లేడు. 101

వ. అనిని విని లజ్జాక్రోధంబులు మనంబున ముప్పిరిగొన యజ్ఞ దత్తుం దర్థముండి తంబై న మూర్ధంబున నీర్కావిదోవతి నఱి ముఱింజుట్టుకొని యింటి కేతెంచి మొగంబు గంటుపెట్టుకొని సోమిదమ్మ! ఏమిచేయుచున్న దాన! విటు రమ్మ! నీ కొడుకెక్కడంబోయెఁ? బోవుఁగా కేమి! వినుమని యిట్లనియె. 102

శా. అంగోద్వర్తనవేళ నీవు దరహాసాంకూరముల్ ల్లోచనా
పాంగప్రాంతములం దిగుర్ప నొకసయ్యాటంబుఁ గల్పించినా
యంగుళ్యాభరణంబు పుచ్చుకొనవా? యాయుంగరంబిప్పుడే
శృంగారింపనిచేతఁ బావకునకున్ జేయన్ హవిర్దానమున్. 103

వ. అనిని నద్దీక్షితాయని దీక్షితున కిట్లనియె. 104

సీ. మధ్యాహ్న సంధ్యాసమాగమంబిది తీర్థ
మనధరింపుము దివ్య, మాచరింపు
మగ్ని కార్యముఁ దీర్చు మభవుఁబూజింపుము
పంచమహాయజ్ఞపరుఁడ వగుము
మొగసాల నున్నారు జగతీసుపర్వులు
గ్రాసార్థు లగుచుఁ బెక్కండ్ర తిథులు
పక్వాన్నములు శాకపాకాదికంబులు
చల్ల నాఱెనయేనిఁ జవులు దప్పుఁ

తే. బదిలముగ మందమునందు బరిణలోన
నునిచి దాఁచినదాన మీ యుంగరంబు
దీర దిప్పుడు పెట్టె శోధించి చూడ
నారగించిన పిదప నేనధిప! తెత్తు. 105

తే. అనిన విని సోమయాజి కోపాగ్రహమునఁ
దత్తంచుచు వడి సోమిదమఁ బలికె
నౌన సత్పుత్ర జనయిత్రిఁ యౌనె సాధ్వి!
యౌనె సూనృతభాషిణి! యౌనె దేవి! 106

సీ. స్వాధ్యాయ మెన్నండుఁ జదువఁగఁ బోయె కుండ?
బోలునే చదువంగఁ బోయె ననుట?
తెల్లవాఱంగ నీటఁ దీర్థమాడక యుండ
ననురూపమే తీర్థమాడె ననుట?
సమయానుకూలత సంధ్యవార్వక యుండ
వైదగ్ధియే సంధ్యవార్చె ననుట?
తఱితోడ నగ్నిహొత్రము వేల్వ కుండంగ
విజ్ఞాన సరణియే వేల్చెననుట?

తే. కల్లలాడంగ ఫలమేమి కలిగెనీకు!
మాటి మాటికి నేను నీమాట నమ్మి
యరసి రక్షింప నేరక యనుఁగు గొడుకు
భ్రష్టుఁ జేసితి నేమి చెప్పంగఁ గలదు? 107

సీ. ఏడఁ బోయెనొ కదా మేడలో మంజిష్ఠి!
పెనుబండువునఁనైన బెట్టఁ జాలఁ
డాకట్టు వడదె యింతకు వైశ్యగృహమున
కనక కక్కరిల భృంగారు కంబు?
పట్టుసూత్రమయంబు పసిఁడి యొడ్డాణమే
యిగురుఁబోఁడి కటీరమెక్కె నొక్కొ!
శశికాంత దీపికా స్తంభలీలారత్న
సాలభంజిక యెందు సాఁగెనొక్కొ!

తే. ఎచట నున్నది యొకొ రత్నఖచితమైన
హంసతూలిక డోలా విహారతల్ప
మూఁచముట్టుగ నీవు నీయొంటికొడుకుఁ
బాడు చేసితి గృహము నిర్భాగ్యురాల! 108

తే. చాలునింక నాపాలికిఁ జచ్చినాఁడు
కొడుకు గుణనిధి యనువాఁడు కులవిషంబు
తిలలు దర్భయు నుదకంబుఁ దెత్తుగాఁక
యే, నివాపాంజలులు వానికిత్తు నిపుడు! 109

వ. కుపుత్త్రత్వంబుకంటె నపుత్త్రత్వంబు మేలు. కులపాంసనుండైన వీని నొక్కనిం ద్యజించి కులంబు రక్షించుట నీతియ కదా! యని పలికి కోపావేశంబునఁ బెదవులదరఁ గటతటంబులు చిటుల భ్రూకుటి నిటలంబున నటింపఁ గటాక్షం బులం గెంపు గదురం గటకటంబడుచు నాహ్నికంబైన క్రియాకలాపంబు నిర్వర్తించి యాగ్రహంబు కృతార్థత్వంబునొందఁ గొన్ని దివసంబులకు నొక్క

శ్రోత్రియుని పుత్త్రిం బెండ్లియాడి యజ్ఞదత్తుడు గృహస్థధరంబు నిర్వర్తించుచుండె. అంతకుమున్న గుణనిధి తండ్రికోపం బెఱింగి యింటికిం బోవక యెందెనియుం జనువాఁడనని మనంబున నిట్లని వితర్కించె. 110

తే. ఏమిసేయుదు? నెక్కడి కేగువాఁడ?
ధనము నిప్పచ్చరంబు విద్యయు హుళిక్కి
పెట్టసాఁగెడు నాచేయి భిక్షసేయ
నెట్టు నేరుచు! దైవం యెఱుఁగు నింక. 111

తే. ఏభయంబును నెచ్చోట నెనయలేదు
నరున కెప్పాట విద్యాధనంబ ధనము
చోరబాధాదికముల చేఁ జూఱవోవు
ధనము ధన మౌనె యెన్ని చందములఁ దలఁప! 112

తే. ఆక్కటకట! దురోదరవ్యసన మెట్లు?
యాయజూక విశిష్టాన్వవాయ మెట్లు?
ఎట్లు చేసినఁ జేసెఁగా కేమనంగ
నేర్చువారము? విధి దయానిస్పృహృదయి. 113

చ. అరుణ గభస్తిబింబ ముదయాద్రిపయిండబొడతేర గిన్నెలోఁ
బెరుగును వంటకంబు వడపిందియలుం గుడువంగఁ బెట్టుని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే?
హరహర! యెవ్వరింకఁ గడుపారసి పెట్టెద రీప్సితాన్నముల్? 114

వ. అనుచు నెందేనియుం జనియె నంత. 115

మాలిని. ఘుసృణకుసుమమాలాకోటి పాటల్య లీలన్
గిసలయములచాయన్ గీరచంచూపుట శ్రీ
విస్మృమర స్మృమరోర్ణా విభ్రమప్రౌఢి మింటన్
బిసరుహహిత దీప్తుల్ పింగళత్వంబు నొందెన్. 116

తే. పాటలాంశు జటాభారభాసురుండు
భార్గవుఁడు వోలె నోలాడె భాస్కరుండు
రాగరక్తచ్ఛటానిర్ఝర ప్రపూర్ణ
చరమసంధ్యాశమంత పంచక నదముల. 117

వ. వెండియు ధౌతారకూట పాటలకోమలాతపంబై వాసరంబు పలుకంబాతే అస్త్రాద్రి కిరీట కూటంబున దరవిక చనిచులకుసుమ మంజరీపుంజంబునుం బోలె మిహిర బింబంబు చూపట్టె. చరమ ధరాధరధాతుధారాప్రవాహంబునుం బోలె సంధ్యా రాగంబు గగనమండలంబు నాక్రమించె. చైత్యద్రుమంబులు విద్రావణద్రోణకాక కాకుకోలాకోలాహలంబు కులాయంబులయ్యె. అంధకరిపు కంధరామూల కాలకూటచ్ఛాయాశ్రేణి పాణింధమంబై యంధకారంబు బ్రహ్మాండమండలంబు నాచ్ఛాదించె. రజనీశుక్తిముక్తా ఫలంబులు చుక్కలు పొడిచె. భవిష్యద్వాసరకర కరప్రరోహ బీజాంకురంబులం బోలెఁ బ్రదీపంబులు భవనాంతరంబుల వెలింగె. అప్పుడు గుణనిధి వేఁకలి పేర్చు కార్చిచ్చునుం బోలెఁ బెచ్చుపెరిఁగి యందంద కడుపుమండింప వంటకం బెక్కడఁ గలుగునో యని చింతాక్రాంతుండై యున్న యవసరంబున నద్దినంబు శివరాత్రి యగుటం జేసి శైవుండొక్కరుండు నగర బాహ్యప్రదేశంబున నొక శివలింగ స్థానంబున జాగరణంబుఁజేసి నాలుగుజాములు నుపహారంబులు సమర్పించు వాఁడై నియమవ్రతంబుఁ బూని భక్తివిశ్వాస తాత్పర్యాతిశయంబున. 118

సీ. మరిచిధూళీపాళి పరిచితంబులు మాణి
బంధాశ్మ లవణ పాణింధమములు
బహులసిద్ధార్థజంబాల సారంబులు
పటురామరామోద భావితములు
తింత్రిణీక రసోపదేశ ధూర్ధరములు
జంబీర నీరాభి చుంబితములు
హైయ్యంగవీన ధారాభిషిక్తంబులు
లలితకు స్తుంబరూల్లంఘితములు

తే. శాకపాక రసావళి సౌష్ఠవములు
భక్ష్య భోజ్య లేహ్యంబులు పానకములు
మున్ను గాఁగల యోగిరంబులు సమృద్ధి
వెలయఁ గొనివచ్చె నొండొండ వివిధములను; 119

వ. అప్పుడు భూసుర ప్రవరుండు నాసికాపుట కుటీకుటుంబి యగు పక్వాన్న గంధంబు గాలివెరవున నాఘ్రాణించి యా యన్నంబు నాకు నెబ్బంగిఁ గుడువ సమకూఱునో యని యప్పరిమళంబు సడపట్టుకొనిపోయి శంభు భవన ద్వారంబునం గూర్చుండి నృత్త గీత వాద్యంబులు ప్రవర్తిల్ల సరిప్రొద్దుపోవురం దాఁక వీక్షించుచు జాగరంబు చేసి యంతంత సాఁగి ప్రజలు చొక్కు మడంగి యుండఁదా నయ్యవసరంబున. 120

సీ. కట్టాయితంబుగాఁ గటిమండలంబునఁ
దీర్చి దట్టి చేల దిండుగట్టి
తలుపు గిఱ్ఱనకుండఁ దరిమి కొంచెంబైన
యోరవాకిట దేహమొయ్యఁ జొనిపి
మునివ్రేళు లొయ్యొయ్య మోపి చప్పుడుగాని
పరిపాటి పవనంబుఁ బట్టి నడచి
దీపాంకురచ్ఛాయఁ దెలివిచాలని యట్టి
కొనచీకటిలోని కొనరఁ జొచ్చి

తే. పళ్లెరములందపూప సూపములతోడ
ననఁటి పండులతోడ నాజ్యంబుతోడ
దధిపయః క్షౌద్ర బహుపదార్థములతోడ
ధవళకలమాన్న మీక్షించె ధరణిసురుఁడు. 121

తే. గర్భమంటపికా దీపకళిక యపుడు
దశ చెడఁగ గాలి నిర్వాణదశ వహింప

దీప్తిసింధు క్షణముచేసి తెలివి పడఁగ
నన్నమీక్షింపఁ దలఁచె బ్రాహ్మణకులుండు. 122

శా. గ్రుక్కిళ్మింగుచు నొక్క యోదన మహాకుంభంబు నీక్షించి, వాఁ
డక్కోణంబున మందరశ్మియగు దీపాంకూరమున్ మీఁది కై
యెక్కంద్రోచి ఘృతంబునించి నిజవస్త్రైకాంతముంజించి చే
నొక్కన్ వత్తిగ నేఁతదోఁచెను శిఖన్ యోజించె వైశ్వానరున్. 123

సీ. పక్వాన్న పాత్రంబు పాణిఁ గైకొని బహి
ర్ద్వారభూమి భుజించు వాంఛ నతఁడు
వెల్వడి వచ్చుచో విధివశంబుస వాని
కాలిద్రేలౌకనియంగంబు దాఁకెఁ
దాకినవాడు తత్తఱపాటుతో మేలు
కని బ్రుచ్చు బ్రుచ్చని కళవళించెఁ
గళవళింప గతానుగతికమార్గంబున
నాక్రోశ మొనరించి రఖిలజములు

తే. నన్న పాత్రంబు విడువక యవనిసురుఁడు
పాఱె భయవిహ్వలుండయి బయలువట్టి
వెంటఁదగిలి తలారులు వెగడుపడఁగ
బాణముల నేసి చంపి రాబ్రహ్మకులుని. 124

తే. అతనిఁ గొనిపోవఁ బనిపూని యమునిభటులు
వరుణ పాశోగ్రహస్తులై వచ్చిరవుడు
వానిఁ గొనిపోవఁ బనిఁబూని వచ్చిరపుడు
త్ర్యంబకుని కింకరులు విమానంబుఁ గొనుచు. 125

వ. అనంతరంబ పట్టిస త్రిశూల ఖట్వాంగ ప్రముఖ బహువిధ ప్రహరణపాణు లగు పినాకపాణి భటులం జూచి భీతచిత్తులై కృతాంక కింకరులు కరపంకజంబులు మొగిచి వారి కిట్లనిరి. 126

తే. అభవుకింకరులార ! మహాత్ములార !
తగవు ధర్మంబు పాడిపంతంబు దెలియు
మీకు నడ్డంబుగలదె ముల్లోకములను?
నెంతవారము మేము మీయెదుర నిలువ? 127

వ. వీఁడు కులాచారహీనుండు. పితృవాక్యపరాఙ్ముఖుండు, సత్య శౌచపరిభ్రష్టుండు, సంధ్యాస్నాన వివర్జితుండు. శివనిర్మాల్యాపహర్త, వీనియం దొక్క ధర్మంబు లేశంబు గలిగిన నానతిండు. వీని పుణ్యా పుణ్య వివేకంబునకు మీర ప్రమాణంబనిన కృతాంత కింకరుల వాక్యములాకర్ణించి శివకింకరులు వారి కిట్లనిరి. 128

క. శివధర్మంబతి సూక్ష్మము
శివధర్మము లేశమైన సిద్ధించెనయే
వివిధ మహాపాపోప
ద్రవములు చేకంగ రావు ధన్యుని నతనిన్. 129

తే. స్థూలదృష్టి వీక్షించినఁ దోఁపకుండ
సూక్ష్మదృష్టి వీక్షించినఁ జూడ్కి కందుఁ
గాన శివభక్తి ధర్మంబగాధమహిమ
కానవచ్చిన యట్లుండుఁ గానరాదు. 130

క. ఆచారం బిది యనగ, న
నాచారం బిది యనంగ నజునకు నైనన్
గోచరముకాదు శివ ధ
ర్మాచారము సూక్ష్మసూక్ష్మమై వర్తిల్లున్. 131

వ. ఇతఁడు చేసిన పుణ్యకర్మంబు వినుండు. 132

సీ. ఆశన మబ్బక యున్ననైనను శివరాత్రి
యోరంత ప్రొద్దును నుపవసించె

నోగిరంబు హరింప నొనవెట్టు కొనియైన
వేగునంతకుఁ జేసె జాగరంబు
పాత్రావలోకనోపాయంబునకు నైన
వెలనైన దీపంబు వెలుఁగఁ జేసెఁ
జూడ చొల్లకయైనఁ జూచె నీశ్వరుమౌళిఁ
బరులు చేసిన యట్టి ప్రసవపూజఁ

తే. జచ్చె విధి మూడియైనను జంద్రధరుని
నగరిమోసాలఁ బెద్రోవనట్టనడుమ
సూక్ష్మదృష్టి విచారించి చూచినప్పు
డింతకంటెను ధర్మంబు లెవ్వి గలవు? 133

వ. అని పారిషదులు యమదూతల వీడ్కొలిపి యతని దివ్య విమానారూఢుం జేసి శివలోకంబునకుం గొనిపోయి శివుని సన్నిధిం బెట్టిరి. శివుండును బ్రదీప తేజస్సంధుక్షణాదిక పుణ్యానురూపంబైన ఫలంబునం గళింగ దేశాధిపతియైన యరిందమునకుం దనయుండై దముండను పేర నాదేశంబునకు రాజుగా నను గ్రహించి పుత్తెంచె. ఈశ్వరానుగ్రహంబునఁ బట్టాభిషిక్తుండై. 134

క. చాటించెఁ గళ్లింగేంద్రుఁడు
వీటను దేశమున శంభువేశ్మంబులలోఁ
బాటించి దీపకళికా
కోటు లసంఖ్యములు మెండుకొని యుండుటకున్. 135

క. ఇలువరుసఁ జంద్ర శేఖరు
నిలయంబున దీపకళిక నిలుపనివారిన్
దలఁద్రెవ్వఁగ వ్రేయుండని
తలవరులం బంచె రాజు తన దేశములన్. 136

II. పద సాహిత్యం

1. పద సాహిత్య వికాసము

"ముదివిటులు విధవ లంజలు
పద కవితలు మారు బాస బాపనవారల్
చదువని పండిత వర్యులు
కదనాస్థిర వీరవరులు కడిదిపురమునన్"

(చాటుపద్య మణిమంజరి 1, పు. 130)

ఇది తెలుగు కవులలో ప్రసిద్ధుడైన శ్రీనాథునిదని ప్రతీతి కాని ఇది నమ్మశక్యం గాని సంగతి. శ్రీనాథుడు ఒక చెంప ఉద్దండ పండిత ప్రకాండుల ప్రశంసాపాత్రమైన శృంగార నైషధాది మహా కావ్యకర్త అయిన మరోవైపు పామర ప్రజల మన్ననలకు నోచుకొన్న పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథల్ని రచించి ఉండడం సర్వ పండిత లోకానికి సువిదితమే. పరంపరగా మన పండితవర్యులు పద సాహిత్యానికి ప్రాధాన్యం ఇవ్వలేదన్న మాటమాత్రం అక్షర సత్యం; చారిత్రక సత్యం.

సంస్కృత సమాస భూయిష్ఠమై, శబ్దాడంబర సంయుతమైనది పండితుల భాష. సరళమూ, సులలితమూ, సులభగ్రాహ్యమూ అయినది పామర భాష. దీన్నే మనం లక్షణానుగుణంగా మరో విధంగా చెప్పవచ్చు: గ్రాంథిక భాష, గ్రామ్యభాష అనవచ్చు. కానీ ఈ గ్రాంథిక భాషకంటే గ్రామ్యభాషే మొదటిదన్న విషయం మనం మరవకూడదు. పామరుల వాడుక భాషయే కాలాంతరంలో సంస్కరించబడి, వ్యాకరించబడి లక్షణబద్ధమై గ్రాంథిక భాష అయింది; అంటే పండిత భాష అయింది. "ప్రయోగ శరణం వ్యాకరణమ్" అనే సూత్రమే దీనికి చక్కటి తార్కాణం.

ఇలాగే సాహిత్య విషయంతోను మనం గమనించగలం. తెలుగు సాహిత్యాన్నంతటినీ పండిత సాహిత్యమూ, పామర సాహిత్యమూ అని స్థూలంగా రెండు విధాలుగా విభజించవచ్చు. దీన్నే ప్రౌఢ సాహిత్యమూ, జానపద సాహిత్యమూనని పేర్కొనవచ్చు. ఇంతకంటే శిష్ట సాహిత్యమూ, శిష్టేతర సాహిత్యమూ – అని చెప్పటం సముచితం. ఈ శిష్ట సాహిత్యంకంటే, శిష్టేతర సాహిత్యమే ఆదిలో ఆవిర్భవించి, వికాసం పొందింది. ఆ వెనుకే శిష్ట సాహిత్యం ఉద్భవించి, తన బలాన్ని, ప్రాభవాన్ని స్థిరపరచుకొంది. నిజమే 'ముందొచ్చిన చెవులకంటే వెనుకొచ్చిన కొమ్ములువాడి' అన్న సామెత ఉంది కదా! అనాదిగా వస్తూన్న సహజమూ, స్వాభావికమూ, నిసర్గ మనోజ్ఞమూ అయిన జానపద కవితను మన పూర్వులు సేకరించి కాపాడలేదు. రాజాదరణకు పాత్రమైన శిష్ట సాహిత్యం అధికారం చలాయిస్తూ వచ్చింది. జానపద సాహిత్యమింకా ఆడి, పాడుకోవడానికి పనికివచ్చే పద కవితలు, పండితులకు మాత్రమే పరిమితమైన శిష్ట సాహిత్యమంతా పద్య కవితలు, జాదపద సాహిత్యం జనసామాన్యంలోనూ, పండిత సాహిత్యం పండిత పరిషత్తుల లోను కొనసాగుతూనే వచ్చాయి. దీన్నే మనం మరోవిధంగా చెప్పవచ్చు. తెలుగు సాహిత్యపు మాగాణంలో శిష్టేతర కవితా ప్రవాహం మూడుపాయలుగా ప్రవహిస్తూ వస్తుంది. మొదటిది కేవలం జానపద కవిత; దానిపుట్టుక అనాది; లిఖితం కాలేదు; కేవలం మౌఖికం. రెండోది పాల్కురికి సోమనాథునితో ప్రారంభమైన ద్విపద కవిత; దీనికి మళ్ళీ జానపదులలో వ్యాప్తిలో ఉన్న ఏలలు, జోలలు, కథలూ, గాథలూ మొదలైనవే ఆధారం. కాకపోతే ద్విపదని మాత్రమే పాల్కురికి గ్రహించాడు. గ్రహించడమే గాదు; దానికి కావ్య ప్రతిపత్తిని తెచ్చాడు. అంటే పండితులు గౌరవించేట్టు చేశాడు.

"తేట తెనుంగున ద్విపదరచింతు
....
ఒప్పదు ద్విపద గావ్యోక్తి నావలవ,
దారూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ట రచన

మానుగా సర్వ సామాన్యంబు గామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు
నట్టులు గాక కావ్య ప్రౌఢి పేర్మి
నెట్టన రచియింప నేర్చిన నాలు
నుపమింప గద్య పద్యోదాత్త కృతులు
ద్విపదము సమము భావింప.....
....
పరకవుల్గొనియాడ వర్ణన కెక్క
ధర జెప్పగృతియు సుద్యత్కృతిగాక"

– అని చెప్పడమే గాదు; ఆనాడు పండిత లోకంలో తెలుగు పలుకులంటే గౌరవాదరాలు లేనని తెలుస్తుంది. ఆ పండితుల్ని ఒప్పించడానికి పాల్కురికి పాటుపడినట్టు తెలుస్తుందీ.

"ఉరుతర గద్య పద్యోక్తులకంటె
సరసమై పరగిన జానుదెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
గూర్చెద ద్విపదలు గోర్కి దైవార
దెలుగు మాటలనంగ వలదు; వేదముల
కొలదియ కాc జూడుc డిలనెట్టు లనిన
బాటి తూమునకును బాటి యౌనేని
బాటింప సోలయు బాటియకాదే"

– "తెలుగు మాటలనంగ వలదు; వేదముల కొలదీయుగా జూడుడు" అని పాల్కు రికి పట్టుపట్టి ఒప్పించాడు. అందుకే ఆ తరువాత తెలుగు సాహిత్యంలో ద్విపద రచనలకు అత్యంతాదరం లభించింది. ఒక శాఖగా శోభాయమానంగా వెలు గొందుతూ వచ్చింది.

ఇక మూడోది తాళ్ళపాక అన్నమాచార్యునితో ఆరంభమైన సంకీర్తన సాహిత్యం. ఇది తెలుగులోని పద సాహిత్యం. ఆనాది నుంచి వస్తూ, ఆనాటి సామాన్య

ప్రజలలో ప్రచారంలో ఉండిన జానపద గేయరీతుల్ని గ్రహించి, అనేక పదాలను శిష్ట కవితలో ఒక భాగంగా వెలయించి, పద్య కవితా పీఠం పక్కనే పద కవితకు సైతం సరి పీఠం నవదరించిన ఘనత అన్నమాచార్యునికి దక్కింది; పై పెచ్చు 'సంకీర్తన లక్షణం' సంస్కృత భాషలో రచించి దీనికి విశిష్టతని, గౌరవ ప్రతిపత్తుల్ని తీసుకొని వచ్చిన ఘనత ఇతనిదే. ఇది గమనించదగ్గది; గర్వించ దగ్గది.

ఈ పద సాహిత్యం దేశ కవితా విభూతిలోని భాగం. దేశి అయిన తెలుగు కవిత నాలుగు విధాలని, అందులో మధుర కవితా రీతిలో చేరినది పదకవిత అని లాక్షణికోక్తి ఉంది. "తెలుగు కవిత యాశు, మధుర, చిత్ర, విస్తరములని నాల్గు తెఱగుల గలదని లాక్షణికులనిరి........ అందు మధుర కవితయనగా పాటలు మొదలగునవి. లక్షణ దీపికలో నీ విషయమిట్లు చెప్పబడినది. మధుర కవిత్వంబన్నదీ నాటకాలంకారంబులు, కళికోత్కళికలు, విభక్త్యర్థ/వతోదాహరణము, సప్తతాళ నటనలు, నట్టొట్లు, గీత ప్రబంధములు, గతుర్భద్రికాష్ట భద్రికలు, బిరుదావళి, నామావళి, భోగావళి, రంగఘోష, చతురతర సంఘటనలు, యక్షగానంబున వెలయు పదంబులు, దరుపులు, ఎలలు, ధవళంబులు, మంగళ హారతులు, శోభనంబులు, ఉయ్యాల జోలలు, జక్కుల రేకు పదంబులు, చందమామ సుద్దులు, అష్టకంబులు, ఏక పదంబులు, ద్విపద, త్రిపద, చతుష్ట పదాష్టపదులు లోనివి యాదిగా గల్గునవి."

ప్రపంచములోని ఏ సాహిత్యాన్ని పరిశీలించినా, పద పద్య కవితల్లో పద కవిత్వమే ముందావిర్భవించిందన్న విషయం సర్వ ప్రాచ్య, పాశ్చాత్య విపశ్చిద్వరులు అంగీకరించారు. ప్రాక్తన మానవుడు సుఖదుఃఖాది అనుభూతుల్ని పొందినపుడు తదనుగుణంగా ఆడి, పాడుకోవడంలోనే ఈ పదకవిత పుట్టింది. ఈ పద కవితా విర్భావాన్ని గూర్చి R. G. Moulton పండితుని అభిప్రాయము ఉల్లేఖించ "The Improvised lyrical song. Communal or individual, a popular or artistic is probably the simplest and most sponta- nious form of lyric expression........ The true song is primarily the instinctive out-burst of emotion or emotional thought in language which by aptness of word and rythm echoes suggests the underlying emotion and melody of line

and harmony of stanza is adopted to such modulations of the singing voice as naturally distinguish emotional utterance...... The song is therefore more than any other lyric king a musical cry."

"That the popular or traditional ballad is folk poetry, i.e. poetry that has originated usually in oral from, among a homo- geneous, non literary people and has been handed down among them by word of mouth, is generally conceded."

"మనదేశంలో చాల ప్రాతపాటలు వేద సూక్తములు. మనుష్య జాతికి అవి మొదటి రచనలు అని యూహింపవలసినవి. వాటి గానమందు తాళము లేదు అనునది మనమిక్కడ గమనింపవలసిన సత్యము ... నేటికినీ తెలుగులో పరమ ప్రాచీన పద్ధతియని చెప్పదగిన పల్లెపాటలు, కపిలె పాటలు మొదలగునవి – కొన్ని తాళ నియమము లేకుండనే పాడబడుచున్నవి. ఈ రాగ కాళములు రెంటిని కలిపి హృద యంగములైన భావములను వెలుపరుచు భాషను అలంకరించుటయే పదరచనకు పరిపూర్ణ స్వరూపము. దాని పూర్ణానుభవమును మనకప్పుడే; సతాళము గనో, వితాళము గనో కావ్య కళారసానుభవమును ప్రాచీన మనుష్యజాతి పాట రూపముననే అనుభవించి రచించినదని పండితులూహింతురు. మన పద్యము లన్నియు పదముల పరిణామములే అని భావించుటకు పెద్ద సూక్ష్మదృష్టి అక్కరలేదు" అని శ్రీరాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి మాటలు చక్కటి నిదర్శనాలు. కాబట్టి ఈ పదకవితే కాలాంతరములో సంస్కరించబడి పద్యకావ్యంగా, ప్రౌఢకావ్యంగా, పండిత కావ్యంగా అంగీకరించబడి గౌరవాదరాలకు పాత్రమైంది. పదకవిత చాలాకాలం వరకు పండితామోద ముద్రను పొందకపోయినా, రాజగౌరవ పాత్రం కాకపోయినా దాని దారిన అది నడుస్తూనే వచ్చింది; అభివృద్ధి చెందుతూనే వచ్చింది. సామాన్య ప్రజల మన్ననలకు మాననీయమవుతూనే వచ్చింది. చివరికి రాజ గౌరవాదరాలకు నోచు కొంది; పండితులు సైతం సమాదరించడం జరిగింది.

తెలుగులో సైతం ఆరంభంలో చక్కటి పదాలుండేవనీ, పామర ప్రజలు వాటిని పాడి ఆనందించేవారనీ చెప్పగానికి తగిన ఆధారాలున్నాయి. పాల్కురికి

సోమనాథుని మాటలే ఇందుకు చక్కటి కార్యాణం :

"మదినుబ్బ సంసార మాయాస్తవంబు
పదములు, పర్వత పదము, లానంద
పదములు, శంకర పదముల్, నివాళి
పదములు, వాలేశు పదములు, గొబ్బి
పదములు, వెన్నెల పదములు, సెజ్జ
వర్ణన మణిగణ వర్ణన పదము
లర్ణవ ఘోషణ ఘూర్ణిల్లుచుండ"

భక్తులు శ్రీశైల పర్వతారోహణ సమయంలో పాడినట్లు పేర్కొన్నారు సోమనాథుడు. కానీ పైని వర్ణితమైన పదాల స్వరూప స్వభావాలేమిటో తెలుసుకొనే అవకాశం మనకు లభించలేదు. కారణం అలాంటి పాటలకు మన సాహిత్యంలో స్థానం లేకపోవడమే ఇలాగే నన్నెచోడుని కాలంలో ఊయల పాటలు, గౌడు గీతాలు ఉండేవని తెలుస్తుంది ఇంతకంటే పూర్వం ఎలాంటి దేశ రచనలుండేవో కొంతవరకు తెలుసుకోవచ్చు. ప్రాఙ్నన్నయ యుగంలోని శాసనాల్లోని తరువోజ, సీసం, మధ్యాక్కర మొదలైన దేశీచ్ఛందస్సులు వాడబడ్డాయి. ఇవి నిబద్ధ చ్ఛందస్సు లలో ఉండడంవల్ల శాసనాల్లోనికి ఎక్కాయి. కానీ ఆ నిబద్ధాలై పండితులచేత ఈసడించబడ్డ సామాన్య జనసముదాయపు పాటలు పరిగణనలోనికి రాలేక పోయాయి. అవి కేవలం మౌఖికం కావడంవల్ల వాటికి స్థిరత్వం లేకపోవడంతో నశించి పోయాయి. అయితే మానవుడు జన్మించి సహజ సంతోష దుఃఖాల అనుభూతిని పొందినప్పటినుంచీ పూర్వోక్తమైనట్లు పదాలు కోకొల్లలుగా వెలిసే ఉంటాయి. పామర ప్రజల రచనలే పట్టుగొమ్మలై వాటి కాధారంగా ఉండేవని మనం భావించడంలో తప్పులేదు. 'నన్నయ నాటికి తెనుగున నెలకొన్న రచనములు పాటలు, పదాలు, ఏలలు, జోలలు, అర్థచంద్రికలు మొదలగు గేయ రచనము లును, అక్షరగణములతో గాక, మాత్రగణములలో నిబద్ధములగు అక్కరలు, రగడలు, సీసములు, గీతములు, మంజరి, తరువోజ, ద్విపద మొదలగు పద్య రచనములునై యుండును." నాచన సోమనాథుడు ఉత్తర హరివంశంతోపాటు

'వసంత విలాసం' అనే ప్రబంధం రచించినట్లు తెలుస్తుంది. అందులో జాజర పాట ప్రసక్తి ఉంది.

"వీణాగానం వెన్నెల తేట
రాణమీరగా రమణల పాట
పేరు చెప్పిన పిన బ్రాహ్మణువీట
జాణలు మెత్తురు జాజత పాట"

ఇలాంటి తేట తెలుగు పద కవితల్ని విని ఆనందించే అదృష్టం ఆంధ్రు లకు కలుగలేదు అవి లభింపకపోవడం వల్ల.

ఏది ఏమైనా సంకీర్తన సాహిత్యం కృష్ణమాచార్యులతోనే ఆరంభమైంది. ఆయన సింహగిరి వచనాలు కొన్ని లభించాయి. ఇతని తరువాత పేర్కొనదగ్గవారు యాగంటివారు. వారి పదాలు, వచనాలు పామర ప్రజల్లో బహుళ ప్రచారంలో ఉండేవి. తదనంతర కాలంలో వీరబ్రహ్మంగారు, వారి శిష్యుడు దూదేకుల సిద్ధయ్యల తత్వాలు ప్రసిద్ధిలోకి వచ్చిన సంగతి మన మెరిగినదే.

తెలుగు పద సాహిత్యానికి 15వ శ. వసంతకాలం. ఆనాడు వేలకు వేలు పదాలు రచించబడ్డాయి. తెలుగు పదకవితకు ఆద్యుడు అనవద్యుడు అన్నమాచార్యుడు; సంకీర్తనాచార్య, పదకవితాపితామహ బిరుదాంకితుడు. ఇతడి పుత్ర పౌత్రులు సైతం పదకవితా రచనచేసి, పదకవితకు రచనా సేవగానించినవారు. ఆ వెనుక సంగీత సాహిత్యాలకు సమాన గౌరవంతోపాటు, అభినయాన్ని జోడించి పదరచన చేసి, పదమంటే శృంగార పదమన్న ప్రసిద్ధిని తెచ్చిన పదకవితా చక్రవర్తి క్షేత్రయ్య. ఆ వెనుక పేర్కొనదగ్గ వాగ్గేయకారుడు సారంగపాణి. పదరచన చేసి భజన గోష్ఠులకు భద్రత కూర్చిన మహానుభావులు భక్త రామదాసు, మునిపల్లె సుబ్రహ్మణ్య కవి. నాదోపాసనతో ముక్తి పొందిన మహా భక్తాగ్రేసరుడు త్యాగరాజ స్వామి. రామదాసు కీర్తనలు, త్యాగరాజస్వామి కృతులు తెలుగు పద సాహిత్యానికి పుష్టిని తుష్టిని చేకూర్చిన సంగతి అందరికీ తెలిసిందే. ఇలాగే ఇంకా ఎందరో మహానుభావులు పదసాహిత్య సేవ చేసినవారు.

తెలుగులోని పదసాహిత్యంలో జరిగిన పరిశోధనా పద్ధతిని పరిశీలిద్దాం. తది తర సాహిత్య ప్రక్రియల్లోకంటే పద సాహిత్యంలో జరిగిన పరిశోధన తక్కువనే అంశం అందరూ అంగీకరించేదే, ఇంకా జరగవలసిందే ఎక్కువ. ఇప్పుడిప్పుడు పద కవితలపై మోజు పుట్టి విశ్వవిద్యాలయాల్లో పరిశోధన ప్రారంభమైంది. ఇదీ ముదావహమైన విషయం.

తెలుగు పదసాహిత్యానికి పట్టుగొమ్మ తాళ్ళపాక అన్నమాచార్యుడు (1408-1503). ఇతడు రచించిన పదాలు 32 వేలు. ఇవి అధ్యాత్మ పదాలు, శృంగార పదాలు అని రెండు విధాలు. వీటికానాడు సంకీర్తనలనియేవాడుక. అందుకే అన్నమాచార్యుడు సంకీర్తన రచన చేయడమేగాక, సంకీర్తన లక్షణాన్ని సైతం సంస్కృతంలో సవరించి ఉండడం విశేషం; ఇప్పుడిది అలభ్యం. అయినా అన్నమాచార్యుని మనుమడు చిన తిరుమలాచార్యుడు తెలుగులో పద్యాత్మకంగా అనువదించాడు. అందులోని పద నిర్వచనం ఇలా ఉంది.

"భరతాదులు గ్రంథంబుల
విరచించిన లక్షణములు వేంకట భూమీ
ధర వర కీర్తన లక్ష్యము
లురు పదకవితా పితామహుందేర్పఱచెన్"

"పదమగు సుప్తి జ్ఞన్తము
పదమవయవ, మయయవియును బదమనబరగున్
దుదినీ తెఱంగులన్నియు
బదకవితా మార్గ సార్వభౌముదు దెలిపెన్"

"పదములు శృంగార వధూ
మృదు మధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
విదికార్థ గ్రామ్యోక్తులు
పదిలముగా బొంకమెతిఁగి పలుకగ చెల్లున్"

"పల్లవ నారీ మ్లేచ్ఛా
ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై,
చెల్లును గ్రామ్యములై నను
హల్లీసకముఖ్య నాటకాధిక ఫణితిన్"

"వైరాగ్య వృద్ధికర గం
భీర పదశ్రేణి పొసగటెనుపుచు నగ్రా
మ్యారమ్య విష్ణుచరితో
దారములై యున్న జాలు ధరణిన్వెలయున్"

దినానికొక్కటిగా 32 వేలు పదాలు శ్రీ వేంకటేశ్వర ముద్రతో అన్నమాచార్యుడు రచించాడు. అలాగే అతని పుత్రుడు పెద తిరుమలాచార్యుడు, మనుమడు చిన తిరుమలాచార్యుడు రచించారు. వెనుక వాటిని భద్రపరచడం కోసం రాగిరేకుల మీద చెక్కించడం పెద తిరుమలాచార్యుడే ఆరంభించాడు. తరువాత చిన తిరుమలాచార్యుడు ఆ పనిని పూర్తిచేసి సుమారు 1545 ప్రాంతంలో ముగించి సంకీర్తన భాండారాన్ని స్థాపించి ఉండవచ్చునని తెలుస్తుంది. 1915లోనే ఆంధ్రసాహిత్య పరిషత్తువారు కొన్నిటిని తమ పత్రికలో ప్రకటించారు. కానీ 1935 నుంచి మాత్రమే వీటి ప్రకటన కార్యక్రమం ఆరంభమైంది. సంపుటం 1, తాళ్ళపాకవారి లఘుకృతులు, సం. 2, తాళ్ళపాకవారి అధ్యాత్మ సంకీర్తనలు, సం. 3, తాళ్ళపాకవారి శృంగార సంకీర్తనలు - ఈ మూడింటి పరిష్కర్తలు శ్రీ విజయ రాఘవాచార్యులు, జి.ఆదినారాయణ నాయుదుగారు. సం.4 తాళ్ళపాకవారి శృంగార సంకీర్తనలు, సం.5 తాళ్ళపాకవారి ఆధ్యాత్మ సంకీర్తనములు; వీటి పరిష్కర్తలు: శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు, ఏ.వి. శ్రీనివాసాచార్యులుగారు, సం.12,13,14,15,18 అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు, సం.16 చిన తిరుమలాచార్యుని శృంగారధ్యాత్మ సంకీర్తనలు - పరిష్కర్తలు: శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు, ఏ.వి.శ్రీనివాసాచార్యులుగారు. సం.13 అన్నసూచార్యుని శృంగార సంకీర్తనలు, సం. 21 పెద తిరుమణాచార్యుల శృంగార సంకీర్తనలు-పరిష్కర్తలు : డా॥ పి.టి. జగన్నాధరావుగారు. సం.19, 20, 22 అన్నమాచార్యుని

శృంగార సంకీర్తనలు-పరిష్కర్తలు: శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, శ్రీ గౌరి పెద్ద రామసుబ్బ శర్మగారు. ఆ తరువాత సం.23,24,25,26,27,28,29,30,31 అన్నమాచార్య శృంగార సంకీర్తనలు-పరిష్కర్తలు: శ్రీ గౌరి పెద్ది రామ సుబ్బశర్మగారు. సం.32 అన్నమాచార్య శృంగార సంకీర్తనలు-గౌరి పెద్దివారు పరిష్కరించి దివంగతులు కాగా, శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు ప్రకటించారు. పూర్వమే ముద్రితమైన అన్నమాచార్యుని ఆధ్యాత్మ సంకీర్తనల్ని కలిపి సం.1,2,3 లుగా శ్రీ గౌరి పెద్ది రామసుబ్బశర్మగారు పరిష్కరించి ప్రకటించారు. శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ (ఐ.ఎ.యస్) గారు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణాధికారిగా ఉండగా అన్నమాచార్యుల కళాపీఠమనీ, అన్నమాచార్య ప్రాజెక్టు అనీ ప్రత్యేకంగా స్థాపించి, ప్రత్యేకాధికారులను నియమించి అన్నమాచార్య సంకీర్తనల ప్రచానానికి మిక్కిలి దోహదం చేశారు. 1981 మే నెలలో అన్నమాచార్యజయంతి సందర్భంగా అన్నమాచార్యుని సంకీర్తనలపై గోష్ఠులు, సదస్సులు ఏర్పాటుచేసి, పలువురు పండితులను సత్కరించడం జరిగింది. 1981 సం॥లో బ్రహ్మోత్సవాల్ని పురస్కరించుకొని విజయవాడ ఆకాశవాణివారు గోష్ఠి నిర్వహించి పండితులచే అనేక ప్రసంగాలు చేయించి ప్రసారం చేశారు వారంరోజులు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు అన్నమాచార్యుని పదాల పరిష్కరణ కొనసాగింపచేస్తున్నారు. అంతేగాక శ్రీ వేంకటేశ్వర, తెలుగు విశ్వవిద్యాలయాల్లో అన్నమాచార్య పీఠాలు నెలకొల్పబడ్డాయి. శ్రీ వేంకటేశ్వర, నాగార్జున, శ్రీకృష్ణదేవరాయ, హైద్రాబాద్, ఉస్మానియా, ఆంధ్ర, మద్రాసు విశ్వవిద్యాలయాల్లో అన్నమాచార్యుని సంకీ ర్తనలపై, వివిధ దృక్కోణాల నుంచి పరిశీలించి, పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈ వ్యాసకర్తవి అనేక వ్యాసాలు పత్రికల్లో వచ్చాయి; అంతేగాక "అన్నమాచార్య, ప్రముఖ వాగ్గేయకారులు-తులనాత్మక అధ్యయనం" అనే అంశాన్ని వ్యక్తిగతమైన పరిశోధనగా గ్రహించి కొనసాగించి 1992లో గ్రంథరూపంలో ప్రకటించాడు. దీనికి 1993 సం॥కు గాను తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం లభించింది.

2. అన్నమయ్య సంకీర్తనల సౌరభం

సంకీర్తన కవులలో కృష్ణమాచార్యులకు తరువాత పేర్కొనదగినవారు తాళ్లపాకవారు. వీరి కవిత తెనాలి రామకృష్ణకవికి గూడ ప్రశంసాపాత్రమైనది.

"చిన్నన్న ద్విపద కెఱగును
పన్నుగ బెదతిరుమలయ్య పదమున కెఱగున్
మిన్నంది మొఱసె నరసిం
గన్న కవిత్వంబు పద్య గద్య శ్రేణిన్."

ఈ పద్యము వీరికి పద్యగద్య పదరచనయందు గల సామర్థ్యమును చాటుచున్నది. 'తాళ్లపాక వారి కవిత్వము కొంత నా పైత్యము కొంత' అన్న సామెత వీరి కవిప్రతిభకు విజయకాహళము. క్రీ.శ. పదునారవ శతాబ్దములో శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామివారి దేవస్థానములో వీరి వంశీయులు నాలుగు తరములవారు సంకీర్తనాచార్యులుగ వెలసిరి. వీరు నందవరీక స్మార్తబ్రాహ్మణులు. భారద్వాజగోత్రులు.

కడప మండలములో రాజంపేట తాలూకాలోని 'తాళ్లపాక' లో వీరి పూర్వులు నివసించుచుండిరి. తాళ్లపాక కవులలో తొలివాడగు తాళ్లపాక అన్నమయ్య బాల్యముననే 'తాళ్లపాక' వదలి తిరుపతిలో స్థిరనివాస మేర్పరచుకొనిరి. తిరుపతి చేరిన పిమ్మట వీరు వైష్ణవమతమును స్వీకరించి ముద్రాధారణాదిక మొనర్చుకొనిరి. అప్పటినుండి 'అన్నమయ్య' అన్నమయ్యంగారు లేక అన్నమాచార్యులు అయ్యెను. వీరు తమ పదునారవ యేటనుండి శ్రీస్వామివారి దేవస్థానములో శ్రీస్వామివారి సన్నిధిని దినమున కొక సంకీర్తనమునకు తక్కువకాని చొప్పున సంకీర్తనముల రచించి కీర్తించుచుండిరి. వీరిట్లు సుమారు ఎనుబదియేండ్లు అవిచ్ఛిన్నముగ

శ్రీస్వామివారి సమక్షమున సంకీర్తనాగానము చేయుచుండిరి. వీరి శృంగార సంకీర్తనములకు తొలుత ఉన్న ఈ గద్య చూడుడు–

"స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1346 అను నేటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదాఱు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శక వరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ 12 నిరుధానకు (తిరోధానానకు?) తిరువేంగళనాథుని మీదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగారసంకీర్తనలు."

అన్నమాచార్యులు క్రీ.శ. 1408 నుండి క్రీ. శ. 1503 దాక శ్రీస్వామివారి దేవస్థానములో సంకీర్తనాచార్యులుగ నుండిరి.* క్రీ.శ. 1503 నుండియే యితని కుమారుడగు తిరుమలాచార్యుడు తన తండ్రి యాజ్ఞమేరకు స్వామివారి కంకితముగా సంకీర్తనములు రచించుచు వచ్చెను. కావున అన్నమాచార్యులవారు క్రీ.శ. 1503 లో నిర్యాణము చెందినట్లు ఊహింపదగును. తిరుమలాచార్యుల శృంగార సంకీర్తనములకు తొలుతనున్న యీ గద్య చూడుడు–

"శాలివాహన శకవర్షంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 మొదలు గాను తాళ్లపాక అన్నమాచార్యులుంగారు తమ కొమారుండు తిరుమలాచార్యులను దినమొక సంకీర్తన శ్రీవేంకటేశ్వరునకు అంకితం చేశి చెప్పు మనంగాను విన్నపము శేశిన సంకీర్తనలు."

అన్నమాచార్యులు సంగీతసాహిత్యములయందసమాన పాండిత్యము గలిగియుండిరి. సంకీర్తనలక్షణముల నిర్వచించుచు వీరు 'సంకీర్తన' మని సంస్కృతమున నొక లక్షణ గ్రంథమును విరచించిరి. 'సంకీర్తన లక్షణకర్త యగుటచేతను, సంకీర్తనా రచనమున వీరికందపూర్వమైన నిర్మితి సామర్థ్యముండుటచేతను వీరు సంకీర్తనాచార్య' లని విఖ్యాతి బడసిరి.

* అన్నమాచార్యులవారు జీవించిన కాలం 1408–1503, 1408 నుండే దేవస్థానంలో సంకీర్తనాచార్యుడుగా ఉన్నాడని చెప్పడం సరికాదు. (సంపాదకుడు)

ద్రావిడాగమమగు నాలాయిర దివ్యప్రబంధమును వీరు సాంగోపాంగముగా అధ్యయనము చేసిరి. అందుచేతనే వీరు 'ద్రావిడాగమ సార్వభౌము' లని, 'పంచాగమచక్రవర్తి' అని బిరుదముల నందిరి.

వీరి మనుమడు చిన తిరుమలాచార్యుడు* (చిన్నన్న) యాతని చరిత్రమును ద్విపదలో రచించినాడు. అందు అన్నమాచార్యుల మహిమాదికము లెన్నో అభివర్ణింపబడినవి. తెలుగు కవులను గూర్చి ఇతరులు రచించినవి గాని, తమకు తామే రచించుకొన్నవి గాని చరిత్రములు తెలుగులో అరుదనియే చెప్పవచ్చును. 'అన్నమాచార్య చరిత్రము' అట్టి చరిత్రములలో ప్రథమ గణనీయమైన గ్రంథము. అందు ప్రఖ్యాత వాగ్గేయకారకుడు, కర్ణాటక సంగీతమునకు మూలపురుషుడునగు పురందరదాసులవారితో అన్నమాచార్యులకు మైత్రి కలిగి యుండినటుల పేర్కొనబడినది. అన్నమాచార్యుల సంకీర్తనములను, పురందరదాస కీర్తనములను జాగ్రత్తగా పరిశీలింపవలసి యున్నది. అట్టి నిశితపరిశీలనము జరిగినయెడల వారి సంకీర్తనములలో, భావములలో సామ్యములు, ఇక ఎన్నో చరిత్ర సంప్రదాయ రచనాదులకు సంబంధించిన విశేషములు వెల్లడి కాగలవు. అప్పుడు కర్ణాటక సంగీతమునకు పురందరదాసు వలెనే అన్నమాచార్యులు కూడ ఎట్టి గట్టి పునాదులు వేసెనో తెలియగలదు.

అన్నమాచార్యులవారు సంస్కృతమున సంకీర్తన లక్షణమును, తెలుగున శృంగారసంకీర్తనములు, అధ్యాత్మసంకీర్తనములు, శృంగారమంజరి, శృంగార వృత్త పద్యాల శతకము (వేంకటేశ శతకము) లను రచించిరి. అందు, శృంగార సంకీర్తనములలో శ్రీవేంకటేశ్వరస్వామి నాయకుడు. కవి నాయిక. నాయికా నాయకుల శృంగారావస్థలు చిత్రచిత్ర వర్ణనలతో చమత్కారములతో అలరారుచున్నవి. అధ్యాత్మ సంకీర్తనములు భక్తిప్రధానముగా రచింపబడినవి. 'కంసాంతక వేంకటగిరిపతేః, ప్రశంసైవ పశ్చాదిహ నాస్తి'– త్రిదశ వంద్యుడగు

* చినతిరుమలాచార్యుడు చిన్నన్నకాదు. చినతిరుమలాచార్యుడు అన్నమాచార్య చరిత్ర రాయలేదు. అన్నమాచార్యచరిత్ర కర్త చిన్నన్న. (సంపాదకుడు)

తిరువేంకటపతి, వెదకి వెదకి సేవించుడి'- అన్న సందేశమును, జీవన పరమార్థమును ఆధ్యాత్మిక సంకీర్తనములు సంసార విషయలంపటులగు భక్తులకు బోధించుటకు ఉద్దేశింపబడినాయి. వీరి సంస్కృత సంకీర్తన లక్షణము కానరాలేదు.

అన్నమాచార్యుల సంకీర్తనములు, అతనివే కాక తాళ్లపాకవారి సంకీర్తనములన్నియు సంగీతమున, సాహిత్యమున సమాన ప్రాతినిధ్యము గలిగి అసమానమై వెలుగొందుచుండును. ఇక సాహిత్యదృష్టితో మాత్రము చూచిన వీరి రచనలు వెలలేని విలువరాళ్ళు. అపూర్వములయిన ప్రాచీన కవిప్రయోగముల నెన్నిటినో వీరు పుణికిపుచ్చుకొని తమ రచనముల కుదురు కొలిపిరి. ప్రాచీన కావ్యములను మిక్కిలి అక్కరతో శోధించి యందలి అపూర్వ పదజాలమును తమ రచనముల వెలయజేసి సాహిత్య విషయమునను తమ సంకీర్తనముల పుష్టి పరచుకొన్నారు. అందుచేతనే వారి సంకీర్తనములు, వారి రచనములు నేడు మిక్కిలిగా ఆదరింపబడుచున్నవి. చినతిరుమలాచార్యుడు తాను రచించిన 'అష్టభాషా దండకము' లోని గద్యలో అన్నమాచార్యులవారి పలుకులు సరస్వతీ వీణాలాపముల వలె మధురములు, హృదయంగమములు, శ్రావ్యములు అని ప్రశంసించినాడు.

ఇటీవల అన్నమాచార్యుల శృంగారసంకీర్తనములు కొన్ని ప్రకటితము అయినవి.* అందలి యీ సంకీర్తనముల చిత్తగింపుడు.

పాలకురికి సోమనాథుడు పేర్కొనిన తుమ్మెద పదముల రచనవంటి రచన యిది. శ్రీ వేంకటేశ్వరుని తుమ్మెదగా సంబోధించి కీర్తించినది-

శ్రీరాగం-ఏకతాళం

తొల్లిటివలెఁ గావు తుమ్మెదా యింక
నొల్లవుగా మమ్ము నో తుమ్మెదా

* దొరికిన అన్నమాచార్యుల సంకీర్తనలలో శృంగార సంకీర్తనలే ఎక్కువగా ఉన్నాయి. అధ్యాత్మ సంకీర్తనలతోపాటు శృంగార సంకీర్తనలన్నిటిని తి.తి.దే ప్రచురించింది.

తోరంపు రచనల తుమ్మెదా కడుఁ
దూరేవు గొందులే తుమ్మెదా
దూరిన వెఱఁగవు తుమ్మెదా మమ్ము
నోరగాఁ జూడకు వో వో తుమ్మెదా

తొలుప్రాయపు మిండ తుమ్మెదా కడుఁ
దొలిచేవు చేఁగలే తుమ్మెదా
తొలుకరి మెఱుఁగవే తుమ్మెదా యింక
నులికేవు మముగని వో వో తుమ్మెదా

దొరవు వేంకటగిరి తుమ్మెదా మా
తురుమేల చెనకేవు తుమ్మెదా
దొరకె నీ చనవులు తుమ్మెదా యింక
నొరు లెఱింగిరి గదవో వో తుమ్మెదా.

శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిని ప్రాతఃకాలమున పాడిన మేలుకొలుపు పాటయిది.

భూపాలం

విన్నపాలు వినవలె వింత వింతలు
పన్నగపు దోమతెర పైకెత్త వేలయ్యా

తెల్లవాఱె జామెక్కె దేవతలు మునులు
అల్ల నల్ల నంత నింత నదివో వారె
చల్లని తమ్మిరేకుల సారస్యపుఁగన్నులు
మెల్లమెల్లనె విచ్చి మేలుకొన వేలయ్యా

గరుడ కిన్నర యక్ష కామినులు గములై
విరహపు గీతముల వింతతాళాల
పరిపరివిధములం బాడేరు రాగాల నిన్నదివో
సిరి మొగము దెఱచి చిత్తగించ వేలయ్యా

పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు
పంకజభవాదులు నీ పాదాలు చేరి
అంకెల నున్నారు వేచి అలమేలుమంగను
వెంకటేశుడా రెప్పలు విచ్చి చూచి రావయ్యా,

స్వామివారికి నివేదన సమయమున చేసిన సంకీర్తన మిది.

కాంభోజి

ఆరగింపవో మాయప్ప యివే
పేరిన నేతులు పెరుగులును
తేనెలు జున్నులు తెంకాయపాలును
ఆనవాలు వెన్నట్లును
నూనె బూరెలును నురుగులు వడలును
పానకములు బహుఫలములును

పరమాన్నంబులు పంచదారలును
అరిసెలు గారెలు నవుగులును
కరజికాయలును ఖండమండెగలు
పరిపరి విధముల భక్ష్యములు

కడు మధురంబగు కమ్మఁ బూరణపుఁ
గుడుములు నిద్దెనకుడుములును
సుడిగొను నప్పాలు సుకినప్పాలును
పొడిబెల్లముతోఁ బొరటుచును

కాయపురుచులకు గని యగు మిరియపుఁ
గాయలు నేలకికాయలును
పాయరాని యంబాళపుఁ గాయలు
నాయతమగు దధ్యన్నములు

ఒడికపుఁ గూరలు నొలుపుఁ బప్పులును
అడియాలపు రాజాన్నములు
బడి బడిఁ గనకపుఁ బళ్లెరములతోఁ
గడు వేడుక వేంకటరమణా.

ప్రబంధ రత్నావళిలో తాళ్లపాక అన్నమయ్య శతకము లోనిదని పేర్కొనబడిన 'అరిసెలు నూనె బూరెలును నౌగులు చక్కెర మండెగల్' ఇత్యాది పద్యము పై సంకీర్తనముతో సంవదించుచున్నది.

పవ్వళింపుసేవ యప్పుడో లేక "ఊంజల్" ఉత్సవ సందర్భముననో చేసిన సంకీర్తన మయి ఉండును– ఈ సంకీర్తనము జూడుడు.

శంకరాభరణము

గుఱు తెఱిఁగిన దొంగ కూగూగు వీఁడె
గుడిలోనె దాగేని కూగూగు
నెలఁతల దోఁచేని నీళ్లాడఁగానే
కొలని దరిని దొంగ కూగూగు

చల్ల లమ్మంగ చనుకట్టు దొడికేని
గొల్లెతలను దొంగ కూగూగు
ఇల్లిల్లు దప్పక యిందరి పాలిండ్లు
కొల్ల లాడిన దొంగ కూగూగు

తావు కొన్న దొంగఁ దవిలి పట్టుండిదె
గోవులలో దొంగ కూగూగు
శ్రీ వేంకటగిరి చెలువుండో యేమొ
కోవిదుఁడగు దొంగ కూగూగు.

సంకీర్తనము శృంగార విషయకమే అయినను ఒక్కొక్కచోట అది నిగూడార్థ ప్రతిపాదకమయి దుర్భేద్యముగా ఉండును. ఈ సంకీర్తనము చూడుడు:–

మనములోని విభుఁడు మఱవఁ దేకాలంబు
నినుఁ గలయ నున్నాఁడు నీ కేలె వెఱవ
నెలనాళ్ల వాఁడొకఁడు నిర్మలంబైన వె
న్నెలల వాఁడొకఁడు మూన్నెలల వాడొకఁడు
నెలలు పంద్రెండైన నిజబాలుఁ డొక్కండు
నెలఁత యింతటి పనికె నీ కేలె వెఱవ

ప్రొద్దుపొడుపులదొకటి ప్రొద్దుగ్రుంకులదొకటి
ప్రొద్దువొద్దులకు రహి పొయ్యేటి దొకటి
పొద్దెటింగిన దొకటి పొద్దెఱుంగని దొకటి
నిద్దంపుఁ బువ్వులకు నీ కేలె వెఱవ

నిండుఁ జంచల మొకటి నిమిషమాత్రము దొకటి
వుండినట్లనెవుండి వుడివోవు నొకటి
కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు నీ
నిండుఁ గౌగిటి ఁ గూడె నీ కేలె వెఱవ.

ఈ సంకీర్తనములోని చరణముల భావము సృష్టముగా, సంపూర్ణముగా ఎరుక కందలేదు. వీరి సంకీర్తనములు సంగీత సాహిత్యములకు వ్మాయపుష్టి నొసగుటయే గాక ఇది రాగిరేకులపై వారి కాలముననే చెక్కింపబడుటచే ఆనాటి లిపి సంప్రదాయ రీతి భేదముల నెరుగుటకు దర్పణమువలె నుపకరించును. వారి సహాయమున ఆనాటి లిపి సంప్రదాయ చరిత్రమును విస్పష్ట పరిజ్ఞానముతో ఎరుగవచ్చును.

అన్నమయ్య జోల:

తాళ్లపాకవారి కవిత తామ్రఫలకములలోనే ఉండి తలుపుచాటున దాగి ఉండలేదు. ముగ్ధమోహనముగా సింగారించుకొని అక్షర సుందరమై అలరారుచు దేశి సుమముల గొప్పు ముడిచి మేని మెరుగుల మేలి ముసుగు మిసిమివెలార్పగా తెలుగు తెరువుల ఒయ్యారముగా నడక సాగించినది. మూర్తిమంతమైన ఈ

ముగ్ధసౌందర్యమునకు త్రిలింగములోని ముక్కోటి ప్రజానీకము మురిసిపోయినది. తెలుగు పలుకు నెలత ఈ తీరు తీయముల నలవరచుకొని తన నిలయమును కలకల నాడించినది.

అన్నమయ్య జోల అడుగడుగు దండాలవానినే కాదు. యావదాంధ్రమును ఉయ్యేల లూచి జోకొట్టి నిద్ర పుచ్చినది. తెలుగు నెలతలు ఈ జోల పాడి తమ బిడ్డల మురిపించి యేడుపుడిపి సుఖ శయిదల జేసినారు. తెలుగు సిసువు లీ జోల నాలకించి మైమరచి మిన్నులలో విహరించినారు.

జో అచ్యుతానంద జో జో ముకుంద
రావె పరమానంద రామగోవింద. ॥జో॥

ఈ పల్లవితోడి జోలపాటను మన తెలుగు లోగిళ్లలో నేటికిని వినుచుందుము. తెలుగు నెలతల నోళులతో నిపజీవితమై ఇది నాటికిని, నేటికిని, సాక్షరముగా జాలువారుచున్నది. అమృతానందము చేకూర్చుచున్నది. చేకూర్చుకొనుచున్నది. వారి పరిపోషణమే లేకున్నచో నిది యేనాడో అడగారి ఉండెడిది. ఈ జోల పాడుట విని అవ్యయానంద మనుభవించుటే కాని ఈ రచన మెవరిదన్న జిజ్ఞాస నేటి దనుక ఏరికిని కలుగ లేదు. ఇందరి నోళ్లలో పడి నలుగుచున్నను ఈ రచనము అన్నమయ్య దనుట నేటికి నెవరికి తెలియకుండుట నిజముగా అచ్చెరువు కలిగింపగలదు! ఇది అడగారి పోకుండ తమమోము వాకిళుల నెలకొలిపి నిలిపిన తెలుగు నెలతలకు జోహారులు.

శ్రీ విస్సా అప్పారావు పంతులుగారి మాతామహులు తమ సొంతమునకై వ్రాసి ఉంచుకొనిన పాటలను పరిశీలించుచుండగా శ్రీ పంతులుగారి కిది అదాటున దొరికినది. ఈ రచనము అన్నమయ్య దగుట గురుతించి పరమానంద భరితులై వారు ఈ జోలను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారికి వినిపించిరి. శ్రీ శాస్త్రిగారివలన దీని ఉనికి ఎరిగి శ్రీపంతులుగారి కడనుండి దీని ప్రతి వ్రాసి తెచ్చుకొని వారి అనుమతిపై ఇది ప్రకటించుచున్నాను. వారికి నా కృతజ్ఞతా పూర్వక వందనములు.

రాగం-అటతాళం

జో అచ్యుతానంద జోజో ముకుంద
రార పరమానంద రామ గోవింద

నందు నింటను జేరి నయము మీఱంగ
చంద్రవదనలు నీకు సేవచేయంగ
నందముగ వారిండ్ల నాడుచుండంగ
మంద పాకు దొంగ మా ముద్దురంగ

పాల వారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు

అట్టు గట్టిన మీగ దట్టె తిన్నాడె
పట్టి కోడలు మూతిపై రాసినాడే
అట్టె తినెనని యత్త యడుగ విన్నాడే
గట్టిగా 'నిదిదొంగ, కొట్టు' మన్నాడే

గొల్ల వారిండ్లకును గొబ్బునను బోయి
కొల్లలుగా త్రావి కుండలను నేయి
చెల్లునా మగనాండ్ర జెలగి యీశా! యీ
చిల్లతనములు సేయ జెల్లునట వోయి!-

రేపల్లె సతులెల్ల గోపంబుతోను
'గోపమ్మ మీకొడుకు మా యిండ్లలోను
మాపుగానే వచ్చి మా మానములను
నీ పాపడే చెఱిచె నే మందు మమ్మ!'

ఒకని యాలిని దెచ్చి నొకని కడబెట్టి
జగడములు గలిపించి సతిపతుల బట్టి
పగలు నలు జాములును బాలుడైనట్టి
మగనాండ్ర జేపట్టి మదనుడైనట్టి

అంగజుని గన్న మా యన్న యిటు రారా
బంగారు గిన్నెలో బాలు పోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారు
ముంగిట నాడరా మోహనాకారా!

గోవర్ధనంబెల్ల గొడుగుగా బట్టి
కావరంబున నున్న కంసు పడగొట్టి
నేడు మిథిలాపురము నేల జేపట్టి
ఠీవితో నేలిన దేవకిపట్టి!

అంగముగ దాళ్ళపాకాన్నయ్య చాల
శృంగార రచనగా జెప్పె నీ జోల
సంగతిగ సకల సంపదలు నీ వేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల!

సాహిత్యాలంకారముల జంజాటమునుండి చేయిగాళులు విదిలించుకొని ఇతని కవితాకన్య దేశి సొగసులు జేసికొని ఈ రచనలో సహజసుందరమై ఒప్పారుచున్నది. అన్నమయ్య శృంగారాధ్యాత్మ సంకీర్తనాది ఇతర రచనములను జూచి దీనిని జూచిన యెడల రెంటికి గల భేదము సుస్పష్టముగా గోచరించును. సాహిత్యపు బలుపు లేనందుననే యిది సరళమై, సుందరమై అందరి హృదయముల నవలీలగా చూరగొనినది.

ఈ జోల బహుశః అన్నమాచార్యుల కాలమునందు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానములో ఆనాడు భాగవతులలో బహుళ ప్రచారములో నుండిన 'అన్న ఊంజల్ తిరునాళ్ల ' (హంసడోలోత్సవ) సందర్భమున అన్నమాచార్యులు

శ్రీ స్వామివారిపై పాడినదై ఉండవచ్చును. సాళువ నరసింహరాయలవారు క్రీ.శ.1473 విజయలో ఈ డోలోత్సవమును తిరుమల దేవస్థానములో తొలిసారిగా జరిపిరి. అప్పటినుండి ప్రతివర్షము అది ఒక సంప్రదాయము క్రింద పరిణమించినది. ఈ డోలోత్సవము ప్రతివర్షమును తమిళమాసము చిత్ర శుక్ల షష్ఠినాడు ప్రారంభమై యేడుదినములు జరుగును. ప్రారంభ దివసమునకు పూర్వదినము రాత్రి అంకురార్పణము జరుగును. ఆ ఉత్సవదినములలో శ్రీస్వామివారికి ప్రత్యేక కైంకర్యములు మహావైభవముతో జరుగును. ఈ వెచ్చములకై శ్రీసాళువ నరసింహరాయలవారు కలవాయి పర్రులోని దొమ్మరపట్టి అను గ్రామమును కూడ శ్రీస్వామివారికి సమర్పించిరట!

ఈ డోలోత్సవమిట్లు ప్రత్యేక దివసములలో ప్రధానోత్సవముగా మాత్రమే గాక బ్రహ్మోత్సవ దినములలో కడపటినాడును, మకరసంక్రమణ దినమునను జరుపునటుల సాళువ నరసింహరాయల వారే యేర్పరచిరి.

ఈ డోలోత్సవము సాళువనరసింహరాయల కాలములోనే తొలిసారిగా ప్రారంభింపబడుటచేతను, వారి కాలములోనే అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానములో సంకీర్తనాచార్యులుగ వెలయుచుండుటను ఈ జోల తదుత్సవ ప్రారంభ దినములలో పాడియుండ వచ్చునని యూహింపవచ్చును. సాళువ నరసింహరాయల వారిచే నూతనముగా ప్రారంభింపబడు ఈ డోలోత్సవ విషయము విని దేశము నాలుగుమూలలనుండి భాగవతులనేకులు విచ్చేసి తత్సందర్భమున అన్నమయ్య పాడిన ఈ జోలను విని పరవశులై తదాస్వాదమును జీవితమెల్ల ననుభవింప గోరి వారీ పాట నేర్చుకొని యుందురు.

తెలుగు నెలత లీ జోలను అనుదినము తమ నిసుగుల నిద్రపుచ్చుటకు పాడుచు దాని కమృతత్వమును ప్రసాదించియుందురు. ఈ పాట బహుళప్రచారము గాంచిన విధ మిదియే యై ఉండునని ఊహించుచున్నాడను.

అచ్యుతదేవరాయల కాలములో తాళ్ళపాకవారి కొన్ని గ్రామములు సర్వమాన్యములుగా చెల్లుచుండినవి. మెకంజీదొరగారు సేకరించిన లోకల్. రికార్డులలో ఇట్లు కలదు.

'నృసింహ్వరాయల కుమారుడు అచ్యుతదేవ మహారాయలు విజయనగర మందు వజ్రసింహ్వాసనారూఢుండై పృథివి సామ్రాజ్యం శెయుచుండగా కామలాపురం తాలూకాలో బ్రాహ్మల్కు యిచ్చిన అగ్రహారం లున్ను, వారి వారి నాయంకరాన్కు యిచ్చిన వివరం.

1. కామలాపురంన్కు దక్షిణం నాల్గు పరువుల దూరమున మాచనూరు గ్రామము.
2. యీ గ్రామాన్కి పడమర పరువు దూరమున పూర్వం ప్రౌఢదేవరాయల నాడు అల్లిదొన అగ్రహారికులకు యిచ్చిన పెంటపల్లి గ్రామం.
3. యిందు్కు నైరుతి ౧ దూరమున తుమ్మలూరు గ్రామం.
4. యిందు్కు వుత్తరం పొదదుర్తి గ్రామం.
5. దువూరు తాలూకు కామనూరు గ్రామం.
6. చిటివెల తాలూకు తంగటూరు.

ఈ ఆరు గ్రామములుంన్ను తాళ్ళపాకవారికి సర్వమాన్యంగా నడుస్తు వుండెనని ఆ గ్రామస్థులు వాడుతున్నారు. గాని శిలాశాసనముల రుజువు అగపడలేదు. యీ తాళ్ళపాకవారు కవిశ్వరున్ బహుప్రఖ్యాతిగా జనులు వాడుకొనేది కలదు. తాళ్ళపాకవారి కానాడు ప్రజావర్గములో ఎట్టి పలుకుబడి ఉండెడిదో లోకలు రికార్డులలోని పై జనవాక్యమును బట్టి ఊహింపగలము.

తాళ్ళపాక అన్నమయ్య కుమారుడు పెదతిరుమలాచార్యుడు అచ్యుత దేవరాయలవారి జీవితకాలములో సంకీర్తనాచార్యుడుగ వెలయుచుండిన వాడగుటచే ఈ గ్రామములు కూడ నచ్యుతదేవరాయల వారిచే అతనికే ఒసగబడి ఉండవచ్చునని ఊహించుట సత్యదూరము కాజాలదు.

దేవస్థాన శాసన సంచయములో అచ్యుతదేవరాయలు పూండి, సంగమకోట అను గ్రామములను పెదతిరుమలాచార్యునకు తామ్రశాసనము చేసి ఒసగినట్లును, అతడు తనకు సర్వ మాన్యములుగా చెల్లుచుండిన యీ గ్రామములను క్రీ.శ.1532 సం॥లో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సమర్పించినట్లును పేర్కొనబడినది. కాని

ఈ గ్రామముల ప్రసక్తి అందు గానరాలేదు. శాసనదృష్టాంతములు కానరాకున్నను లోకలు రికార్డులలోని జనవాక్యమును బట్టి తాళ్ళపాకవారికి ఆ యారు గ్రామములును అచ్యుతదేవరాయలు ఒసగినట్లును అవి వారికి సర్వమాన్యములుగా చెల్లుచుండినట్లును విశ్వసింపవలసియున్నది.

అన్నమయ్య రచనములు–ఇతనివే కావు–తాళ్ళపాకవారి రచనము లెల్ల సాహిత్యప్రాధాన్యము గలిగి వెలయుచున్నవి. తిరుపతి ప్రాచ్యవిద్యా పరిశోధనా లయాధ్యక్షులు తమ కడ నున్న తాళ్ళపాకవారి రచనముల నెల్ల వెలువరిచి నిజమైన శ్రద్ధ వహింపవలసియున్నది. ఇటువంటి గొప్ప గొప్ప సంస్థలు పుస్తక ప్రకటనమును వ్యాపారదృష్టితోగాక సేవాదృష్టితో లక్షింపవలసియున్నది. తెలుగువారై యుండి తెలుగుపరిశోధన విషయమున వారే ఇట్టి వైఖరితో నుండుట నిజముగా అనుశోచనీయము. తెలుగువారము మనము. లేని అవకాశములు లేకపోగా ఉన్న అవకాశములను గూడ సవ్యముగా వినియోగించు కొనలేక పోయిన యెడల ఇక చెప్పెడిదేమున్నది? ప్రాచీనకావ్య సముద్ధరణము గావించుకొని పరిశోధనమున ఇతర భాషలు ముందంజ వేయుచుండ మనము ఆకుచాటు పిందెల వలె మరిగియుండి గుడుగుడుగుంచము లాడవలసినదేనా? ఒక సంవత్సరమునకు పూర్వ మెప్పుడో ముద్రితమై గ్రంథము వెలువడగా అన్నమాచార్యుల శృంగారసంకీర్తనములు అను గ్రంథము ఇటీవలనే వెలువడిన మరొక గ్రంథముతో భారతికి గత మాన ము విమర్శనార్థము వంపబడుట శ్రీప్రాచ్యవిద్యా పరిశోధనా లయాధ్యక్షులకు తెలుగు పరిశోధనముపై శ్రద్ధలేమి, వైముఖ్యములకు నిదర్శనము కాదా! తాళ్ళపాకవారి రచనముల ప్రకటనము కొంతకాలము నిలిపియుంప బడినదని వినుటచే ఇంతదూరము వ్రాయవలసి వచ్చినదిలి. మనసుండవలెను గాని, రాజుదలచుకొన్న దెబ్బలకు కొదవా? సమర్థులు, పరిశోధనమున పరినిష్ఠిత ప్రజ్ఞాధురీణులు తెలుగు పరిశోధనశాఖలో ఉండగా వారిని సంపూర్ణముగా వినియోగించుకొని వారిచే ఎంతగానైనను పరిశ్రమ చేయించి పుస్తకముల ప్రకటింప జేయవచ్చును. అట్లు చేసినవారు సాహిత్య ప్రపంచమునకు ఎంతేని సేవ చేసిన వారగుదురు. తాళ్ళపాకవారి రచనములనెల్ల పరిష్కరింపించి వెలువరిచిన సహృదయ సాహిత్య ప్రపంచ మెంతేని వారికి కృతజ్ఞము కాగలదు. లేకున్న ఆంధ్రప్రజానీకమునకు వారు నేడు కాకున్న ఏనాటికైనను సమాధానము చెప్పవలసియుండును. దేవస్థానాధికారులును తాళ్ళపాకవారి రచనముల ప్రకటనము నెడ ఇతోధికముగా శ్రద్ధచూపి అవి త్వరలో వెలువరుచు మార్గముల నరయుదురుగాక! ఏతత్కావ్య ప్రకటన నిర్వహణమున వారప్రమత్తులై యుందురుగాక!

* రచయిత ఈ గ్రంథం రాసేనాటికి పరిస్థితి అలా ఉండి ఉండవచ్చు. తరువాత తరువాత తాళ్లపాకవారి రచనలు దొరికినంతవరకు ముద్రితమైనాయి. అన్నమయ్య పెద, చిన –తిరుమలయ్యల సంకీర్తనలన్నీ ప్రకటింపబడినాయి. (సంపాదకుడు)

3. క్షేత్రయ్య పదములు

కదిసిన నోరవోయి మతి కబ్బపుదొంతుల సత్పదార్థముల్
గదుకుచు నెట్టివారి బొడగన్నను గుట్టని స్నేహసౌఖ్యముల్
మదికి నసహ్యమౌ శునక మార్గమునం జరియింపుచున్న త
త్పదకవు లెల్ల మత్కవిత దప్పులు వట్టక యూరకుండుడీ.

అని సాహితీమందిరంలో రాటుదేరిన పాండిత్యం చాటున 'అరచాటగు నాంధ్ర వధూటి చొక్కపుం జనుగవపోల్కి' కనబడీ కనబడునట్టుగా దోబూచులాడే శృంగారాన్ని రచ్చకీర్చి నడివీధిపాలు చేసినారని కసికొద్దీ 'మదికి నసహ్యమౌ శు నకమార్గమునన్ జరియించు' వారని కవి నిందావ్యాజంతో నోరార దూషించి ఒకానొక కవి పదకవులపై తనకుండే అక్కసునంతా ఒక్కమారుగా తీర్చుకొని 'తృప్తోస్మి' అనుకున్నాడు. నేటిదాక సాహిత్యవిమర్శకుల కైతేనేమి, కవి చరిత్రకారుల కైతేనేమి ఇంచుమించు ఇటువంటి భావమే వుండడంచేత పదకవిత్వానికి గాని పదకవులకు గాని లభింపదగినంత ఆదరం లభింపలేదు. వాఙ్మయశాఖల్లో పదకవిత్వశాఖ ఒకటి ఉందనైనా వారు తమ గ్రంథాల్లో ఉటంకించక పోవడం శోచనీయం.

అయితే నిజంగా జాతీయజీవనాన్ని పదకవిత్వం ప్రతిబింబించ గలిగినంతగా తక్కిన యే వాఙ్మయశాఖ కూడా ప్రతిబింబింప లేకపోయిందంటే విడ్డూరం యేమీలేదు. అసలు పదకవిత్వశాఖ తక్కిన వాఙ్మయశాఖల వంటిది కాక కేవలం దేశిసరకు. ఒక విధంగా యీ పదకవులందరూ పదకవిత్వం పేరిట తమ కాలంలోని రుచిరములైన సామాజిక జీవనఘట్టాలనే రచించినా రనడం తప్పు కాదు. భాష, ఛందస్సు, వ్యాకరణము, కథావస్తువు, పాత్రౌచితి అనే కట్టుబాట్లకు లోబడి రావలసి వుండడంచేత ప్రజావ్యవహారంలోని రుచిగల పలుకుబళ్ళూ, నానుడులూ, శ్రుతి

సుభగాలయిన కాకువులు, వేళాకోళములు, వెక్కిరింతలు మొదలయిన వాటికి పద్య కవిత్వంలో లేని అవకాశం పదకవిత్వంలో వుండడమే యీ కవిత్వాన్ని జాతికి సన్నిహితం చేసింది. అన్నమయ్య, క్షేత్రయ్య, సారంగపాణి మొదలయిన పదకవుల సాహిత్యంలో మనకు ఈ విషయమే స్పష్టమవుతుంది.

ఇటీవల పదకవిత్వాన్ని గూర్చి పరిశోధనలు జరగడమూ, ప్రాచీన పదకవుల సాహిత్యం సవిమర్శంగా ప్రకటింపబడడమూ చాలా సంతోషింపదగ్గ విషయం. అన్నమయ్య పద సాహిత్యమంతా తిరుపతిలో సంపుటాలుగా ప్రకటింపబడుతున్నవి. ఆయన శృంగారసంకీర్తనలు ఇటీవలే ప్రచురింపబడినవి. అన్నమయ్యకు తర్వాత పదకవిత్వ పాకాన్ని పలచ బరచి జుర్ర బదను కావించిన మహనీయుడు క్షేత్రయ్య. క్షేత్రయ్య సాహిత్యం మనకు విలువకట్టలేని సాహితీ భాండారం. మన జాతీయ జీవన సర్వస్వం అది.

త్యాగరాజ కీర్తనలను సవ్యాఖ్యానంగా ప్రకటించి ఆంధ్రజాతికి అందించిన ఆంధ్రగానకళాపరిషత్తువారూ, తన్నిర్వాహకులయిన శ్రీవిస్సాఅప్పారావు పంతులుగారు క్షేత్రయ్య సాహిత్యాన్ని లభ్యమయినంతవరకూ సేకరించి అనేక నూతనాంశాలు తెలిపే విపులమయిన పీఠికతో ప్రకటించడం మన అదృష్టం.

క్షేత్రయ్య తన మేరువు పదంలో సుమారు నాలుగువేల ఇన్నూరో లేక నాలుగువేల ఐదువందలో పదాలు రచించినట్టుగా తెలుపుకొని వున్నా మనకవన్నీ లభించడం లేదు. ఇంతకు మునుపు అచ్చైన గ్రంథాలలో 241 క్షేత్రయ్య పదాలు మాత్రమే ముద్రింపబడినవి. తమ పరిశోధన వలన లభించిన సుమారు 90 క్రొత్త పదములను గూడ చేర్చి మొత్తం 330 పదములను శ్రీ అప్పారావుగారు ఇందులో ప్రకటించినారు. కొత్తగా లభించిన 90 పదాలతో, అమూల్యములయిన నూతన విషయాలను తెలిపే విపులమైన పీఠికతో ఈ ముద్రణం పూర్వముద్రిత గ్రంథాలన్నింటి కంటే ముచ్చటగానూ, గుణోత్తరంగానూ వున్నది. భానుదత్తుని రసమంజరికి ఎవరో అజ్ఞాత భావుకుడు క్షేత్రయ్య పదలక్ష్యాలతో రచించిన అనువాదం 'శృంగార రసమంజరి' కూడ యిందుతో ముద్రింపబడినది.

ముద్దుగోపాల నామాంకితములై వున్నప్పటికీ రచననుబట్టి అప్రౌఢ రచితాలుగా కనబడుతుండడంచేత ఇందులో ముద్రింపబడిన పదాలలో కొన్ని ప్రక్షిప్తా లనదగినట్టుగా వున్నవి. ఈ విషయాన్ని సంపాదకులు కూడ పేర్కొన్నారు. ముద్ర మార్పు అతిసులభం కావడంచేత కాబోలు లేఖకుల అజ్ఞానంచేత వేణుగోపాల నామాంకితాలయిన సారంగపాణిపదాలు కొన్ని మువ్వగోపాలముద్రతో క్షేత్రయ్య పదాలుగా వ్రాత ప్రతులలోని కెక్కినవి. నిజంగా సారంగపాణి పదాలే అయి వుండి మువ్వగోపాలపదాలుగా వ్రాత ప్రతులలో ఎక్కిన నాలుగు పదాలు ఇందులో ముద్రితములై వున్నవి.

(1) అక్కరలేని కాపురమాయె (పుట-4)

మూడవ చరణంలో

'తాను వేణుగోపాలు డాయె-దయలు దూరమాయె' అన్న ముద్రమార్పుతో ఈ పదమే సారంగపాణి పదములలో నున్నది. (చూ. ప్రథమభాగము. 54 వ పదము)

(2) ఇంటికి రానిచ్చేనా-యీ మేనితో
నింతి వాని దలచేనా (పుట-21)

అనుపల్లవిలో

'గొంటుకాడై వేణు-గోపాలుడు నాపై' అనీ తుది చరణంలో 'పని బూని వేణుగోపాలా యని పిలిచేనా' అనీ ఇదే పదం ముద్రమార్పుతో సారంగపాణి పదాలలో వున్నది. (చూ. ప్రథమభాగము-39 వ పదము)

(3) తన చిత్తము వచ్చినటులు దయసేయు మనవే (పుట- 120)

అనుపల్లవిలో

'వినవే కార్వేటినగర-వేణుగోపాలదేవునితో' అనే మార్పు మాత్రంతో ఇదే పదం సారంగపాణి పదాలలో వున్నది. (చూ. ప్రథమభాగము 55వ పదము)

(4) తెలిసె నీ నెనరు లేని జాడలు (పుట-129)

అనుపల్లవిలో

'వలదు నిలుపు యీ మాటలకేమి
వచ్చె వేణుగోపాల నా సామి'

- అని ముద్ర మార్పుతో ఇది సారంగపాణి పదాలలో వున్నది. (చూ. ప్రథమభాగము. 43 వ పదము)

ఇదిగాక రాజగోపాల నామాంకితముగా మూవనల్లూరు సభాపతయ్యగారిచే రచింపబడిన యీ క్రింది పదము ఒకటి యిందులో ముద్రింపబడినది.

ఎవతే తాళునమ్మా యీ నడతల-
నే మందునె కొమ్మా (పుట-69)

అనుపల్లవిలో

'సవతి రాజగోపాలు కెక్కువేమొ' అన్నముద్రమార్పుతో ఈ పదము సభాపతయ్యగారి పదాలలో వున్నది. వావిళ్ల ముద్రణాలయమువారు ముద్రించిన క్షేత్రయ పదములలోని నాలుగుపదములు ఇందు ముద్రింపబడలేదు.

'శృంగారరసమంజరి' లో 'నా మేను నీమే ననుచును బలికిన' అను పదము శెట్టివణ్యము పదము అని కుండలీకరణలలో పేర్కొనబడియున్నది. కాని అది సభాపతయ్య పదము. ఇదిగాక శృంగారరసమంజరిలో ఉదాహరింపబడి ఫలానా వారివని గుర్తింపబడని 'ఎందుకు బొంకేవురా లేదని నాతో'-

'ఇచ్చిన మంచిదే యీకున్న మంచిదే' అను పదములు సారంగపాణి పదములు. తక్కిన పదములు కూడ ఎవరివో గుర్తింపబడవలసి వున్నవి.

గ్రంథసంపాదకులు తమ విపులమైన పీఠికలో క్షేత్రయ్య జన్మస్థలాన్ని సోపపత్తికంగా నిర్ణయించడం మాత్రమే గాక పదములను బట్టి ఒక విధంగా క్షేత్రయ్య జీవితచరిత్రను పోల్చుటకు ప్రయత్నించారు. ఇదిగాక పదకవిత్వ చరిత్రము, సంగీతశాస్త్రములో క్షేత్రయపదముల విశిష్టత, క్షేత్రయ మధురభక్తి, క్షేత్రయ పదములలో పూర్వ పదకవుల ఛాయలు మొదలైన అనేక విషయాలను గూర్చి చర్చించడంలో సంపాదకులు అమూల్యములయిన అనేక విషయాలను తెలిపారు.

క్షేత్రయ జన్మస్థలం కృష్ణాజిల్లాలోని మొవ్వ గ్రామమే అనీ, అక్కడి మువ్వగోపాల స్వామికి అంకితములు గానే క్షేత్రయ్య తన పదములను రచించినాడని సంపాదకులు ఇందులో నిరూపించారు. కాని క్షేత్రయ జన్మస్థలం చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూకాలోని మొవ్వ గ్రామమనే అధునాతనుల వాదాన్ని ఖండించడంలో నిమగ్నులై మువ్వ ఉత్తరార్కాడు జిల్లాలోని మూవపుర (Moovapura) మని వ్రాసిన కీర్తనాచార్య సి.ఆర్.శ్రీనివాస అయ్యంగారి వాదమును సంపాదకులు విస్మరించినటుల వున్నది. ఆ వాదాన్ని కూడా సోపపత్తికంగా ఖండించి వుంటే బాగుండేది. ఇతర స్థలాల్లో ఎక్కడా మొవ్వగ్రామం వున్నట్టుగా గుర్తింపబడకపోవడం, కృష్ణాజిల్లాలో మొవ్వ గ్రామం వుండడం, క్షేత్రయ్య మువ్వపురిగోపాల అని పేర్కొనడం ఆ గ్రామంలో మువ్వగోపాలస్వామి దేవాలయం వుండడం, అందులో క్షేత్రయ్య వంశీకులు అని చెప్పుకుంటున్న వారు వుండడం, మువ్వకు దగ్గరలోనే వున్న కూచిపూడిలోని భాగవతులు సాంప్రదాయికంగా పాడి అభినయిస్తూ వుండడం వారి వాదానికి బలమును చేకూరుస్తూ వున్నవి. కానయితే నేడు మొవ్వగ్రామంలో వుంటున్నవారి ఇంటిపేరును బట్టి క్షేత్రయ్య ఇంటిపేరు 'మొవ్వ' వారిని నిర్ణయించడం కొంత సాహసమే. ప్రబలములయిన కారణాలే క్షేత్రయ్య నివాసస్థలం కృష్ణాజిల్లాలోని మొవ్వగ్రామమే అని నిరూపించగలుగుతున్నా సంపాదకులే పీఠికలో క్షేత్రయ్య పాడిన పాదములను బట్టి క్షేత్రయ్య దర్శించినవిగా గుర్తించిన దైవతములు, క్షేత్రములు, చాలవరకు దత్తమండల ప్రాంతములలోనివై వుండడం విచారింపదగిన విషయం. అందులోనూ కొన్ని అప్రసిద్ధములయిన, సాధారణంగా దక్షిణదేశ యాత్రికునికి మార్గంలో తగులని గ్రామదైవతములమీద క్షేత్రయ్య పదాలు చెప్పి వుండడంచేత క్షేత్రయ్య ఈ ప్రాంతాలవారే యేమో అనే సందేహానికి కూడా అవకాశం కలుగుతూ వుంది. క్షేత్రయ్య ఈ ప్రాంతాలవాడు అనే ప్రవాదం కూడా ఈ సందేహానికి కొంత బలం. తాళ్ళపాకతిమ్మక్క సుభద్రాకల్యాణంలో-

పుండరీకాక్షుడా-పురుషోత్తముడ
మురవైరి వందిత-మువ్వగోపాల

నారద వినుత యా- నందముకుంద
మత్స్యావతార నా- మనవి చేకొనుము'

- అన్నచోట పేర్కొన్న 'మువ్వగోపాల' అనే పదం కూడ యెక్కడో కృష్ణాజిల్లాలో వుండే మొవ్వలోని మువ్వగోపాలస్వామిని పేర్కొనునది కాక తిరుపతి ప్రాంతంలోని మువ్వగోపాలస్వామినే పేర్కొనేదిగా వుండి ఈ వాదానికి ప్రాణం పోస్తూ వుంది. ఇక్కడ ఒక్కచోట మాత్రం మువ్వగోపాల అనే పదానికి మువ్వలు ధరించిన గోపాలుడని కాని, మువ్వల వేణుగోపాలుడని పేరుగల కార్వేటినగర వేణుగోపాలుడని కాని అర్థం చెప్పుకోవడం అసహజంగా అగుపించక పోదు. ఇదిగాక చిత్తూరు జిల్లాలోని 'మువ్వలవారిపల్లె' జమీందారీ గ్రామము నేడు గుర్తింపబడనంత మాత్రాన గవర్నమెంటు రికార్డును తప్పనజాలము కదా! క్షేత్రయ్య తిరిగిన స్థలములు సంపాదకులొసగిన పట్టికను బట్టి విజయనగరము వద్ద తుంగభద్రాతీరమున ఉన్న హేమాద్రి, కడప, కడపజిల్లాలోని ఇనంబ్రోలు, కర్నూలులోని పాలగిరి, తిరుపతి, తిరువళ్లూరు, సత్యవీడు[†] (ఇది చిత్తూరి జిల్లాదని యున్నది. అది సరి కాదు. చెంగల్పట్టు జిల్లాలోనిది), చక్కెరపురి, (యిది చక్రపురియై యుండును. ద్విపద నలచరిత్రకారుడైన చక్రపురిరాఘవాచార్యుల తాత చక్రపురి దొడ్డయాచార్యులు షోలింగరులోని కందాళదొడ్డయాచార్యుల శిష్యుడు* చక్రపురి దత్తమండల ప్రాంతములలోనిదై యుండును.) కంచి, శ్రీరంగము, మధుర, శ్రీశైలము, కోవళ్లూరు, చిదంబరము, మహాదేవపట్టణము ఇత్యాదులు. ఇందులో దక్షిణదేశములోనివి మినహాయించగా తక్కిన స్థలములన్నియు దత్తమండల ప్రాంతములవే అయి యుండుట గమనార్హము. 299వ పదములో 'వేదపురి నిలయు' దని కలదు. ఈ వేదపురి ఎక్కడిదో తెలియరాలేదని సంపాదకులు వ్రాసిరి. అది బహుశః 'వాదపురి' అయియుండును. చిదంబరమునకు వాతపురి, వాదపురి అనుపేళ్లు కలవు. క్షేత్రయ్య చిదంబరమునకు పోయి తిల్లగోవిందుని

[†]. ప్రస్తుతం సత్యవేడు చిత్తూరు జిల్లాలోనే ఉంది. (సంపాదకుడు)

* చూడుడు నలచరిత్ర ద్విపద - పీఠిక- పండితారాధ్య చరిత్ర పీఠిక, పుట-140.

మీద పదములు చెప్పినవాడే కనుక 'వాదపురి'- చిదంబరమగు ననుట సమంజసమే అగును. రావిపాటి తిప్పన్న త్రిపురాంత కోదాహరణములో 'వాదపురి' పేర్కొనబడినది.

క్షేత్రయ్య దర్శించిన స్థలములను బట్టి మాత్రమే కాక అతడు తన పదములలో వాడిన భాష, నానుడులు, పదప్రయోగములు, కారకములు కూడ కొన్ని అతనికి దత్తమండల ప్రాంతీయతను ధ్రువపరచుచున్నవి.

13 వ పదములో-

"పామాడి జోగివలె పాయె (పోయెననుటకు నా బ్రతుకు" ఇందు పేర్కొనబడిన పామాడి లేక పామడి అనంతపురముజిల్లా లోనిది. ఆ గ్రామములో మెట్ట వేదాంతులు ఎక్కువ. వారిటు ఇహమునకు అటు పరమునకు చెడినవారగుదురు. అందుచే నా బ్రతుకు పామాడి జోగి బ్రతుకువంటి దైనదని ప్రియవంచిత అయిన నాయిక అనుచున్నది. దత్తమండలములలో వ్యవహారమున నున్న ఈ సామెతను వాడిన క్షేత్రయ ఆ ప్రాంతముల వాడనుట సత్యదూరము కాజాలదు.. ఇదిగాక, వక్కలాకులు, పద్దు (పంతము అను నర్థములో), లోకాస్తమానమైనట్లు, రెండు దలచుట, మోడిచేసుకొనుట, ఎగబోయుట, పాలకుడిగి, నిత్యనిత్యము, పూలంగిసేవ, కుయ్యకు, పటాని పూలపావడ, చెప్పి చాలాయె అనే ఈ పదాలు దత్తమండలాలలో కానవస్తున్నవి.

ఇందుచేత క్షేత్రయ్య జన్మస్థలం మొవ్వ గ్రామమే అయివుండినా జీవితకాలంలో చాలాభాగం రాయలసీమ ప్రాంతాలలో తిరిగి జీవితపు రుచులు అనుభవిస్తూ తంజావూరుకు వెళ్ళివుంటాడని అనుకోవడమో, యీ ప్రాంతాలలోనే నేడు గుర్తింపబడని మువ్వగోపాలస్వామి ఆలయం వుండే 'మువ్వపురి' వుండి ఉండునని అనుకోవడమో సమంజసం అవుతుంది.

సంపాదకులు క్షేత్రయ్య రచించిన కొన్ని పదములను బట్టి అతడి జీవితచరిత్ర ఇట్టిదని చెప్ప బూనడం ఒకవిధంగా సాహసమే అవుతుంది. కవీశ్వరుని చరిత్ర

అందదుకులుగా మనకు లభించినప్పుడు అతడి రచనలో అతని జీవితంలోని ఘట్టాల ఛాయలుగా కనబడే వృత్తాంతాన్ని బట్టి కవి జీవితచరిత్రను పోల్చుకోవడం, పూర్వచరిత్రను పరిపుష్టపరచుకోవడం కొంతవరకూ సమంజసమే అయినా మొదటి నుండి తుది దాకా అంతా వూహలతోనే కథ అల్లడం చాతుర్యమయితే కావచ్చుగాని చరిత్ర కాజాలదు. వరదుని మీద క్షేత్రయ్య రచించిన పదాలను బట్టి సంపాదకులు క్షేత్రయ్య జీవితచరిత్ర ఇట్టిదై వుంటుందని వూహించి చెప్పిన కథ కేవలం కట్టుకథ. క్షేత్రయ్య జీవితచరిత్ర అట్టిదే అయివుంటుందని మనం నిశ్చయించడం సమంజసం కాదు. విశేషించి క్షేత్రయ్య విజయరాఘవనాయకునిమీద చెప్పిన 'సామాన్యము గాదె వాని పొందు' అనే పదంలోని విషయాన్ని క్షేత్రయ్య జీవితచరిత్రకు సంబంధించినదిగా చెప్పడం సమంజసంగాదు. ఆ పదంలో క్షేత్రయ్య తన విషయం చెప్పుకోలేదు. విజయరాఘవనాయకుని విషయం చెప్పినాడు. నామమాత్రంగా విజయరాఘవ నాయకుణ్ణి పేర్కొని తన విషయమే అందులో చెప్పుకొన్నాడని చెప్పడం కుదురదు. ఎందుకంటే విజయరాఘవ నాయకుడు నిజంగా అట్టివాడు. ఆ పదంలోని విషయం విజయరాఘవ నాయకుడికి అక్షరాలా సరిపోతుంది.

శృంగారరసమంజరిని గూర్చి వ్రాస్తూ 'పదములను వ్రాయుటలో అలంకారశాస్త్రములోని రసమంజరిలోని శృంగార ప్రధానములగు సర్వలక్షణము లకును లక్ష్యములను వ్రాయుట క్షేత్రయ్య యొక్క అభిప్రాయమని సంపాదకులు వ్రాయడం కూడ సత్యం కాదు. కాంతాజనం యొక్క మనస్తత్వమూ, వారి అభిరుచులూ, రహస్యాలూ, పలుకులూ, కులుకులూ చక్కగా ఎరిగివుండిన క్షేత్రయ్య రసతన్మయుడై తన ఎరుకనంతా ముంచిఎత్తుతూ భావావేశంతో పదాలు రచించినాడు గాని రసమంజరిని దగ్గర పెట్టుకొని అందులోని లక్షణాలకు లక్ష్యాలుగా పదములు రచించలేదు. శృంగారరసమంజరికారుడు రసమంజరిని అనువదిస్తూ అందలి లక్షణాలకు లోబడే కొన్ని మువ్వగోపాల పదాలను, ఇతర పదాలను లక్ష్యాలుగా పేర్కొన్నాడు. వివిధ నాయికా నాయక లక్షణాలకు సరిపోలుతూ వున్న లక్ష్యాలు మువ్వగోపాల పదాలలోనూ, ఇతర పదాలలోనూ వుండడం గుర్తించి శృంగార

రసమంజరికర్త ఆయా నాయికాది లక్షణాలకు లక్ష్యాలుగా కొన్ని పదాలను పేర్కొనినాడు. అంతేకాని క్షేత్రయ్య రసమంజరిలోని లక్షణాలకు లక్ష్యాలు వ్రాసే వుద్దేశంతో ఈ పదాలు రచించలేదు.

క్షేత్రయ్య అన్నమయ్యను అనుకరించాడని చూపిన ఉదాహరణములలో పోలిక లంతగా కానరావడం లేదు. ఆ ఉదాహరణలు ఒకరినొకరు అనుకరించి నట్టుగా గాక వారివారి ప్రత్యేకతతోనే ప్రతిభాసిస్తున్నవి. పచ్చి శృంగారాన్ని బాహాటంగా తనివిదీర తన మనసార పదములలో ముంచెత్తిన క్షేత్రయ్య పదాలలో అధ్యాత్మతత్వమున్నదని గాని, అందు మధురభావ మిళితమైన రాధాకృష్ణతత్వము– అదే మధురభక్తి–ఉన్నదని గాని చెప్పడం అత్యుక్తి. క్షేత్రయ్య కళామధురమూర్తి! రసైక చక్షుష్కుడయిన భావుకుడు!

అనేక తాళపత్రాలు, వ్రాతప్రతులు పరిశోధించి ముందు అచ్చయిన గ్రంథాలలో లేని సుమారు తొంభై పదాలను సేకరించి అకారాది క్రమంలో మొత్తం మూడువందల ముప్పై పదాలను చక్కని కాగితాల మీద ముచ్చటగా ముద్రింపించి క్షేత్రయ్య సాహిత్యాన్ని మన కందించిన శ్రీవిస్సా–అప్పారావు పంతులుగారు వందనీయులు. వారి అమూల్య కృషి ఫలోన్ముఖం కావడానికి కారకులయి ఈ అమూల్య గ్రంథాన్ని ఆంధ్రలోకాని కర్పించే భాగ్యం ఆంధ్ర గానకళాపరిషత్తు పొందింది. క్షేత్రయ్య పదప్రయోగములను గూర్చి శ్రీమల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు వ్రాసిన కృతిప్రశంస, శ్రీజమ్ములమడక మాధవరామ శర్మగారు 'క్షేత్రయసాహిత్యము' అనే పేరుతో వ్రాసిన వ్యాసమూ ఇందులో ప్రకటింపబడినవి. క్షేత్రయ్య పదప్రయోగ విశేషాలలో కొన్నింటిని మాత్రమే శ్రీసూర్యనారాయణశాస్త్రిగారు దిఙ్మాత్రంగా పేర్కొన్నారు. ఇంకా క్షేత్రయ్య ప్రయోగించిన అనేక పదముల స్వరూపాలను గురించి, వాటి విశేషాలను గురించి చెప్పవలసిన సంగతులు చాలా వుండిపోయినవి. ఈ పదములలోని నానుడులను, సామెతలను ఏర్చి శ్రీ విస్సా అప్పారావుగారు ప్రత్యేకంగా ప్రకటించి భాషా పరిశోధకులకు చాలా సౌకర్యం చేకూర్చారు. అచ్చువేయబడిన పదాలు ఇంక

కొంత ప్రామాణికంగా పరిష్కరింపబడి వుంటే బాగుండేది. యతిస్థలాలు కొన్ని స్థలాల్లో సరిగా గుర్తింపబడకపోవడం, చరణములలోని పాదవిభజన కొన్నిచోట్ల సరిగా లేకపోవడం అర్థదృష్టితో కొన్ని తప్పులు దొరలడం, మొదలైన కొన్ని చిన్నచిన్న పొరబాట్లు మినహాయిస్తే సంపాదకులు ఈ గ్రంథ పరిష్కరణంలోనూ, ముద్రణంలోనూ చూపిన ప్రత్యేక శ్రద్ధ ప్రశంసనీయం.

గ్రంథభాగంలోని ముద్రణ స్ఖాలిత్యాలు కొన్ని–

101 వ పదము రెండవచరణ మిట్లున్నది.

"సరివారు గైకొన్నట్లు యెచ్చైన
సరిగ కోకల సరసముగాను
యింటి వెచ్చానికై పదిరూక లమర్చినావా
యిక యేమో యొక
మంచి వలువతోనే అల్లునికి
ధర నైశ్వర్యము వచ్చితే అ–
ర్ధరాత్రి గొడుగు బట్టినట్లు–

106వ పదములో–

'మువ్వగోపాల నీ– మనసు దెలిసి లేరా'

– అని ఉండవలెను. మువ్వగోపాల అని ముద్రితము.

131 వ పదములో–

మూడవ చరణములో ప్రథమ పాదము

'చెలియ మువ్వగోపాలుడైన శ్రీ వేంకటేశుని'

అని ఉండవలెను.

137 వ పదములో–

వలచిన దాని గూడి వాడిందు రాడాయె

– అని ఉండవలెను.

151 వ పదములో–

మూడవ చరణములోని పాదములు తారుమారుగా ముద్రింపబడినవి. ఆ చరణ మిట్లుండవలెను.

మదనునికేళికి బెదరే వేమె
బెదరి భయంబున జూచే వేమె
మమతదీర ముద్దీయ వదేమె
మదుపు లీయ చెయ్యాడ దదేమె–

157 వ పదములో–

మానినిరో నిన్న–మాపటివేళలో

– అని ఉండవలెను. నిన్ను అని ముద్రితము.

172 వ పదములో–

ప్రథమ చరణములో

కన్నెల వీడముతో–కాటుక మోవితో
వెన్నుని కీల్జడ–వేటుతోను –

అని యున్నది. **'వెన్నున'** అని మాత్రము తప్పొప్పుల పట్టికలో సవరింపబడినది.

'కన్నుల వీడెముతో–కాటుక మోవితో
వెన్నున కీల్జడ– వేటుతోను'–

అని ఉండదగును.

వీడెము వేసికొన్న నోటితో ఎవతో మువ్వగోపాలుని కన్నుల ముద్దు పెట్టుకొనినది. అందుచే అతని కన్నుల కామె పెదవులమీది వీడె మంటినది. ఇతడా నాయిక కాటుక కన్నులను ముద్దు పెట్టుకొనగా ఇతని మోవికి ఆమె కన్నులలోని కాటుక అంటినది. కనుక 'కన్నుల వీడెముతో– కాటుక మోవితో' అనుట సమంజసము. రెండవ చరణములో 'నిద్దుర మబ్బుతోను' అని ఉండవలెను.

189 వ పదము–

వలచేది యొకరి కోసమా? – ఓర్వలేని–చెలులంటేనే రోసమా

అనే పల్లవితో ప్రారంభము కావలెను. ఇది అనుపల్లవిగా ముద్రితము–

198 వ పదములో–

చెలగి మోమున మోము–జేర్చి ముద్దాడుచు నుండ

– అని ఉండవలెను.

235 వ పదములో

ప్రథమచరణ మిట్లుండవలెను.

తియ్యని కెమ్మో వాని–తేనె లానుచును
సయ్యాటమున ప్రొద్దు–జరపనొప్పేవా
పయ్యెద తొలగించి – పాలిండ్లపై నొక్క
చెయ్యొన వెయ్య నొప్పేవా

241 వ పదములో కడపటి చరణము.

'మువ్వగోపాల రమ్మని – ముద్దుబెట్టి కూడగాను
పువ్వుబోణి మోవి తేనె–భుజియించిన చవి దలచి'

– అని ఉండవలెను. ఈ రెండు పాదములకు మధ్య రెండవ చరణములోని 'మరువ వెరవు గొనరట' అను పాదమునకు పాఠాంతరము కాబోలు 'ముదువ వెరవుగాన ఒకట' అను పాదము తప్పుగా పడినది.

245 వ పదములో కడపటి చరణము.

'సకియ నీ చన్గవలు
సంగతి కొండలందురు గాని
కొండలైతే –
కోటతలుపు లేవే
యిక నేమి సేయుదును మువ్వగోపాల–

యిదిగో పాలిండ్లపై

తర్కింప రవికముడి తలుపు గాద'

అని ఉండదగును.

251 వ పదములో–

'మాలిమి తోడను– మువ్వగోపాలస్వామి'

అని ఉండవలెను.

252 వ పదములో

'బాళి తాళ జాలలేనని తా–బలికినదే గురుతు'

అని ఉండదగు. **తానని నదే గురుతు** అని ముద్రితము.

261 వ పదములో

'మూవగోపాలా–ముచ్చట లేలా

నా విధిగాని ని–న్నన బనిలేదు'

అని ఉండదగు పల్లవికి అనుపల్లవికి ప్రాసమును ఇతడు ప్రతిపదమునకు పాటించినాడు. మువ్వగోపాల–అని ముద్రితము.

267 వ పదములో

రెండవ చరణమున ఆరు పాదములు కలవు. మూడవ పాదము **'అలసి మువ్వగోపాలుడు–అనిశము ననుగూడి'** అన్నంతవర కుండవలెను. కడపటి రెండు పాదములకు ఈ చరణమునకు సంబంధము లేదు. అది వేరొక చరణములోని తునుకయై ఉండును. మూడవ చరణము ప్రారంభము **'యేప్రొద్దు ప్రాణవిభుల'** అని ఉండవలెను. దాపున గూడున్న– అన్నదానితో ప్రాసము.

282 వ పదములో

'చెలువుని జూచి మోహించి–

చేకొని యెవతె యున్నదో'

అని ఉండవలెను. **చేకొన దెవతె** అని ముద్రితము. అర్థము కుదరదు.

306 వ పదములో

పగదాయ పూవింటివాడు

–అని ఉండవలెను. **పగదాయె** అని ముద్రితము. విజయరాఘవ ముద్రలో 9వ పదము కడపట.

'కేడెంపు వజ్రాల కమ్మలు ఆ రాణికైతే

జోడించిన వుంగరమ్ములు నాతో నైతే

జాతిగానే యిచ్చుకమ్ములు–ఓరోరి జాణ'

– అని ఉండదగును.

ఇప్పటివరకు ఉపలబ్ధము లయిన పదాలన్నీ ఒకచోట చేర్చుకోవడం జరిగింది గనక ఇక తరువాత క్షేత్రయ్య రచనా రీతులను బట్టి ఆ యా పదాలను ప్రామాణికంగా పరిష్కరించుకొనడం మన వంతు. బహుశ్రమ కోర్చి ఈ పదాలను సేకరించి చక్కగా ముద్రించి రసిక ప్రపంచాని కంతటికీ అందజేసిన శ్రీ అప్పారావు గారికి ఆంధ్రలోకం ఋణపడి వుంది. సంప్రదాయపద్ధతిని స్వరపరుపబడిన క్షేత్రయ్య పదములను గూడ ఆంధ్రగానకళా పరిషత్తువారు త్వరలో ప్రకటింతురుగాక!

4. సారంగపాణి పదములు

సాహితీ సమరాంగణ సార్వభౌములయిన శ్రీకృష్ణదేవరాయలవారు విద్యానగరమున ఉండి పెద్దనాది కవిదిగ్గజములకు ప్రాపును, ప్రోపునునై పెద్దయెత్తున సాహితీసమారాధనము చేయుచుండగా దేశములోని చిల్లరరాజులు, జమీందారులు సంస్థానాధీశ్వరులు చేతులు ముడుచుకొని ఊరక కూర్చుండలేదు. తెలుగునాట నాడు వెలయుచుండిన నూజివీడు, చల్లపల్లి, ముక్త్యాల, పిఠాపురము, పెద్దాపురము, గద్వాల, వనపర్తి, వెంకటగిరి, కాళహస్తి, కార్వేటినగరము మొదలగు రాజాస్థానములు సంగీత సాహిత్యవిద్యా వినోదములు లేనివి కావు. సాహిత్య చరిత్రములో అదియొక సువర్ణఘట్టము! సాహిత్యపోషణ మా నాటి సంస్థానాధీశ్వరుల కొక మధురక్రీడ–పేరు పెంపులు లేని పిల్లజమీందారుడయినను పేరున కేని తన ఆస్థానములో ఒక కవీశ్వరు నుంచికొనును. అతనిచే కావ్యములు రచింపించుకొని ఆనందించును. అది అతనికి ముచ్చట! అందతని కానందము!

కార్వేటినగర సంస్థానము సుమారు రెండు శతాబ్దముల కాలము కవితకు కళలకు పట్టుకొమ్మయై నిలిచినది. కార్వేటినగరప్రభువులు కవితాపట్టభద్రులు, పండితులు, సరసులును. వారి సరస మధుర కర సంస్పర్శమున తెలుగు సాహితీకన్య ఒక క్రొత్త చెలువు నొలసి పులకరించినది. వారి పోషణమున కవీశ్వరులు సుఖ జీవనులై కావ్యరచనానందము సాగించుకొనినారు. వారొసగు చుండిన కవిమేరలు వంశపారంపర్యముగా నేటికిని కొనసాగుచున్నవి. సాహిత్యసమ్రాట్టులు, సంగీత సరస్వతులు అయిన వారి సంస్థానములో సంగీతసాహిత్యములు రెండును సమాన గౌరవముతో అసమానముగా వెలుగొందినవి. సారంగపాణి అను కవీశ్వరుడు కార్వేటినగరమున వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి పేర తదంకితములుగా శృంగార వేదాంత పదములు రచించి విఖ్యాతుడయినాడు. ఇతని పదములు సారంగపాణి

పదములని, వేణుగోపాలపదములని ప్రఖ్యాతి పడసినవి. ఈ పదములు చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో నేటికిని బహుళ ప్రచారము పొందియున్నవి. తిరుత్తని, వెంకటగిరి మొదలగుచోట్ల దేవోత్సవాది విశేష సమయముల యందు ఈ పదములు నాట్యాభినయముతో దేవవేశ్యలచే పాడబడుచున్నవి.

మోహన రాగము– చాపుతాళము

పల్లవి

"నీవే నా శాస్త్రము– నా చేత కాసుంటె
నీ యక్క యింకొక్కతె

అనుపల్లవి

అదిగాకుంటే– దానక్క మఱి యెక్కతె
పోవె పో యెవతైన పుణ్యానికి రాదు
దేవరంభ యైన తే తెమ్మనక పోదు
అతి మోహమున వచ్చి యడుగులపై వ్రాలి
బతిమాలినప్పుడే బాళి యెక్కడ బోయె
పతక మిచ్చితెగాని పలుక నంటివొ లేదొ
మెతుకులు జల్లితే క్షితిలో కాకులు బాతె" **1**

"ఆ నాడు నగరిది అరవైరూపాయాల
తాను పెట్టెలో వుంచి నేనట్టె రాననె
తాను పావడగూర్చి ధరియించుకోవటె
వానలు గురిసితె వాతలు మానున" **2**

"పాతర లాడుచు రాతిరి వేణుగోపాలా
యనుచు నన్నుపరతి గూడిన దెల్ల
యీతగింజ కథ తాతై యున్నది గదే
యేతము వంగేది లోతు నీళ్లకె గాదా **3**

ఈ పదము, ఇట్టివి మరికొన్ని పదములలోని తునుకలు వెంకటగిరి మొదలగు చోటుల ప్రజాసామాన్యము పలుకుబడులకు కూడా ఎక్కినవి.

ప్రఖ్యాత సంకీర్తన కవులు తాళ్లపాక అన్నమయ్య, పెదతిరుమలాచార్యుల శృంగారసంకీర్తనములు సవరని భాషతో సాహిత్యపు బలుపుతో ఉండి పండితమాత్రైక వేద్యమై లోకము వెలుగు చూడజాలక పోయినవిలి. క్షేత్రయ్య పదములు ప్రజా భాషలో ప్రజలకు సన్నిహితములై శృంగారరసమయములయి, అభినయోచితము లగుటచే రసగుళికలవలె ఆస్వాద్యములయి సులభముగా ప్రజాహృదయముల చూరగొన జాలినవి. మువ్వగోపాల పదములను కళావంతులు పాడి అభినయింపగా ఆంధ్రప్రజ రసతన్మయమయినది. క్షేత్రయ్య పదములకు తరువాత ప్రజాహృదయముల చూరగొనజాలిన రచనావైశారద్యముతో బహుళ ప్రచారముతో ప్రఖ్యాతి పడసినవి సారంగపాణి పదములు.

కార్వేటినగరమున తత్పరిపాలకు లొసగిన కవిమేరల ననుభవించుచున్న కవివంశ్యులు కవి శ్రీ చెరుకూరు కృష్ణయ్యగారు ఇట్లు వ్రాయుచున్నారు.

శ్రీసారంగపాణి యను పదరచయిత ఈ గ్రామవాస్తవ్యుడై శ్రీ వేణుగోపాలస్వామి భక్తుడై యుండెను. ఆ పదములను పాడగా నేను కొన్నిటిని విన్నాను గాని నాకు పాఠము లేదు.

ఈ పదములకు 'వేణుగోపాలపదము' లను పేర ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములో రెండు వ్రాతప్రతులు కలవు. ఈ పదములు తొలుత 1872 వ సంఎన మదరాసులో ముద్రించబడినవి (చూడుడు-భారతి-విరోధి జ్యేష్ఠము) ఈ పదములు మరల 1899 వ సం॥న మదరాసులో ముద్రింపబడినవి. అందు ముఖపత్రములో నిట్లున్నది:-

"శ్రీ కార్వేటినగరమందు నెలకొనియున్న శ్రీమద్వేణుగోపాల నామాంకితంబుగా సంగీత సాహిత్య దేశీయ కవిత్వ రచనా చమత్కారియగు సారంగపాణి యను మహాకవిచే రచియింపబడిన సారంగపాణి పదములు. ఇవి ఉప్పల రామానుజాచార్యుల వారిచే పరిష్కరింపబడి యద్దనపూడి సంజీవయ్యగారిచే చెన్నపట్టణం పాత చాకలివేటలో నుండు పమ్మి త్యాగరాయ శెట్టిగారి శ్రీ

రాజరాజేశ్వరీ నికేతన ముద్రాక్షరశాలయందు ముద్రింపించి ప్రచురింపబడియె. 1899 వ సంవత్సరము".

క్షేత్రయ్య మనోహరముగా, శృంగార సమయముగా పదములను రచియింపగా ఇతడు తన కత్తికి రెండువైపులను పదును కలదని తెలుపుటకు కాబోలు శృంగారపదములను, వేదాంత పదములను విరచించినాడు. అన్నమయ్యకువలె ఇతడును శృంగారపదముల కున్నంత జిగిబిగులతో, చిన్నెలు వన్నెలతో వేదాంతపదముల విరచింపగలడు. తన వేదాంతపదములు ప్రధానముగా నాలుగు విభాగములుగా విభాగింపబడినవి. ఆ విభాగములు: శృంగారము, దేశీయము, జాతీయము, కీర్తనలు అనునవి. ఇందలి తొలి రెండు విభాగములలోని పదములు గూడ పురుషవాక్యము, స్త్రీ వాక్యము, సఖీ వాక్యము అను క్రమముతో రచింప బడినట్టున్నవి.

సారంగపాణి వైష్ణవుడు. కార్వేటినగర వాస్తవ్యుడు. కార్వేటినగరమున వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి భక్తుడు. కార్వేటినగర సంస్థానాస్థాన కవీశ్వరుడు. సంగీత సాహిత్య దేశీయ కవిత్వ రచనా చమత్కారి.

ఇంతకుమించి ఈ కవీశ్వరుని గూర్చి విశేషము లేమియు తెలియుట లేదు. ఇతని శృంగారపదములలో కార్వేటినగర సంస్థానాధీశ్వరుడగు మాకరాజు ప్రస్తావమున్నది. అతని పేర మూడు శృంగారపదములు కలవు. చూడుడు-

శంకరాభరణము- ఆదితాళము

పల్లవి

తేనెలూర మాట లాడకు
తెలిసె నీ నెనరు

అనుపల్లవి

మానినీమనోహర శ్రీసాళువ-
మాకరాజ కార్వేటి రాజేంద్రా...
పందు గనుచు వెచ్చాని కడిగితే-
పల్లిపట్టు రెండా- నాపై

కొండెకారి మెడకు మంచి బంగరు-
గొప్పగుండ్ల దండా
నిండుకొలువులో విరులుంచితివా-
నెలత కొప్పునిండా- యిక
వుండవలద యిటువంటి నేస్త-
మువిద నెనయుచుండ వదలకుండ... ॥తేనలూర॥

ఎక్కువైన ముత్యాల పాపట-
యింతి కియ్యలేదా యెన్నో
లెక్కలాడి నా చేతి కిచ్చినది-
యొక్కచీర గాదా
నక్కవినయములు చేసేవారికి -
చక్కని మరియాద- నే
నిక్కమే మంచి నోము నోచితే-
నీకే దయరాదా - యికమీద... ॥తేనలూర॥

మరునికేళి మెప్పించినందుకు-
మగువ కింత ధనమా- నా
సరస జేరి యేలుకొమ్మంటే-
సామీ దంధనమా
అరుదు చేసి యా చెవినే పొగడే-
వౌరా నెరతనమా తన
పెరటిచెట్టు మందుకు గైకోరని-
పెద్దలనగ వినమా- యిది ఘనమా... ॥తేనలూర॥

ఆనంద భైరవి- ఆదితాళము

పల్లవి

దాని కెవ్వరు సాటీ- ఆ వెలది నీకే
తగురా రాజకిరీటీ

అనుపల్లవి

మానితవరగుణ పేటీ నీపై-
మరులు కొన్నదిరా మా బోటీ- యిక నిను
మానదుర భాను సమతేజ-
మాకరాట్కార్వేటి రాజా ॥దాని॥

మగువను సభల నెన్నుదురు-
మామ నదలించు నెన్నుదురు ఆ
వగలాడి పల్వరుస కుదురు
వజ్రమణు లనుచు పల్కుదురు- యీ
జగతి దాని కెవ్వరు నదురు- విరి-
జాజులంపె నీకు నదురు- మంచి
నిగనిగలు గల మొగుదుతమ్ముల-
దెగడు చనుగవ బొగడ తగు నిక.... ॥దాని॥

వనజగంధి కనులతీరు- చూడ-
వలరాజు చేతికిలితీరు- ఆ
ఘనవేణి మెరుగు నూగారు సౌరు-
గణుతింప ఫణు లీదుగారు
నిను రమ్మనె పలుమారు- తూపు-
మొనల కోర్వదు పలుమారు అను-
దినమునను చెలిమనము ననుపెన-
గౌతమి యింతనగ వశమా... ॥దాని॥

సుదతి నెన్నగ శ్రీలమిన్నా- దానిశ్రుతు
ల వైకరి శ్రీలమిన్నా- ఆ
మదవతి లేగౌను సున్నా- నాదు మనవి
వినవా మన సున్నా

బెదరించు కురు లళులకన్నా- గొప్ప
పిరుదులు చక్రముల కన్నా- సామి
అదనిదని మరుకదనమున సతి-
నెదను తమివదలకను గదియర... ॥దాని॥

శంకరాభరణము- త్రిపుటతాళము

పల్లవి

వలదు యీ మాట రేలరా- మది హితవైన-
వనిత యిల్లిది గాదురా

అనుపల్లవి

వెలయు శ్రీమాకరాజ వీరకార్వేట్రాజేంద్ర
చెలులు దెలుపగ దెలిసె నీ
వగలు చాలు పదివేలు...

కరుణ చేతను కోరి- మోహించి యా-
కనకాంగి నిను జేరీ
మఱి మఱి తమి మీఱి- విరహభరముచే-
తరము గాక తారీ మరు బారీ
తరుణీ గురుకుచగిరుల నురమున-
నొరసి మురిసిన సరసమెల్లను
మరచివత్తురి యేర యీ దారి
ఓరోరి... ॥వలదు॥

సగము రే వేళాయెరే - నీ రాకకై
సఖియ యెదురుజూచురా
తగని ముచ్చట లేలరా- నే నొక టంటె-
వెగటు దోచదటరా- బాగేనటరా-
మగువ లెల్లను నగగ నీ విటు
అగడు సేయగ నగున జిగిబిగి

సొగసు మిగులగ పెనగ గలనటరా-
నన్నంటకురా... ॥వలదు॥

సతతమునను చాల - మెచ్చియుండిన
జాణతనము లేల
బతిమాలుకొనే దేలా- వినయములకు నే
నతిబేలనా యిట్లేల - చతురోక్తులేల
తతిని దెలుసుక అతివ వలె బహు-గతుల
నిన్ను పరతుల- నెనయుచు
సతులమేలన ఘనుడ నే జాల- నీ చర్యలేల.... ॥వలదు॥

వనజాక్షి బోటు లెవరైనా- యిచ్చట యున్నా
పని దాని సముఖానా
మనవి జేసిరైన నెరనమ్మిన
చనవరి సుంతైనా
కొనియాడునా అనువుగ ననుదినము యా
జవ్వనిని గలసిన పనులు హొయలుగ
తనిసియున్నది నీకు మనమునా... ॥వలదు॥

పలుమారు యెంత కొసరిన- మునుపటివలెనే
బాళితో మన సిచ్చేనా
చెలువు దనుచు జూచేనా యిక మీద నా-
యిలుజేర రానిచ్చేనా చను విచ్చేనా
తొలుత చెలిమిని కళలు గులుకగ కలసి
మెలసిన సెలవు దలతున
తలపు తెలియని వలపు తగవేనా యేమైనా.... ॥వలదు॥

ఈ పదముల యందు పేర్కొనబడిన మాకరాజునకు ఇతడు సమకాలికుడు. మాకరాజు నేటి కార్వేటినగరప్రభువునకు నాలుగవతరమువాడట! అగుచో ఈ

కవీశ్వరుడు సుమారు నూటయేబది యేండ్ల కింకను మునుపటివాడగును. *ఇట్లు సారంగపాణి కాలము గుర్తింపనగుచున్నది.

మాకరాజు ఆస్థానిలో కవీశ్వరుడుగా రాజసన్మానము లందుచుండిన ఈతడేమి కారణముననో రాజానుగ్రహము కోలుపోయినాడు. రాజాగ్రహమునకు పాలుపడి అనేక కష్టములనుభవించి యుండ బోలును! శృంగారపదముల విరచించుచు అంతదనుక రాజానుగ్రహముతో పైలాపచ్చీసుగా తిరుగుచుండిన ఈతడు ఐహిక విముఖుడై శృంగారపదరచనము మాని భక్తిమయుడై కీర్తనముల రచింపదొడగినాడు. ఆ కీర్తనములలో తన పూర్వజీవితమును పేర్కొనుచు అపుడు తాను తెలియక చేసిన పాపములకై విలపించినాడు. చూడుడు.

అసావేరి– త్రిపుటతాళము

పల్లవి

నీ దివ్యమంగళమూర్తి ధ్యానము భక్తి
నిత్యము కృప సేయవే

అనుపల్లవి

వేదోద్ధారకుడైన వేణుగోపాల నీ
పాదద్వంద్వము నాహృత్పద్మమందున జేర్చి
పుట్టింది మొదలుగ భూపాలకుల గొలిచి
పట్టె డన్నానికై పరుగు లెత్తి
పొట్టనించక మతిలో పొంగుచుంటిని గానీ
పట్టుగ నొకనాడు ప్రద్యుమ్న యననైతి ॥నీ దివ్య॥

నరకహేతువులైన దురితకృత్యములకు
మరగి కండ్ల కావరమున

* మాకరాజు నేటి కార్వేటినగర ప్రభువునకు నాలుగవతరము వాడని వినికినిబట్టి వ్రాయబడినది. మాకరాజు కాలమును గూర్చి నిశ్చయ పరిజ్ఞానము కలవారు తెలుపుదురు గాక!

పరకాంతల మోము లరసి భ్రమసితి గానీ
పురుషోత్తమ నీపై బుద్ధి నిలుప నైతి ॥నీ దివ్య॥
పరమభాగవతుల ప్రల్లదముల పల్కి
గురువుల నిందించి కుటిలుడనై
అరయక తలిదండ్రు లాజ్ఞ మీరితిగాని
స్థిర చిత్తమున హరిని స్మరణసేయ నైతి ॥నీ దివ్య॥

అపకారములకు నే నగ్రగణ్యుడనై
యుపకృతి మాటంటె నుగ్రుడగుచు
అపకీర్తులకు నేనర్హుడైతి గానీ
కపట వామన నీదు కథ చెవుల విననైతి. ॥నీ దివ్య॥

యతుల దూషణ చేసి యెదటి మేలోర్వక
కృతులు మానవుల కర్పితము జేసి
గతవాసరము లీగతి దాటించితి గానీ
పతితపావన సద్గతి జూపుమననైతి ॥నీ దివ్య॥

రాజానుగ్రహము తప్పినది. దారిద్ర్యము చుట్టుకొనినది. బంధువులకు పలుకే బంగార మయినది. గడనుడుగు మగని జూచి కులసతి కోపము వహించినది. కుమారులు చేరదీసి యాదరింపలేదు. మిత్రులు బుద్ధులు చెరుప జూచుచుండిరి. ఇట్టి దీనావస్థలో కవీశ్వరుడు పాడిన కీర్తన మిది అప్పటి అతని అవస్థను కన్నులకు గట్టుచున్నది. *

ధన్యాసి– చాపుతాళము

పల్లవి

నిన్ను నే విడువాను నీ పేరు మరువను
నీ బంటు బంటైనానూ

* పై పదాన్ని, మరికొన్ని ఇలాంటి పదాలను ఆధారం చేసుకొని సారంగపాణికి అలాంటి అవస్థ కలిగిందని అనుకోవడం తప్పు, దానికి మరొక ఆధారం లేదు. (సంపాదకుడు)

అనుపల్లవి

అన్న యెన్నటికి బ్రసన్నుడ వౌదువో
వెన్న ముచ్చిలి దిన్న వేణుగోపాలా

నలుగురు బంధువులు దలచకయున్నను
నరనాథు దలగినాను
కులసతి మెండొద్దుకొని పలుకకున్నను
చెలికాండ్రు బుద్ధులు చెరుపవచ్చినాను...
పాపాత్ము దనుచు కృపారహితు డైనాను
భాషించకుండిననూ

కోపగించి లక్షకొదవ లెంచినాను
మాపు రేపనుచు యేమరి యూరకున్నాను
కామక్రోధాదు లెక్కడ వదలకున్నాను
స్వాములు దూరినను
లేమి వచ్చి యొకరు లెక్కసేయకున్నాను
ప్రేమ మరచి సుతులు
యేమరి యున్నాను....

మరియొక్క పదములో గూడ భూపతులు పొగడినందులకై విలపించు చున్నాడు.

కల్యాణి– ఆదితాళము

పల్లవి

నిన్ను గొలిచి యొరుల వేడబోయితే
నీ కపకీర్తి గాదా

అనుపల్లవి

పన్నగవైరివాహ వేణుగో
పాలరాయ యాపన్నసహాయ....
చేరితీ శుభము లిమ్మనుచు చల

పోరితీ భూపతుల బొగడి గో
జారితీ అజ్ఞానుడనై బహు
దూరితీ వేసారితీ
కోరితీ హరికథ వీనుల విన
మీరితీ దుష్టనరుల సంగతి
దారితీ మాయ దెలియుటకు మిము
జేరితీ భారతీశ నుతపద...

మరొక్క చోట **'కోపము జేసే నరనాథు కొలువు గొలిచే దొకరోత'** అని పేర్కొనినాడు.

పోతన, అన్నమయ్య, త్యాగరాజు మొదలగు మహాభక్తుల చరిత్రము లన్నిట ఇట్లే విషాదమేఘము లావరించుట మన మిచట గుర్తింపవలసి యున్నది.

ఇతడు ఉంఛవృత్తితో జీవించుచుండినటులు తెలియుచున్నది. భిక్షాటన మునకు పోయినపుడు తనకు గలిగిన అనుభవముల ఏకరువు పెట్టుచున్నాడు. చూడుడు.

సౌరాష్ట్రరాగము–చాపుతాళము

పల్లవి

అక్షయపాత్రకు పోతే కలదని వొక
భిక్షము వేయరయ్యా– మూల

అనుపల్లవి

నిక్షేపము త్రవ్వి నెత్తిన బెట్టేరా
కుక్షింభరులు వేణుగోపాల నా స్వామి

తెచ్చుకోవలె నని కొందరు రాలే
తేబోయి నారంట కొందఱు – ఒట్టి
గచ్చులకైనాను కడకు బోయినానని
ముచ్చువలెనే తలుపుమూలకు ఒరిగేరు...

లేవ పాలుమాలి కొందఱు– లోన
దేవర వుందని కొందరు – నడవ
దోవ కడ్డమై యెట్టి దోశిలి ముడుచుక
నీ వొల్లోని గింజలేవి సూపమనేరు....

ఈ ప్రొద్దు పొమ్మని కొందఱు– కాని
యింగో నాడైనాని కొందఱు – యిట్టి
పాపాత్ముల యముడు పట్టి కట్టకమునుపే
కాపాడే దేలా గోపాల నా స్వామి....

ఉంఛవృత్తితో బ్రతుకు వా రిట్టు లిట్టులుండ వలెను. తరువాతి తరముల వారి కొక పథకము తయారుచేసి ఒసగినాడు. ఈ పదము చూడుడు:

శంకరాభరణము– ఆదితాళము

పల్లవి

ఉంఛవృత్తితో బ్రతికే వారికి
వుగ్రము కారాదు

అనుపల్లవి

పంచసాయకు గన్న వేణుగో
పాల దేవ యెందున వగలేక...

అమ్మా, అక్కా, అయ్యా యనవలె
పొమ్మంటె తలవంచుక పోవలె
రొమ్మున తంబుర మీటుచు బాడుచు
రోసపడక యిల్లిల్లు తిరుగవలె...

ప్రొద్దెక్కక మునుపే రారాదు
పొంచులు విని బైట చెప్పరాదు
హద్దు మీఱి లోనికి పోరాదు
ఆడంగుల జూచి నవ్వరాదు

వెంట నొకనిని బిలుచుక రారాదు
వేయకుంటే హఠము సేయరాదు
కొంటెలతో వాదుకు పోరాదు
కోరని కోరికలు కోరరాదు

కొంచె మనుచు గోజాడగరాదు
కొట్లాడేచోట నిలువరాదు
సంచి జూచుకొన యెదబడరాదు
చాల దనుచు తిరుగ రారాదు....

చెయ్యి దుడుకు సాహసము కారాదు
చేత తలుపు తట్టి పిలువరాదు
బియ్య మమ్మేది తెలియరాదు
భీష్మీకరించుక పోరాదు....

ఇచ్చి పెట్టినది దొరికిం దనవలె
యిప్పటి కిది పదిలక్ష లనవలె
తెచ్చి నందులో ముష్టి వేయవలె
దేవుడే రక్షకు డనుకోవలె....

కార్వేటినగరమునకు సుమారు ఎనిమిదిమైళ్ల దూరమున పల్లిపట్టు అను గ్రామము కలదు. ఆ గ్రామమునందు వరదరాజస్వామి దేవాలయము కలదు. వరదరాజస్వామి నామాంకితములుగా ఇతడు మూడు శృంగారపదములు విరచించినాడు. మచ్చున కొక్కటి–

ముఖారి– ఆదితాళము

పల్లవి

చాలు చాలు వాని నేస్తము యిక
నేలనె మనకూ – ఓ

అనుపల్లవి

బాలరో! వరదనారాయణు
దాలతాంగి గూడి మెలగియుండుటె....

ఆసజెప్పి గుడిముందర యిచ్చిన
బాస మఱచె కొమ్మా యీ
దోసకారి యెందరినో యీవగ
మోసబుచ్చె నమ్మా
నా సరైన చెలులు విన్న వికవిక
నవ్వరేమమ్మ- విన
దోసమో కలిగిన మా టంటె
రోస మెందు కమ్మ- పోవమ్మ ॥చాలుచాలు॥

తనువు తనది జేసియున్న నావం
తైన దలచదమ్మా- యేదొక
మనవి దాని కెరిగింపక వినదట
మంచిపనే నమ్మా

నెనరు వాని జాడ లాడకాదకు
నేడు గంటి కొమ్మా- అతి
వినయ మెల్ల ధూర్తలక్షణ మనే
విధమాయ గదమ్మా- లేవమ్మా... ॥చాలుచాలు॥

వరదనారాయణ సామెంత
వంచనవా దమ్మ- నా
సరస జేరి నను గూడి లేదనుచు
సాధించే గదమ్మ
యిరవు పళ్లిపట్టైతేనే తన
యెక్కు వెవరి కమ్మా- యే

మెరుగ నట్టివాని వలెనె యుండి
యెంత జేసె నమ్మా- వలదమ్మా... ॥చాలుచాలు॥

అన్నృణసరోవర తీరమున వెలసిన ప్రసన్నవేంకటేశ్వరస్వామి మీదను, నారాయణవనమున వెలసిన కల్యాణవేంకటేశ్వరస్వామిమీదను, తిరుత్తని సుబ్రహ్మణ్యస్వామిమీదను కూడ ఇతడు పదముల విరచించినాడు. తిరుత్తని చెంగల్వరాయనిపై పాడిన పదమిది చూడుడు.

ఆనందభైరవి – ఆదితాళము

పల్లవి

నీ యింటికి నీవు వచ్చేటందుకు
నెలత నంపవలెనా

అనుపల్లవి

రాయబారమా చిఱుతని చెంగల్వ
రాయా యిది మాబాగాయె...
ఎపుడు వత్తువని యెదురే జూచుచు
యెవరు వచ్చిన శకునము లడుగుచు
కపటదైవాల కెల్ల మ్రొక్కుచు
కఱగుచున్నను చే బిలుచుచు ॥నీ యింటికి॥

ఒకటి రెండనుచు దినములు యెంచి
వద్ద దిరుగు చిలుకల నదలించి
సుకము లేక పైపై తమి మించి
సొలయుచున్నను పొందదలంచి ॥నీ యింటికి॥

చెలుల కందరికి లంచము గట్టి
శయ్యమీద చెక్కిట చెయిబెట్టి
వలరాయని రోయబార దిట్టి
వగచుచున్న నాపై దయ బుట్టి ॥నీ యింటికి॥

తిరుత్తనిలో జరుగు దేవోత్సవములను, కార్వేటినగరము వేణుగోపాలస్వామి తెప్ప తిరునాళ్లను, నారాయణవనమున సంతలను, పుత్తూరులో నేటికిని జరుగు అగ్గి తిరునాళ్లను, ధర్మరాజు తిరునాళ్లను వర్ణించుచు ఇతడు పదముల విరచించినాడు. తిరునాళ్లను వర్ణించు పదముల నితడు ప్రజాభాషలో ప్రజాభిరుచులకు ప్రతిబింబములుగా ప్రజల పలుకుబడులతో విరచించుట గమనార్హమై ఉన్నది. అగ్గి తిరునాళ్లను వర్ణించుపదమును అదే పలుకుబడితో అభినయించి చూపినపుడది హృదయంగమముదుననుట సందేహము లేదు. *అగ్గి తిరునాళ్ల పదమిది చూడు.

ఆరభి– చాపుతాళము

పల్లవి

అగ్గి తిరుణాలంట– అజ్జుని కతలంట
అవురా యెంతరు పొద్దేమే– భారత కత
ఔరా యెన్నె న్నింతలే!

అనుపల్లవి

సుగ్గీజయము దీని సుట్టు బలాదూరు
అగ్గురోరపు అయ్యో ర్నడిగే నీ సాచ్చిగ ॥అగ్గి॥

* ఈ అగ్గితిరునాళ్లు పుత్తూరులో నేటికిని గొప్ప వైభవముతో జరుగుచుండును. ప్రతి సంవత్సరమునను చిత్రమాసములో ఈ తిరునాళ్లు జరుగునట! దీనినే ధర్మరాజు తిరునాళ్లని కూడ చెప్పుదురు. అగ్గితిరునాళ్ల సందర్భమున ద్రౌపది ఒడిలో నిప్పుగుడ్డ కట్టుదురు మరియు అగ్గిగుండములో దుముకుటకు ముందు అందు నిమ్మపండును, పుష్పములను పడవైచెదరు. ద్రౌపది ఒడిగా గట్టిన వస్త్రమును కాలక ఉండుటయును, నిమ్మపండును, పుష్పములను వాడక ఉండుటయును అగ్గిలో దుముకువారికి నిదర్శనములు. ఈ అగ్గి తిరునాళ్ల సందర్భమున ధర్మరాజుదేవాలయములో మహాభారత శ్రవణము నియతముగా జరుగును. పాండవ నాటకములను ప్రదర్శింతురు. ఆ ముచ్చటలనే ఈ పదము పేర్కొనుచున్నది.

యిగనేసు పయి నెక్కి యీబీసనూ దొచ్చి
బగు పెగ్గె లెన్నెన్నో బలికీ దుశ్శాసుని
మొగము చూడగానె మొర్చ నాయాలట్టె
గుగురుమిగురనకుండ గుడ్డెల్ల గుక్కెనె ॥అగ్గి॥

అనుమంతెనకటోడు– అబిమన్ను డంటనె
సనియు నోలె బట్టి సాముసేయుచు అట్టె
యినయె యీరబద్రు నిసనకాయలు దొక్కి
కనురెప్పేశేతల్కి కర్ణుని శించనె ॥అగ్గి॥

యిరన్నేచ్చు చడ్డకు డింద్రజిత్తోక రెయ్యి
దురివోదనుని శెయిలోదూరి ముక్కున నెల్లి
అరశి పిపాశోలె అశ్వద్దామను మింగి
సురివోదమాయనే– సూడయేడిగున్నె ॥అగ్గి॥

III. వ్యాకరణము

సంధులు

సంస్కృత సంధులు

సంస్కృత పదములకు, సంస్కృత పదములకు మధ్య కలుగు సంధులను సంస్కృత సంధులు అందురు. సంస్కృత సంధులలో అచ్చులు, అచ్చులు కలిసి సంధి ఏర్పడినచో వాటిని "అచ్ సంధులు" అని, హల్లులు, హల్లులు కలిసి సంధి జరిగినచో వానిని "హల్సంధులు" అని అందురు. పాఠ్యప్రణాళికలో సంస్కృత సంధులలో కేవలము నాలుగు అచ్ సంధులు మాత్రమే చేర్చబడినవి. అవి. 1.సవర్ణదీర్ఘ సంధి, 2. గుణ సంధి, 3. వృద్ధి సంధి, 4. యణాదేశ సంధి.

1. సవర్ణదీర్ఘ సంధి :

సవర్ణమనగా ఒకే అక్షరమని అర్థము. అ, ఇ, ఉ, ఋలకు సవర్ణములు పరమైనచో వాని దీర్ఘములు ఏకాదేశమగును.

ఉదా: దేవ + ఆలయము = దేవాలయము (అ + ఆ = ఆ)

కవి + ఇంద్రుడు = కవీంద్రుడు (ఇ + ఇ = ఈ)

గురు + ఉపదేశము = గురూపదేశము (ఉ + ఉ = ఊ)

మాతృ + ఋణము = మాతౄణము (ఋ + ఋ = ౠ)

2 గుణ సంధి :

అకారమునకు ఇ, ఉ, ఋలు పరములైనచో క్రమముగా ఏ, ఓ, అర్లు ఏకాదేశమగును.

అ + ఇ = ఏ

అ + ఉ = ఓ

అ + ఋ = అర్

ఉదా: రాజ + ఇంద్రుడు = రాజేంద్రుడు

మానవ + ఉత్తముడు = మానవోత్తముడు

దేవ + ఋషి = దేవర్షి

3. వృద్ధి సంధి :

అకారమునకు ఏ, ఐలు పరములైనపుడు ఐకారము, ఓ, ఔలు పరములగునపుడు ఔకారము ఏకాదేశమగును.

అ + ఏ - ఐ = ఐ

అ + ఓ - ఔ = ఔ

ఉదా: ఏక + ఏక = ఏకైక

దివ్య + ఓషధి = దివ్యౌషధి

దేశ + ఔన్నత్యము = దేశౌన్నత్యము

4. యణాదేశ సంధి:

ఇ, ఉ, ఋ అను అక్షరములకు అసమానమైన అచ్చు పరమైనచో క్రమముగా య్, వ్, ర్లు ఆదేశమగును.

ఉదా: అతి + అంతము = అత్యంతము (ఇ + అ = య్)

అణు + అస్త్రము = అణ్వస్త్రము (ఉ + అ = వ్)

పితృ + ఆజ్ఞ = పిత్రాజ్ఞ (ఋ + అ = ర్)

5. అనునాసిక సంధి :

క-చ-ట-త-ప లకు న-మ అనే అనునాసికాక్షరాలు పరమైనపుడు క్రమముగా ఆయావర్గ అనునాసికాక్షరములు ఆదేశమగును.

క		ఙ
చ	న	ఞ
ట	లేక	ణ
త	మ	న
ప		మ

ఉదా: వాక్ + మయము = వాఙ్మయము

రాట్ + మణి = రాణ్మణి

జగత్ + నాటకము = జగన్నాటకము

5) విసర్గ సంధి:

విసర్గసంధులు పలువిధాలుగా ఉంటాయి. వానిలో ప్రధానమైన ఐదింటిని గూర్చి తెలుసుకుందాము.

విసర్గకు శ-ష-సలు పరములగునపుడు క్రమముగా శ-ష-సలు వచ్చును.

ఉదా: మనః + శాంతి = మనశ్శాంతి

చతుః + షష్ఠి = చతుష్షష్ఠి

తపః ం సిద్ధి = తపస్సిద్ధి.

విసర్గకు శ-ష-స-క-ఖ-ప-ఫలు తప్ప మిగిలిన హల్లులు పరమగునపుడు ఓకారము ఆదేశమగును.

ఉదా: మనః + హరము = మనోహరము

శిరః + రత్నము = శిరోరత్నము

అయః + మయము = అయోమయము

తపః + మహిమ = తపోమహిమ

విసర్గకు చ-ఛలు పరమగునపుడు శకారమును, ట-ఠలు పరమగునపుడు ష కారమును, త-థలు పరమగునపుడు సకారమును వచ్చును.

ఉదా: తపః + చర్య = తపశ్చర్య

ధనుః + టంకారము = ధనుష్టంకారము

మనః + తాపము = మనస్తాపము

అహస్, స్వస్, అంతస్, ప్రాతస్, పునస్ మొదలైన శబ్దాల సకారానికి ర కారం వస్తుంది. వీనిలో సకారమనగా విసర్గ.

ఉదా: అహః + నిశలు = అహర్నిశలు

అంతః + జాతీయము = అంతర్జాతీయము

పునః + ఉద్ధరణ = పునరుద్ధరణ

పునః + ముద్రణ = పునర్ముద్రణ

అకారేతర అచ్చు తరువాత ఉన్న విసర్గకు హల్లు పరమయితే రకారం వస్తుంది.

ఉదా: ముహుః + ముహుః = ముహుర్ముహుః

చతుః + ముఖుడు = చతుర్ముఖుడు

ధనుః + విద్య = ధనుర్విద్య

6) జశ్త్వసంధి:

క–చ–ట–త–పలకు అచ్చులు గాని, గ–జ–డ–ద–బలుగాని, ఘ, ఝ, ఢ, ధ, భలు గాని హ–య–వ–రలు గాని పరమైతే గ–జ–డ–ద–బలు ఆదేశంగా వస్తాయి.

ఉదా: వాక్ + ఆడంబరం = వాగాడంబరం

సత్ + గతి = సద్గతి

సత్ + భావము = సద్భావము

మహత్ + వాచకము = మహద్వాచకము.

7) శ్చుత్వసంధి:

సకార, తవర్గాలకు, శకారచ వర్గములు పరములగునపుడు క్రమంగా శకార, చవర్గములే ఆదేశమగును.

ఉదా: తపస్ + శక్తి = తపశ్శక్తి

సత్ + చరిత్రము = సచ్చరిత్రము

యావత్ + జీవితము = యావజ్జీవితము.

తెలుగు సంధులు

సంస్కృతములోని సంధికి, తెలుగులోని సంధికి కొంచెము భేదమున్నది. తెలుగులోని సంధికి సూత్రము ఇది.

సూత్రము: పూర్వపరస్వరంబులకు పరస్వరంబు ఏకాదేశంబగుట సంధియనంబడు. తెలుగులో పూర్వపదము చివర, పరపదము మొదట అచ్చు

ఉండాలి. ఆ రెండు అచ్చులకు బదులుగా పరపదము మొదట ఉన్న అచ్చు ఏకాదేశముగా వచ్చినచో అది సంధి.

ఉదా : రాముడు + అతడు = రాముడ్ + ఉ + అ + తడు

రాముడ్ + అ + తడు = రాముడతడు

1) అత్వ సంధి : అత్తునకు సంధి బహుళముగానగు.

హ్రస్వమైన అకారమునకు అచ్చుపరముగా వచ్చినచో కొన్ని చోట్ల నిత్యముగా, కొన్ని చోట్ల నిషేధముగా, కొన్నిచోట్ల వైకల్పికముగా, కొన్నిచోట్ల అన్య విధముగా సంధి జరుగును.

ఉదా: సీత + అమ్మ = సీతమ్మ (నిత్యము)

అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను (నిషేధము)

మేన + అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు (వైకల్పికము)

ఒక + ఒక = ఒకానొక (అన్యవిధము)

2) ఇత్వ సంధి : 1. ఏమ్యాదుల ఇత్తునకు సంధి వైకల్పికముగానగు.

ఏమి, మఱి, షష్ఠీ విభక్తిలోని 'కి', అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి మొదలైనవి ఏమ్యాదులు.

ఉదా: ఏమి + అంటివి = ఏమంటివి, ఏమియంటివి

2. క్రియాపదములందు ఇత్తునకు సంధి వైకల్పికముగానగు.

ఉదా: వచ్చిరి + అప్పుడు = వచ్చిరప్పుడు, వచ్చిరియప్పుడు

3. క్త్వార్థంబైన ఇత్తునకు సంధి లేదు.

ఉదా: వచ్చి + ఇచ్చెను = వచ్చియిచ్చెను

4. మధ్యమ పురుష క్రియల యందు ఇత్తునకు సంధియగును

ఉదా: ఏలితివి + అపుడు = ఏలితివపుడు

3) ఉత్వ సంధి : 1. ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు.

ఉదా: రాముడు + అతడు = రాముడతడు.

అతడు + ఎక్కడ = అతడెక్కడ

2. ప్రథమేతర శత్రర్థ చువర్ణములందున్న ఉకారమునకు సంధి వైకల్పికము గానగును.

ఉదా: నన్నున్ + అడిగె = నన్నడిగె, నన్నునడిగె

వచ్చుచున్ + ఉండెను = వచ్చుచుండెను, వచ్చుచునుండెను

4) యడాగమ సంధి : సంధి లేనిచోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

ఉదా: మా + అమ్మ = మాయమ్మ

మీ + ఇల్లు = మీయిల్లు

5) గసడదవాదేశ సంధి: 1. ప్రథమమీది పరుషములకు గ స డ ద వలు బహుళముగానగు.

ఉదా: వాడు + కొట్టె = వాడుగొట్టె, వాడుకొట్టె

అపుడు + చనియె = అపుడు సనియె, అపుడు చనియె

వారు + పోరు = వారు వోరు, వారు పోరు

2. ద్వంద్వంబున పదంబుపై పరుషములకు గ స డ ద వ లు అగు.

ఉదా: కూర + కాయ = కూరగాయలు

తల్లి + తండ్రి = తల్లిదండ్రులు

ఊరు + పల్లె = ఊరువల్లెలు.

6) రుగాగమ సంధి: 1. కర్మధారయమునందు పేదాది శబ్దములకు ఆలు శబ్దము పరంబగునపుడు రుగాగమంబగు. (పేద, బీద, జవ, కొమ, బాలింత, మనుమ, ముద్ద, గొడ్డు మొదలైనవి పేదాదులు)

ఉదా: పేద + ఆలు – పేద + రు + ఆలు = పేదరాలు

బీద + ఆలు – బీద + రు + ఆలు = బీదరాలు

మనుమ + ఆలు – మనుమ + రు + ఆలు = మనుమరాలు

2. కర్మధారయమునందు తత్సమ శబ్దములకు ఆలు శబ్దము పరంబగునపుడు అత్వంబునకు ఉత్వంబును రుగాగమంబునగు.

ఉదా: ధీర + ఆలు – ధీరు + రు + ఆలు = ధీరురాలు

గుణవంత + ఆలు – గుణవంతు + రు + ఆలు = గుణవంతురాలు

7) టుగాగమ సంధి : 1. కర్మధారయములందు ఉత్తునకు అచ్చు పరంబగునపుడు టుగాగమంబగు.

ఉదా: కఱకు + అమ్ము – కఱకు + టు + అమ్ము = కఱకుటమ్ము

నిగ్గు + అద్దము – నిగ్గు + టు + అద్దము = నిగ్గుటద్దము

2. కర్మధారయమునందు పేర్వాది శబ్దములకు అచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు. (పేరు, చిగురు, పొదరు మొదలైనవి పేర్వాదులు)

ఉదా: పేరు + ఉరము = పేరు + టు + ఉరము = పేరుటురము, పేరురము

చిగురు + ఆకు = చిగురు + టు + ఆకు = చిగురుటాకు, చిగురాకు

8) ఆమ్రేడిత సంధి: 1. అచ్చునకు ఆమ్రేడితంబు పరమగునపుడు సంధి తరచుగానగు.

ఉదా: ఔర + ఔర = ఔరౌర

ఆహా + ఆహా = ఆహాహా

2. ఆమ్రేడితంబు పరంబగునపుడు కడాదుల తొలియచ్చుమీది వర్ణంబులకెల్ల అందంతంబగు ద్విరుక్తటకారంబగు. (కడ, ఎదురు, కొన, చివర, తుద, మొదలైనవి కడాదులు.)

ఉదా: కడ + కడ = కట్టకడ

చివర + చివర = చిట్టచివర

పగలు + పగలు = పట్టపగలు

3. ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తిలోపంబు బహుళంబుగానగు.

ఉదా: అప్పటికిన్ + అప్పటికిన్ = అప్పటప్పటికిన్, అప్పటికినప్పటికిన్

ఇంటన్ + ఇంటన్ = ఇంటింటన్, ఇంటనింటన్

4. ఆమ్రేడితంబు పరంబగునపుడు మధ్యమ ము డుజ్జులకు లోపంబు విభాషనగు.

ఉదా: ఉండుము + ఉండుము = ఉండుండుము, ఉండుముండుము

కొట్టుడు + కొట్టుడు = కొట్టు కొట్టుడు, కొట్టుడు కొట్టుడు

5. అందదుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగ గ్రాహ్యంబులు.

ఉదా: అదుకు + అదుకు = అందదుకు

తుమురు + తుమురు = తుత్తుమురు

మిట్లు + మిట్లు = మిఱుమిట్లు.

9) త్రికసంధి : ఆ, ఈ, ఏ అను సర్వనామములు త్రికము అనబడును. త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు.

ఉదా: ఆ + కన్య = ఆ + క్కన్య

ఈ + చోటు = ఈ + చ్చోటు

ఏ + విధము = ఏ + వ్విధము

ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడు ఆచ్చికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.

ఉదా: ఆ + క్కన్న - అ + క్కన్న = అక్కన్య

ఈ + చ్చోటు - ఇ + చ్చోటు = ఇచ్చోటు

ఏ + వ్విధము - ఎ + వ్విధము = ఎవ్విధము

10) సరళాదేశ సంధి (ద్రుత ప్రకృతిక సంధి): ద్రుతప్రకృతికము మీద పరుషములకు సరళములగు.

వివరణ: న కారాన్ని ద్రుతం అంటారు. ద్రుతం చివర ఉన్న పదం ద్రుత ప్రకృతికం. ద్రుత ప్రకృతికానికి క చ ట త పలు పరమైతే వానికి బదులుగా క్రమంగా గ జ డ ద బలు వస్తాయి.

ఉదా: పూచెను + కలువలు = పూచెను గలువలు

తోచెను + చుక్కలు = తోచెను జుక్కలు

ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషలు విభాషనగు.

వివరణ : పై సూత్రం ప్రకారం పరుషానికి బదులుగా ఆదేశంగా వచ్చిన సరళాలను ఆదేశసరళాలు అనవచ్చు. ఆ ఆదేశంగా వచ్చిన గ జ డ ద బలకు ముందు ద్రుతం ఉంటుంది. ఆ ద్రుతానికి నిండుసున్నాగాని, అరసున్నాగాని, సంశ్లేషగాని వైకల్పికంగా వస్తుంది. ఈ మూడు రూపాలు రాకపోతే సహజరూపం ఉంటుంది.

ఉదా: పూచెను + కలువలు = పూచెను + గలువలు

- ను అనే ద్రుతానికి బిందు సంశ్లేషలు వస్తే

పూచెంగలువలు (నిండుసున్న)

పూచెఁగలువలు (అరసున్న),

పూచెన్గలువలు (సంశ్లేష)

పూచెనుగలువలు (సహజరూపం)

తోచెను + చుక్కలు

తోచెను + జుక్కలు

తోచెంజుక్కలు (నిండుసున్న)

తోచెఁజుక్కలు (అరసున్న)

తోచెన్జుక్కలు (సంశ్లేష)

తోచెను జుక్కలు (సహజరూపం)

11) ద్విరుక్త టకార సంధి: కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దంబుల అ-డలకు అచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు.

వివరణ: ద్విరుక్తటకారమనగా ట్ట. కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దములలోని ఱ, డలకు అచ్చుపరంగా వస్తే ఱ, డలకు బదులుగా ట్ట్ ఆదేశంగా వస్తుంది.

ఉదా: కుఱు + ఉసురు = కుట్టు + ఉసురు = కుట్టుసురు

చిఱు + ఎలుక = చిట్టు + ఎలుక = చిట్టెలుక

కడు + ఎదురు = కట్టు + ఎదురు = కట్టెదురు

నడు + ఇల్లు = నట్టు + ఇల్లు = నట్టిల్లు

నిడు + ఊర్పు = నిట్టు + ఊర్పు = నిట్టూర్పు.

12) నుగాగమ సంధి: షష్ఠీ సమానమునందు ఉకార, ఋకారములకు అచ్చు పరంబగునపుడు నుగాగమంబగు.

వివరణ: షష్ఠీ తత్పురుష సమాసంలో ఉకారానికి గాని, ఋకారానికి గాని అచ్చు పరంగా వస్తే 'న్' ఆగమంగా వస్తుంది.

ఉదా: రాజు + ఆజ్ఞ = రాజు + న్ + ఆజ్ఞ = రాజునాజ్ఞ

విధాతృ + ఆనతి = విధాతృ + న్ + ఆనతి = విధాతృనానతి.

సమాసంబుల ఉదంత స్త్రీనమములకు, పుంపులకు, పరుష సరళములు పరంబగునపుడు నుగాగమంబగు.

వివరణ: స్త్రీసమము అనగా ప్రథమా విభక్తి లోపించిన తెలుగుపదము. హ్రస్వమైన ఉకారము చివర ఉన్న స్త్రీసమానికిగాని, ముపర్ణకానికి ఆదేశంగా వచ్చిన పుంపులకు గాని పరుషములు, సరళములు పరంగావస్తే నుగాగమం వస్తుంది.

ఉదా: చిగురు + కయిదువు = చిగురు + ను + కయిదువు

(ఉదంత స్త్రీ సమానికి పరుషం పరంగా వచ్చింది కాబట్టి నుగాగమం వచ్చింది)

తళుకు + గజ్జెలు = తళుకు + ను + గజ్జెలు

ఉదంత స్త్రీ సమానికి సరళం పరంగా వచ్చింది కాబట్టి నుగాగమం వచ్చింది)

సరసము + పలుకు = సరసపు + పలుకు = సరసపు + ను + పలుకు

(పుంపులకు పరుషం పదంగా వచ్చింది కాబట్టి నుగాగమం వచ్చింది)

చిగురు + ను + కయిదువు = సరళాదేశసంధి ప్రకారం

చిగురుంగయిదును, చిగురుఁగయిదువు చిగురున్గయిదువు

అనేక రూపాలు ఉంటాయి.

తళుకు + ను + గజ్జెలు = తళుకుంగజ్జెలు, తళుకుఁగజ్జెలు, తళుకున్గజ్జెలు

సరసపు + ను + పలుకు = సరసపుంబలుకు, సరసపుఁబలుకు, సరసపున్బలుకు

ఉదంత స్త్రీసమములకును, పుంపులకును, అదంత గుణవాచకంబులకు – తనంబు పరంబగునపుడు నుగాగమంబగు.

వివరణ: ఉదంత స్త్రీసమాలకు గాని, పుంపులకు గాని, హ్రస్వమైన అకారము చివర ఉన్న తెల్ల, నల్ల వంటి గుణవాచకములకు గాని తనము పరంగా వస్తే నుగాగమము వస్తుంది. తరువాత సరళాదేశసంధి సూత్రాలు వర్తిస్తాయి.

సొగసు+తనము = సొగసు+ను+తనము=సొగసుందనము, సొగసుఁదనము సొగసున్దనము.

సరసపు + తనము = సరసపు + ను + తనము సరసపుందనము, సరసపుఁదనము, సరసపున్దనము.

తెల్ల + తనము = తెల్ల + ను + తనము తెల్లందనము, తెల్లఁదనము తెల్లన్దనము

సమాసములు

అర్థవంతమైన పదాల కలయిక సమాసం. వేరు వేరు అర్థాలు గల పదాలు ఒకే పదంగా ఏర్పడడాన్ని సమాసం అంటారు. సమాసంలో కనీసం రెండు పదాలు ఉంటాయి. అందులో మొదటి పదాన్ని పూర్వపదము అంటారు. సమాసంలోని రెండవ పదాన్ని ఉత్తరపదము అంటారు. సమాసంలోని లోపించిన విభక్తి ప్రత్యయాలను చేర్చి చెప్పడాన్ని లేదా సమాసం యొక్క అర్థాన్ని తెలియజేసే వాక్యాన్ని విగ్రహవాక్యము అంటారు. సమాసములు భాషను బట్టి 3 విధాలు. అవి – 1. సాంస్కృతికము, 2, ఆచ్ఛికము, 3, మిశ్రమము.

1 . సాంస్కృతికము : సంస్కృత పదాలతో ఏర్పడు సమాసము సాంస్కృతికము. ఇది మళ్ళీ రెండు విధాలు. ఎ) సిద్ధము, బి) సాధ్యము.

ఎ) సిద్ధము : సంస్కృతపదాలు సంస్కృతంలోనే సమాసంగా ఏర్పడితే అది సిద్ధము. ఉదా: రాజాజ్ఞ, తటాకోదకము

బి) సాధ్యము : సంస్కృతపదాలు తెలుగులోనికి వచ్చిన తరువాత తత్సమాలుగా సమాసం ఏర్పడితే అది సాధ్యము.
ఉదా: రాజునాజ్ఞ, తటాకము నుదకము.

2. ఆచ్ఛిక సమాసము : అచ్చతెనుగు పదములతో ఏర్పడు సమాసము ఆచ్ఛిక సమాసము.
ఉదా : తేని యాన, చెరువునీరు.

3. మిశ్రమము : సమాసంలోని రెండు పదాల్లో ఒకటి తత్సమము ఒకటి అచ్చ తెనుగు పదము ఉంటే అది మిశ్రమము.
ఉదా: సిరి వల్లభుడు, చెరువు జలము.

పై ఉదాహరణలో సిరి, చెరువు అనేవి ఆచ్ఛిక పదములు. వల్లభుడు, జలము అనేవి తత్సమములు.

అర్థ ప్రాధాన్యాన్ని బట్టి సమాసములు ఆరు విధములు.

1. అవ్యయీభావ
2. ద్విగువు
3. ద్వంద్వము
4. బహుువ్రీహి
5. కర్మధారయం
6. తత్పురుష

1. అవ్యయీభావ సమాసం: లింగ, వచన, విభక్తులలో మార్పు చెందనివి అవ్యయములు. ఒక అవ్యయముతో ఇతరపదం కలిసి సమాసంగా ఏర్పడితే అది అవ్యయీభావ సమాసమగును. ఇది పూర్వ పదార్థ ప్రధానమైనది.

అవ్యయములు: యథా, అను, ప్రతి, ఉప, సర్వదా, ప్రాతర్, అంతర్ మొదలైనవి అవ్యయములు.
ఉదా: యథా ప్రకారం – ఎప్పటి ప్రకారంగానే ఇందులో యథా అనునది అవ్యయం. ప్రకారం వేరొక పదం.
మరికొన్ని ఉదాహరణలు : ప్రతిదినము, యథావిధి, అనుగుణము, ఉపవనం,

2. ద్విగువు: సంఖ్యావాచక విశేషణం పూర్వపదంలో ఉంటే అది ద్విగు సమాసము. అంటే పూర్వపదంలో సంఖ్య ఉండే సమాసము,
ఉదా: ముల్లోకములు – మూడు అను సంఖ్యగల లోకములు, మూడైన లోకములు
నవగ్రహాలు – తొమ్మిది అను సంఖ్యగల గ్రహాలు, తొమ్మిది అయినగ్రహాలు
సప్తసముద్రాలు – ఏడు అను సంఖ్యగల సముద్రాలు, ఏడైన సముద్రాలు

3. ద్వంద్వ సమాసం: సమాసంలోని రెండుపదాలకు సమానమైన ప్రాధాన్యం ఉన్న సమాసం. సమాసంలోని రెండుపదాలు నామవాచకాలుగా ఉంటాయి. రెండు పదాలకు క్రియతో అన్వయం ఉంటుంది.

ఉదా: రామలక్ష్మణులు – రాముడు మరియు లక్ష్మణుడు

తల్లిదండ్రులు – తల్లి మరియు తండ్రి

అన్నదమ్ములు – అన్న మరియు తమ్ముడు.

4. బహుువ్రీహి సమాసం: సమాసంలోని రెండు పదాలకు ఉన్న అర్థంకాక మరొక అర్థాన్ని ఇచ్చే సమాసం బహువ్రీహి. బహువ్రీహి సమాస విగ్రహ వాక్యంలో కలది, కలవాడు అనే పదాలు వస్తాయి.

ఉదా: గరళకంఠుడు – గరళము కంఠమునందు కలవాడు

శీతాంశుడు – చల్లనైన అంశువులు కలవాడు.

ముక్కంటి – మూడు కన్నులు కలవాడు

పద్మాక్షి – పద్మముల వంటి కన్నులు కలది.

చిగురుబోడి – చిగురు వంటి మేను కలది.

వ్యతిరేకార్థంతో ఉండే బహువ్రీహిని నఞ్ బహువ్రీహి అంటారు. దీని విగ్రహవాక్యంలో లేనిది, లేనివాడు అనే పదాలు వస్తాయి.

ఉదా: అబల – బలము లేనిది

అచ్యుతుడు – చ్యుతి (నాశనము) లేనివాడు.

5. కర్మధారయ సమాసం: విశేషణ విశేష్యాలతో ఏర్పడే సమాసం కర్మధారయం. ఉపమాన ఉపమేయాలతో ఏర్పడే సమాసాలు కూడా కర్మధారయ సమాసాలే. సమాసంలోని రెండు పదాలు ఒక వస్తువు యొక్క ధర్మాన్ని బోధిస్తాయి కనుక దీన్ని సమానాధికరణం అనికూడా అంటారు. ఇవి.

ఎ) విశేషణ పూర్వపదం: సమాసంలోని పూర్వపదం విశేషణంగాను, ఉత్తరపదం విశేష్యంగాను ఉండే సమాసం.

ఉదా: మధుర వచనం – మధురమైన పచనం

సుందర మందిరం – సుందరమైన మందిరం

వృద్ధ కపోతం – వృద్ధమైన కపోతం

బి) విశేషణ ఉత్తరపదం: సమాసంలోని పూర్వపదం విశేష్యంగాను ఉత్తరపదం విశేషణంగాను ఉండే సమాసం.

ఉదా: కపోత వృద్ధము – వృద్ధమైన కపోతము

రాజవరులు – శ్రేష్ఠులైన రాజులు

పురుషోత్తముడు – ఉత్తముడైన పురుషుడు

సి) విశేషణ ఉభయపదం: సమాసంలోని రెండు పదాలు విశేషణాలుగా ఉండే సమాసం.

ఉదా: శీతోష్ణం – శీతము, ఉష్ణము అయినది.

ధీరోదాత్తుడు – ధీరుడు, ఉదాత్తుడు అయినవాడు

సరసమధురము – సరసమును, మధురమును అయినది.

డి) ఉపమాన పూర్వపదం: ఉపమానం పూర్వపదం, ఉపమేయం ఉత్తరపదంగా ఉండే సమాసం.

ఉదా: చిగురుకేలు – చిగురువంటి కేలు

తేనెమాట – తేనెవంటి మాట

బింబోష్ఠము – బింబము వంటి ఓష్ఠము

ఇ) ఉపమాన ఉత్తరపదం: సమాసంలోని పూర్వపదం ఉపమేయంగా, ఉపమానం ఉత్తరపదంగా ఉండే సమాసం.

ఉదా: పాదపద్మం – పద్మమువంటి పాదం

తనూలత – లతవంటి తనువు

హృదయ కమలం – కమలం వంటి హృదయం

ఎఫ్) సంభావనా పూర్వపదం: సంభావన అనగా పేరు. సమాసంలోని పూర్వపదం సంజ్ఞావాచకంగాను, ఉత్తరపదం జాతి వాచకంగాను ఉండే సమాసం.

ఉదా: గంగానది – గంగ అను పేరుగల నది

ద్వారకానగరం – ద్వారక అనే పేరు గల నగరం

మల్లెపువ్వు – మల్లె అను పేరుగల పువ్వు

జి) అవధారణా పూర్వపదం లేక రూపక సమాసం: ఉపమానోపమేయాలకు అభేదం చెప్పే సమాసం.

ఉదా: దయామృతం – దయ అనెడి అమృతం

విద్యాధనం – విద్య అనెడి ధనం

సంసార సాగరం – సంసారమనెడి సాగరం

6) తత్పురుష సమాసం: దీన్ని వ్యధికరణం అని కూడా అంటారు. సమాసంగా ఏర్పడేటప్పుడు పూర్వపదం యొక్క విభక్తి లోపిస్తుంది. లోపించిన విభక్తి ప్రత్యయం ఏ విభక్తికి చెందిందో, అది ఆ తత్పురుష సమాసం అవుతుంది.

ఎ) ప్రథమా తత్పురుష : పూర్వపదము ప్రథమావిభక్తి ప్రత్యయాంతములుగా ఉండే సమాసములు.

ఉదా: అర్థరాజ్యం – రాజ్యము యొక్క అర్థం

మధ్యయుగం – యుగము యొక్క మధ్యభాగం.

బి) ద్వితీయా తత్పురుష : ద్వితీయావిభక్తి ప్రత్యయాలైన నిన్, నున్, లన్, కూర్చి, గురించి లోపించిన సమాసాలు.

ఉదా: నెలతాల్పు – నెలను దాల్చినవాడు

విద్యార్థి – విద్యను అర్థించువాడు.

సి) తృతీయా తత్పురుష : తృతీయా విభక్తి ప్రత్యయాలైన చేతన్, చేన్, తోడన్, తోన్ లోపించిన సమాసాలు.

ఉదా: మతిహీనుడు – మతిచేత హీనుడు

జ్ఞానవృద్ధుడు – జ్ఞానము చేత వృద్ధుడు

డి) చతుర్థీ తత్పురుష : చతుర్థీ విభక్తి ప్రత్యయాలైన కొరకున్, కై లోపించిన సమాసాలు.

ఉదా: లోకహితము – లోకము కొరకు హితము

దేవ పూజ – దేవుని కొరకు పూజ.

ఇ) పంచమీ తత్పురుష : పంచమీ విభక్తి ప్రత్యయాలైన వలనన్, కంటెన్, పట్టి లోపించిన సమాసాలు.

ఉదా: దొంగభయం – దొంగవలన భయం

గ్రహదోషం – గ్రహంవలన దోషం

ఎఫ్) షష్ఠీ తత్పురుష : షష్ఠీ విభక్తి ప్రత్యయాలైన కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ లోపించిన సమాసాలు.

ఉదా: రామబాణం – రాముని యొక్క బాణం

తపఃఫలము – తపస్సు యొక్క ఫలం

జి) సప్తమీ తత్పురుష : సప్తమీ విభక్తి ప్రత్యయాలైన అందున్, నన్ లోపించిన సమాసాలు.

ఉదా: పురజనులు – పురమందలి జనులు

మాట నేర్పరి – మాటల యందు నేర్పరి.

హెచ్) నఞ్ తత్పురుష : వ్యతిరేకార్థాన్ని తెలియజేసే 'న' పూర్వ పదంగా ఉండే సమాసం. దీని విగ్రహవాక్యంలో లేనిది, కానిది అని ఉంటుంది.

ఉదా: అనాసక్తి – ఆసక్తి లేనిది

అన్యాయం – న్యాయము కానిది

అపూర్వం – పూర్వం కానిది.